స్థాపితం : 1930 LONGEST LIVING NEWSPAPER IN TELUGU JOURNALISM

స్థాపకుడు : నెల్లూరు వెంకట్రామానాయుడు జీవప్రదాత : నెల్లూరు శ్రీరామమూర్తి

# జమీన్‌రైతు

సంపుటి : 80 సంచిక : 20 1-5-2009 శుక్రవారం 16 పేజీలు విడి ప్రతి : రూ. 5/-

## జిల్లాలో కాంగ్రెస్‌కు బోణీ అనుమానం

ఏప్రెల్ 23తేది పోలింగ్‌కు రెండు రోజుల ముందు వెలువడిన 'జమీన్‌రైతు' పత్రికలో మేము వెలుబుచ్చిన అభిప్రాయం - నెల్లూరు జిల్లాలో కాంగ్రెస్ పార్టీ కనుమరుగు కాబోతున్నదన్న అనుమానం. పోలింగ్ తర్వాత ఈ అంచనా మరింత బలపడిందే తప్ప, సందేహాలేవీ మిగలలేదు. మా అభిప్రాయం కాంగ్రెస్‌వాదులకే కాక, సాధారణ ప్రజలకు కూడా నచ్చదని మాకు తెలుసు. వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి మీద జనంలో విపరీతమైన మోజు వుందని, ఆయనకు ఓటు వేయడానికి జనం ఆతృతపడ్డారని సర్వ జనాభిప్రాయం. అందువల్లనే మా అంచనాలను ఎవరికి విన్పించినా తిరస్కరిస్తున్నారు. తెలుగుదేశం పట్ల దురభిమానంతో, కాంగ్రెస్ పట్ల ద్వేషంతోనో, ప్రజారాజ్యం పట్ల ప్రేమతోనో ఏకపక్షవాదన చేస్తున్నామని, వాస్తవ దూరంగా ఆలోచన చేస్తున్నామని వ్యాఖ్యానిస్తున్నారు.

ఈ విమర్శలు, వ్యాఖ్యానాల వల్ల ఒకటికి రెండుసార్లు పోలింగ్ నాటికి కేంద్రాల వద్ద వున్న పరిస్థితిని సమీక్షించవలసి వచ్చింది. అయితే ఎంత తరచి చూసినా మా అభిప్రాయం సరైనదన్న నమ్మకం బలపడుతున్నదే తప్ప అనుమానాలు కలగడం లేదు.

నెల్లూరు జిల్లాలో ఈసారి ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్‌వాదులకు అశనిపాతాల వలె వెలువడడం ఖాయం. వైఎస్ బొమ్మతో, తమ డబ్బుతో, అధికారం అండతో, కార్యకర్తల బలంతో, ప్రతిపక్షాల బలహీనతతో తాము సునాయాసంగా గెలిచిపోతామన్న విశ్వాసంతో వున్న కాంగ్రెస్ అభ్యర్థులు కౌంటింగ్ కేంద్రాలలో తీవ్రమైన నిరాశ నిస్పృహలకు లోను కావడం తప్పదు. జిల్లాలోని మొత్తం పది స్థానాలలో ఒకటంటే ఒక్క దానిలో కూడా కాంగ్రెస్ అభ్యర్థి నికరంగా గెలువబోతున్నాడని చెప్పడం వీలు కావడం లేదు. ఒకటి రెండు చోట్ల వారికి గెలుపు అవకాశాలు వున్నప్పటికీ, మొత్తం మీద పరిస్థితి చూస్తే మాత్రం నెల్లూరు జిల్లా ప్రజానీకం కాంగ్రెస్ పార్టీని తిరస్కరించినదని చెప్పక తప్పదు.

### ఇదీ అంచనా!

| | | |
|---|---|---|
| తె.దేశం | : | 6 |
| ప్రరాప | : | 2 |
| కాంగ్రెస్ | : | 2 |
| మొత్తం | : | 10 |

నెల్లూరు జిల్లాలో ఎన్నికల ఫలితాలు ఏకపక్షంగా వుండడం ఆనవాయితీ. 1978, 1983, 1989, 1994, 2004 ఎన్నికలలో అప్పటికి జిల్లాలో వున్న 11 స్థానాలలో పదింటిని ఒకే పార్టీ గెలుచుకొన్నది. ప్రతి ఎన్నికలో ఒకటంటే ఒక్కటి మాత్రమే ఇతర పార్టీలకు దక్కుతూ వస్తున్నది. 1985, 1999లలో

తొరవ 14వ పేజీలో

## కల్లగా మారిన కల

మళ్లీ అధికారంలోకి రావాలని ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఎంత గొప్ప కలలు కన్నాడో కాంగ్రెస్ వాదులకే కాక సాధారణ ప్రజలకు కూడా తెలుసు. తన కల నిజమౌతుందన్న ధీమా ఆయనలో ఇప్పటికీ వుంది. గత ఐదేళ్లుగా తాను చేసిన మంచి పనులకు ప్రజల నుంచి అనూహిత ఆదరణ లభిస్తున్నదని, ఓటర్లలో కృతజ్ఞతా భావం పొంగి పొర్లుతున్నదని వైఎస్‌కు ఓటు వేయకుంటే చేతులకు కుష్టు రోగం వస్తుందని గ్రామీణ ప్రాంత ప్రజలు, రైతులు భావిస్తున్నారని ఆయన నమ్ముతున్నాడు. ఆ నమ్మకంతోనే ఈ ఎన్నికల ఫలితాలను అంచనా వేస్తున్నాడాయన. ఆరు నూరైనా నూరు ఆరైనా తాను మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని నమ్ముతున్నాడు. ఆయనే కాదు, కోస్తా, రాయలసీమ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, పోటీచేసిన అభ్యర్థులు కూడా అదే విశ్వాసంలో వున్నారు. 1978 నాటి పరిస్థితులు పునరావృతమౌతాయని, అప్పుడు జరిగిన త్రికోణపు పోటీలో ఇందిరమ్మ కాంగ్రెస్ గెలిచిన చందంగా ఇప్పుడు తాము గెలవబోతున్నామని ఆశ పడుతున్నారు.

ఇందుకు వీరు చెప్తున్న కారణాలు - గత ఐదేళ్లలో చేసిన మంచి పనులు.



అధికారమనే ఆశల పల్లకి తునాతునకలు?

దాదాపు 50 లక్షల మందికి నెల నెలా ఠంచనుగా పింఛన్లు అందజేస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వం. అంతకుక్రితం తెలుగుదేశం హయాంలో కొత్త పింఛన్ల మంజూరు అతికష్టంతో కూడుకొన్న పని. ఎవరో ఒకరు చనిపోతే, ఆ ఖాళీలో కొత్త వారికి ఇచ్చేవారు. అందువల్ల పింఛన్లు కోరే ముసలీ ముతక జనం, తమ వూర్లో పింఛన్లు పొందేవారు చస్తే బాగుండునని ఆలోచన చేసేవారు. కానీ వైఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎవరికి కోరితే వారికి మంజూరు చేశాడు. ఆ కృతజ్ఞతతో ఆ ముసలి వాళ్లంతా తనకు ఓటు చేస్తారన్నది ఒక నమ్మకం.

చిదంబరం ప్రకటించిన రైతుల అప్పుల రద్దు పథకం - వైఎస్ ఖాతాలో జమపడింది. వైఎస్ వల్లనే తమకు అప్పుల బాధ తీరిందని రైతాంగం భావిస్తున్నది. పంట రుణాలు, బంగారు నగల తాకట్టు రుణాలు కూడా రద్దు కావడం వల్ల ఎందరో రైతు కుటుంబ మహిళలు ఆయన పట్ల కృతజ్ఞత చూపుతున్నారన్నది రెండవ కారణం.

ఈ ఐదేళ్లలో దాదాపు 50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు.


తొరవ 14వ పేజీలో

## తెలుగువీరుడికి ప్రాణ ప్రతిష్ట!

ఏప్రెల్ 16,23 తేదీలలో జరిగిన ఎన్నికలలో ప్రజలు తెలుగుదేశానికి అనుకూలమైన తీర్పు చెప్పారని నమ్మడానికి బలమైన సంకేతాలు కన్పిస్తున్నాయి. పోలింగ్‌కు ఒకటి రెండు

> నెలకు రెండువేల రూపాయలు ఇచ్చే నగదు బదలీ పథకం ఎవరి మేధస్సులో నుంచి పుట్టిందో తెలియదు గాని చంద్రబాబు పాలిట దేముడిచ్చిన వరం వలె ఉపకరించింది.

వారాల వరకు ఈ పరిస్థితి లేదు. చంద్రబాబు మీద సాధారణ ప్రజలలో ఏ మాత్రం నమ్మకం లేదు. అధికారం చేజారిన ఐదేళ్ల తర్వాత కూడా ప్రజలు తనకు మళ్లీ ఎందుకు ఓటువేయాలో నచ్చ చెప్పలేకపోయాడు. వైఎస్‌రాజ



శేఖర్‌రెడ్డి అవినీతి మీద ఆందోళనలు, అధికారంలో ఆయన స్థిరపడిపోతున్నాడన్న ఆక్రోశం వెళ్లగక్కడం తప్ప చంద్రబాబు చేసింది ఏమీ లేదు. వైఎస్ కంటే తాను ఎందులో ఎక్కువ అన్నది నిరూపించడం ఆయన చేత కాలేదు.

కానీ గోదావరి వరదలో కొట్టుకపోతున్న వాడికి కుక్కతోక దొరికినట్లుగా, నెలకు రెండువేల రూపాయలు ఇచ్చే నగదు బదలీ పథకం దొరికింది ఆయనకు. ఎవరి మేధస్సులో నుంచి పుట్టిన పథకమో తెలియదు కానీ అది చంద్రబాబు పాలిట దేముడిచ్చిన వరం వలె ఉపకరించింది. రెండవదశ పోలింగ్‌లో దాని ప్రభావం స్పష్టంగా కన్పించింది. అన్ని తరగతులు, అన్ని వర్గాల మహిళలు దానిపట్ల విపరీతంగా ఆకర్షితులైనారు. వారిలో ఒక విధమైన ఉన్మాదాన్ని సృష్టించింది అది. నెలకు రెండు వేలంటే సామాన్యమైన మొత్తం కాదు. పట్టణాలలో బిఎస్సీలు, బికాంలు చదివిన యువతీ యువకులు నెలకు 1500 నుంచి రెండు వేల రూపాయల జీతానికి రోజుకు పదిగంటల పాటు పని చేయడం చూస్తున్నాం మనం. ఆస్పత్రులు, హోటళ్లు, చిన్న పరిశ్రమలు, చిన్నచితకా ఆఫీసులలో సాధారణ ఉద్యోగుల జీతాలు ఈ స్థాయిలోనే వుంటాయి. అంత చదువు చదివి, ఒళ్లు వంచి పనిచేస్తేనే వచ్చే జీతం నెలకు రెండు వేలైనప్పుడు, ఏ పనీ చేయకుండా ఇంటికి ఆ మొత్తం వస్తుందంటే సగటు మహిళలు ఎంత సంతోషపడతారో వూహించవచ్చు. ఇంత మాత్రం సొమ్ము తమ చేతికి వస్తే, మగవాళ్ల

> ప్రజారాజ్యం ఓట్ల చీలికవల్ల తెలుగుదేశం కంటే కాంగ్రెస్ పార్టీనే అధికంగా నష్టపోయి తెలుగు వీరుడికి మళ్లీ ప్రాణ ప్రతిష్ట జరగబోతూంది.

మీద ఆధారపడకుండా బ్రతికే స్వేచ్ఛ వస్తుందని భావించారు మహిళలు.

తొరవ 14వ పేజీలో

## 70 ఏళ్ల క్రితం ఈ వారం

### జర్మనీ జవాబు

చిన్న చిన్న రాజ్యాల స్వాతంత్ర్యానికి యికమీదట భంగం కలుగనీయనని జర్మనీ పూచీ ఇవ్వాలని రూజువెల్టు వంపిన సందేశానికి, బ్రిటను యిక మీదట ఏమాత్రం జర్మనీ చర్యలను సహించజాలదని హెండర్సను ద్వారా వంపిన సందేశానికి, హిట్లరు 28తేది గావించిన ప్రకటనలో తనదేం తప్పు లేదన్నట్లుగా తెలిపాడు.

### బోసు స్థానంలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేంద్రబాబు

కలకత్తా సభలో ఎఐసిసి వారు బోసు స్థానే బాబు రాజేంద్రప్రసాదును అధ్యక్షునిగ వరించిరి. గాంధీగారితో ఆలోచించి క్రింది వారిని వర్కింగ్ కమిటీ సభ్యులుగా రాజన్‌బాబు నియమించిరి. మౌలానా అబ్దుల్‌కలామ్ ఆజాద్, సరోజినిదేవి, సర్దార్ వల్లభాయిపటేల్, సేట్

**5-5-1939**

పేజీలు: 14 వెల: అణా

జమ్నలాల్ బజాజ్, జయరామ్‌దాస్, దౌలత్‌రాయ్, ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్, జె.బి. కృపలాని, డాక్టర్ పట్టాభి, బూలాబాయి దేశాయి, శంకరావుదేవ్, హరికృష్ణ మోహతాబ్, బిదన్ చంద్ర రాయి, ప్రఫుల్లా చంద్రఘోష్. సుబాస్ బోసును వర్కింగ్‌కమిటీలో వుండమని రాజన్‌బాబు కోరితే ఆయన నిరాకరించాడు. నెహ్రూ కూడా నిరాకరించాడు.

### ఫార్వర్డుబ్లాకు

సుబాస్‌బోసు మరొక కొత్తపక్షాన్ని ఫార్వర్డుబ్లాక్ అనే పేరుతో లేవదీస్తున్నాడని నేటివార్తలు తెలుపుచున్నాయి. దీనిని యిప్పుడు లేవదీయడానికి ఏర్పడ్డ కారణాలు సుబోసు చెప్పినవి ఒకదానికొకటి సంబంధం లేకుండా వున్నాయి. కాంగ్రెస్‌లో గాంధీజీపక్షనాయకులు రాజీ కుదురుటకు అవకాశం కలగజేయని వైఖరి అవలంబించి నందువల్లనే అన్ని రకాల అతివాదులు కలిసి ఈ నూతన పక్షాన్ని యేర్పచడానికి ప్రస్తుతం అవసరమేర్పడిందన్నాడు.

## తలదించిన తమిళపులి

ఎల్‌టిటిఇ ప్రాబల్యాన్ని నిర్మూలించడంలో శ్రీలంక సైన్యం అనూహిత విజయం సాధించింది. ముప్పయ్యేళ్లుగా శ్రీలంక దేశాన్ని స్మశానంగా మారుస్తున్న తమిళ తీవ్రవాద ఉద్యమం కోలుకోలేని దెబ్బ తిన్నది. ఎల్‌టిటిఇకి చిట్టచివరి స్థావరమైన ముల్లైతీవు అడవుల లోకి చొచ్చుకపోతున్నది శ్రీలంక సైన్యం. ఈ అడవులలో కేవలం 8 చదరపు కిలోమీటర్ల ప్రాంతానికి మాత్రమే పరిమితమై వుంది ఎల్‌టిటిఇ ఇప్పుడు. 20వేల నుంచి 70వేల మంది వరకు తమిళ పౌరులను తమకు రక్షణ కవచంగా ముందు పెట్టి, సైన్యాన్ని ప్రతిఘటిస్తున్నారు ఎల్‌టిటిఇ గెరిల్లాలు. వారి మధ్య ప్రభాకరన్ వున్నాడో లేదో తెలియదు. ఆయన కుమారుడు, కొందరు ముఖ్య నేతలు జలాంతర్గామి ద్వారా తప్పించుకొని పారిపోయారని, ప్రభాకరన్ మాత్రం మధుమేహ వ్యాధి వల్ల ఉత్పన్నమైన శారీరక సమస్యలతో అంత దూరం ప్రయాణం చేయలేక ఆ అడవులలోనే తలదాచుకొని వున్నాడని ఒక వూహ. శ్రీలంక సైన్యం ఈ ఎనిమిది కిలోమీటర్ల ప్రాంతంలోకి చొచ్చుకొని రాకుండా అంతర్జాతీయ సమాజం ద్వారా ఒత్తిడి తేస్తున్నాడు ప్రభాకరన్. తమిళనాడు ముఖ్యమంత్రి కరుణానిధి అకస్మాత్తుగా నిరాహారదీక్ష పూనడం అందులో ఒక భాగం. అయితే మప్పయ్యేళ్లుగా తమ దేశంలో నెత్తుటిఏర్లు పారిస్తున్న తీవ్రవాదసమస్యకు ముగింపు లభించే దశలో ఎవరి ఒత్తిడికీ తలఒగ్గే ఆలోచనలో శ్రీలంక ప్రభుత్వం లేదు.

తాత్కాలికంగా కాల్పుల విరమణ పాటించినా, తమ సైన్యాన్ని మెల్లమెల్లగా ముల్లైతీవు అడవులలోకి పంపుతున్నది. వారం పదిరోజుల లోపల ఎల్‌టిటిఇ వునికి లేకుండా నాశనం చేయాలన్నది శ్రీలంక సైన్యం పట్టుదల. వారి బలం ముందు ఎల్‌టిటి శక్తి ఎంత మాత్రం చాలేట్లు లేదు. అందువల్ల ఆ లక్ష్యం నెరవేరిపోతుందనే భావించాలి. ప్రభాకరన్ సజీవంగా సైన్యం చేతికి దొరుకుతాడా లేక వీరోచిత మరణం పొందుతాడా అన్నది ప్రశ్నార్థకం. ఆయన మనస్తత్వం తెలిసిన వారందరూ, తన జీవితాన్ని ఆత్మహత్యతో అంతం చేసుకొంటాడని భావిస్తున్నారు.

మూడు దశాబ్దాల సుదీర్ఘ ప్రయాణంలో ఎల్‌టిటిఇ ప్రభాకరన్ సృష్టించిన మానవ విధ్వంసానికి చరిత్రలో వేరొక సాదృశ్యం వుండదు. ఆయన ఉగ్రవాద చర్యలకు కనీసం లక్ష మంది ప్రాణాలు కోల్పోయి వుంటారని అంచనా. ఎన్ని లక్షల జీవితాలు చిన్నాభిన్నమై వుంటాయో లెక్క పెట్టలేము. తమిళ ఆత్మగౌరవం నిలవడానికి, స్వయం పాలన సాధించడానికి పుట్టుకొచ్చిన ఉద్యమాలన్నిటినీ కబళించి, మొత్తం శ్రీలంక తమిళులకు తానొక్కడే ప్రతినిధిగా గుర్తింపు పొందాడు ప్రభాకరన్. అందుకోసమే ఇపిఆర్ఎల్ఎఫ్ పద్మనాభం వంటి తమిళ స్వేచ్ఛా ఉద్యమ నాయకులను కిరాతకంగా చంపాడు. శ్రీలంక ప్రభుత్వం మెడలు వంచడానికి గెరిల్లా పోరాట మార్గం ఎంచుకొన్నాడు. ఒకరికి ఇద్దరు దేశాధ్యక్షులను చంపాడు. రాజీవ్‌గాంధీని పొట్టన పెట్టుకొన్నాడు. అంతర్జాతీయ తమిళ సమాజం అండతో, శ్రీలంక ఉత్తర, తూర్పు భాగాలన్నిటినీ తన అదుపులోకి తెచ్చుకొని, తనకు తానే స్వాతంత్ర్యం ప్రకటించుకొన్నాడు. స్వంతంగా యుద్ధ విమానాలు, జలాంతర్గాములు తయారు చేసుకొన్నాడు. 1986లో రాజీవ్‌గాంధీ పంపిన శాంతి పరిరక్షక దళానికి నరకం చవి చూపించాడు. ఆ దెబ్బతో శ్రీలంక సమస్యలో జోక్యం చేసుకోవడానికి భారత్ ప్రభుత్వాలు భయపడే పరిస్థితి కల్పించాడు.

ప్రభాకరన్ పోరాటం వల్ల తమిళులకు జరిగిన మేలు కంటే కీడే ఎక్కువ. ముప్పయ్యేళ్లుగా యుద్ధభీతితో ప్రత్యక్ష నరకం చవి చూస్తున్నారు వారు. వారి పట్ల చాలా కర్కశంగా, నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించాడు ప్రభాకరన్. తన సైన్యానికి అవసరమైనప్పుడల్లా, తమిళ ఇళ్లలోని పది పన్నెండేళ్ల బాల బాలికలను కూడా బలవంతంగా ఎత్తుకపోయి, తుపాకులు చేతికిచ్చి, యుద్ధంలోకి దింపాడు. ఆ పిల్లల నడుముకు బాంబులు కట్టి, ఆత్మహత్యాదళంగా వాడుకొన్నాడు. దశాబ్దాల తరబడి ఈ ప్రాంతంలోని తమిళులకు తినడానికి తిండి లేదు. కట్టుకోవడానికి బట్ట లేదు. చేయడానికి పని లేదు. బ్రతుకు మీద ఆశ లేదు. అనుక్షణం చావు భయంతో జీవచ్ఛవాల వలె బ్రతుకుతున్నారా నిర్భాగ్యులు.

ప్రభాకరన్ గెరిల్లాపోరుకు పరిమితమైనంత కాలం శ్రీలంక సైన్యం ఆయన్ను ఏమీ చేయలేక పోయింది. ఆయన తనకు తాను స్వతంత్ర దేశానికి రాజుగా ప్రకటించుకొని, పూర్తిస్థాయి సైన్యం వున్నవాడివలె యుద్ధానికి దిగడంతో, మూడంటే మూడేళ్లలో అణిచి పారేసింది. ప్రభాకరన్ అంతంతో శ్రీలంక తమిళుల సమస్య కూడా అంతమై పోతుందనుకోవడం పొరపాటు. ఆ సమస్యను అట్లనే పెట్టి, తాను అంతమై పోతున్నాడు ప్రభాకరన్. ఇక ముందు ఈ తమిళ ప్రజల భవితవ్యం ఏమిటో, వారి జీవన స్థితిగతులు మెరుగుపరచడానికి శ్రీలంక ప్రభుత్వం ఏ చర్యలు తీసుకొంటుందో వేచి చూడాలి. వారిద్దరికి మధ్య జరిగిన యుద్ధంలో జోక్యం లేకుండా దూరం నుంచి చూస్తూ వుండిపోయిన భారత ప్రభుత్వం, అక్కడి తమిళుల జీవనాన్ని మెరుగుపరిచే ప్రక్రియలో మాత్రం పూర్తిస్థాయి సహాయం అందజేయడం అవసరం. వారూ మన సోదరులేనన్న మాట గుర్తుంచుకొని, అన్ని రూపాలలో మానవతా సాయం అందించడం వెంటనే జరగాలి.

## 50 ఏళ్ల క్రితం ఈ వారం

### నెల్లూరులో ఇందిరాగాంధీ

కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి ఇందిరాగాంధీ, 27తేది డీలక్స్ ఎక్స్‌ప్రెస్‌లో మద్రాసు పోతున్న సందర్భంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మన్నేపల్లి హనుమంతరావు ప్రభృత కాంగ్రెస్ వాదులు; సిఎస్ఆర్ ఆంజనేయులు వగైరా సంఘ సేవకులు నెల్లూరు స్టేషన్‌లో ఆమెను కలసుకొని పుష్పమాలాంకృతులను జేశారు. మరుదఫా దక్షిణాది వచ్చినపుడు నెల్లూరు జిల్లాలో సంచరించ వలసిందిగా ఆమెను ఆహ్వానించారు. రైలు ప్రయాణం హాయిగా వున్నదని వెలిబుచ్చారు ఆమె.

### కర్తం కృష్ణారెడ్డి ఉరిశిక్ష రద్దు

30-8-58 తేది పట్టపగలు నెల్లూరులో జరిగిన, కండె రామకృష్ణయ్య (ములుమూడి) హత్య కేసులో, మొదటి ముద్దాయి కర్తం కృష్ణారెడ్డికి

**1-5-1959**

పేజీలు: 12 వెల: 0-3-0

నెల్లూరు అడిషినల్ జిల్లా జడ్జి విధించిన ఉరిశిక్షను, అప్పీలులో హైకోర్టు రద్దు చేసి, 7 సంవత్సరాల కఠినశిక్ష విధించింది. ఈ కేసులోని మరొక ముద్దాయి ఏనుగ మల్లారెడ్డికి జిల్లా కోర్టులో యావజ్జీవఖైదు విధించబడగా, హైకోర్టు దానిని ఒక సంవత్సరానికి తగ్గించింది. ముద్దాయిల తరపున హైకోర్టులో చేయబడిన అప్పీలును, న్యాయమూర్తులు బసిరెడ్డి, భీమశంకరం గారలు విచారించి, 24తేది పైవిధంగా తీర్పు జెప్పారు.

### నెల్లూరు యడ్లవారివీధిలో హత్య

30తేది ఉదయం 8గంటల ప్రాంతంలో నెల్లూరు యడ్లవారివీధి ఉత్తరపు శ్రేణిలో ఒక చిన్న యింటిలో వుంటుండిన సత్యవతి అను స్త్రీ ఘోరంగా హత్య గావింపబడింది. హంతకుడు వెంటనే సంతపేటలోని పోలీస్‌స్టేషన్‌కు పోయి తానొక స్త్రీని హత్యచేసినట్లు చెప్పి, తనకు తానై పోలీసుకు స్వాధీనమైనాడు.

## జనవాణి

### ఇదా వాక్ స్వాతంత్ర్యం?

రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులలో వాక్ స్వాతంత్ర్యం కూడా ఒకటి. ఈ హక్కు వుందని మన నేతలు హద్దు పద్దూ లేకుండా మాట్లాడుతున్నారు. హైదరాబాద్ పార్లమెంట్ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ, రాష్ట్ర డిజిపి మహంతిని ధైర్యముంటే ఖాకీ బట్టలు తీసేసి పాతబస్తీకి రమ్మనడం సబబుకాదు. ఈ మాటకు ప్రతిగా డిజిపి మాట్లాడి వుంటే పరిస్థితి మరో రకంగా వుండేది. కాంగ్రెస్, తెలుగుదేశం, ప్రజారాజ్యం పార్టీల మహిళా విభాగం నేతల మాటల తీరు గమనిస్తే బెరా అనిపిస్తుంది. కాలు జారితే తీసుకోవచ్చు గానీ నోరు జారితే తీసుకోలేమన్న సామెతను గుర్తెరిగి నేతలు ప్రవరిస్తే మంచిది.

జి.తిరుపాలురెడ్డి మహమ్మదాపురం

### చంద్రమాయలో పడినట్లుంది!

తెలుగుదేశం పార్టీ సర్వాధినేత చంద్రబాబు నాయుడుకి పేదల బతుకుల గూర్చి బాగా తెలుసు. ఆయన రాష్ట్రాన్ని పాలించిన తొమ్మిదేళ్లలో ఇంటి పన్నులు, విద్యుత్, బస్సు ఛార్జీలు పెంచి జనాన్ని కడగండ్ల పాలు చేశారు. ఇప్పుడేమో పేదలు మానసికంగా ఉల్లాసంగా వుండేందుకు రంగుల టీవీలు వుచితంగా ఇస్తానంటున్నారు. ఆయన ఆడవాళ్ల కోసం ప్రకటించిన నెలకు రెండు వేలరూపాయల పథకం మాయలో పడినట్లు ఎన్నికల అనంతరం పరిస్థితి చూస్తుంటే అనుమానం కలుగుతుంది. ఒకవేళ చంద్రబాబు పొరపాటున అధికారంలోకి వస్తే రకరకాల పన్నులతో ప్రజలను హింసించకుంటే అంతే చాలు.

ఎ.బాబు నెల్లూరు

### ఎలక్షన్ బాగా చేశారు!

రాష్ట్రంలో పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించిన ఘనత ఎన్నికల కమిషనర్ డాక్టర్ ఐ.వి. సుబ్బారావు, డిజిపి ఎకె మహంతిలకు దక్కుతుంది. రాష్ట్రంలో రజాకర్లను తలపించే అసదుద్దీన్ ఒవైసీ లాంటి కరుడు కట్టిన రాజకీయనేతలున్నారు. రాజకీయాన్ని అడ్డుపెట్టుకొని అక్రమ మార్గాన కోట్లు కూడబెట్టిన సీమ ఫ్యాక్షన్ నేతలున్నారు. చంద్రశేఖర్‌రావు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, కోడెల శివప్రసాద్‌రావులాంటి నేతలు వేసిన ఎత్తులను ఇద్దరంటే ఇద్దరు అధికారులు సమర్థవంతంగా తిప్పికొట్టను శ్రమపడ్డారు. కోట్ల రూపాయల బ్లాక్ మనీని, మద్యాన్ని పట్టుకొని ప్రజాస్వామ్యవ్యవస్థ పరిహాసాల పాలు కాకుండా చేశారు. హ్యాటాఫ్స్ టు యూ.

వాస్తు రామచంద్ర నెల్లూరు

### అలా వ్రాస్తే ఎలా?

ఎన్నికల ఫలితాలను అంచనా వేయడంలో 'జమీన్‌రైతు'ది అందె వేసిన చెయ్యి. కాని ఎన్నికల ముందు వెలువడ్డ కొన్ని సంచికల్లో వచ్చిన వార్తలను చూచినపుడే మనసు చివుక్కుమంది. 17తేది సంచిక ముఖపత్రపు రాతల్లో ఇందుకు భిన్నంగా ప్రధాన పార్టీల జాతకాల జాడలు కనిపించాయి. పత్రికల పతనావస్థ పై మీ సంపాదకీయం పాత్రికేయ 'ప్రవృత్తి' మీద వృత్తిపరంగా జరుగుతున్న స్వారీకి దర్పణంగా నిలుస్తున్నది. పోలింగు తరువాయి సంచికలోనైనా గతకాలపు గురికి బెత్తెడు దగ్గరి ఎన్నికల అంచనాలను వెలువరిస్తారని ఆశిస్తున్నాను.

ఎం.రామమూర్తి విశాఖపట్నం

### వైఎస్‌ను పథకాలే గెలిపిస్తాయి!

భారతదేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ అమలు జరుపని పథకాలు మన రాష్ట్రంలో ప్రవేశపెట్టి దేశంలోనే ఉత్తమ ముఖ్యమంత్రిగా ప్రశంసించబడ్డ వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి. ఆయన పేదవారి సంక్షేమం కోసం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ, పావలావడ్డీకే రుణాలు వంటి పథకాల వల్ల లక్షలాది కుటుంబాలకు మంచి జరిగింది. వారంతా ఆయనను చూసి తప్ప ఎమ్మెల్యేలను చూసి ఓటు వేసి వుండరు. వైఎస్ చేపట్టిన సంక్షేమ పథకాలే ఆయన్ను గెలిపిస్తాయి. ఈ విషయంలో ఎటువంటి సందేహాలకు తావులేదు.

అరవ పూర్ణప్రకాష్ నెల్లూరు

# నెల్లూరు ముచ్చట్లు

## ప్రశాంతంగా ముగిసిన రీపోలింగ్

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం మరమ్మత్తులకు గురికావడంతో కొడవలూరు మండలంలోని 159 నెంబర్ పోలింగ్ కేంద్రంలో 26వ తేది చేపట్టిన రీపోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 23వ తేది పోలింగ్ మొదలయ్యాక ఇవిఎంలో సాంకేతిక లోపం వున్నట్లు గుర్తించారు. ఏ పార్టీకి ఓటువేసినా ఆ ఓట్లన్నీ బిఎస్పీ అభ్యర్థికే పడుతుండడంతో పోలింగ్‌ను నిలిపివేశారు. 26వ తేది జరిగిన రీపోలింగ్‌లో ఈ పోలింగ్ కేంద్రంలో 703 ఓట్లకు గాను 684 ఓట్లు పోలయ్యాయి. ఈ పోలింగ్ కేంద్రంలో మినహా జిల్లాలో మరెక్కడా రీపోలింగ్ జరగలేదు. రీపోలింగ్‌ను కోవూరు తెలుగుదేశం అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థి తుపాకుల మునెమ్మ పరిశీలించారు.

## ఊపిరి పీల్చుకున్న పోలీసులు!

జిల్లాలో పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గట్టి చర్యలు తీసుకొన్నారని కలెక్టర్ రాంగోపాల్, ఎస్పీ మల్లారెడ్డిలను రాష్ట్ర ఎన్నికల కమీషనర్ ఐ.వి.సుబ్బారావు అభినందించినట్లు తెలిసింది. జిల్లాలో సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించిన 165 చోట్ల ఎస్పీ మల్లారెడ్డి మన జిల్లా పోలీసులను కాకుండా ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చిన స్పెషల్ ఫోర్సును బందోబస్తుకు వినియోగించారు. పోలింగ్ కేంద్రాలకు వంద మీటర్ల లోపు ఎవరైనా గొడవచేస్తే అరెస్టు చేయమని ఆదేశాలు జారీచేశారు. తీరప్రాంతంలోని మత్స్యకార గ్రామాలు, మర్రిపాడు, సీతారాంపురం, ఉదయగిరి, ఆత్మకూరు, సర్వేపల్లి, అల్లూరులపై ప్రత్యేకదృష్టి సారించి గట్టిభద్రత ఏర్పాటు చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యేల గన్‌మేన్ల ద్వారా ఎప్పటికప్పుడు వారి కదలికలను తెలుసుకొంటూ రిగ్గింగులు, ఘర్షణలకు అవకాశం ఇవ్వకుండా ఎస్పీ తగిన చర్యలు చేపట్టారు.

అమ్మ ఫర్నిచర్స్
A House of Life style furnitures

## కనీస వసతులు లేని కౌంటింగ్ కేంద్రాలు

నెల్లూరు డికెడబ్ల్యు కాలేజి, పాలిటెక్నిక్ కాలేజీల్లో ఇవిఎంలు భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కనీస వసతులు లేకపోవడంతో బందోబస్తులో వున్న పోలీసు సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఈ స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడు వందల మంది పోలీసులు బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారు. రెండు గంటల కొకసారి డ్యూటీ మారాల్సి రావడంతో పోలీసులు విశ్రాంతి తీసుకొనే రూముల్లో పగలు ఫ్యాన్లు తిరగడం లేదు. రాత్రివేళల్లో దోమలమోత జాస్తిగా వుంది. డికెడబ్ల్యు కాలేజిలో నెల్లూరు, నెల్లూరు రూరల్, ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాలకు సంబంధించిన ఈవిఎంలు భద్రపరచి వున్నారు. డికెలో చెట్లు గుబురుగా పెరిగి వుండడం, తగినన్ని లైట్లు ఏర్పాటుచేయక పోవడంతో పాముల బెడదకు బందోబస్తులో వున్న సిబ్బంది దడుచుకొంటున్నారు.

## పోస్టల్ బ్యాలెట్లకు డిమాండ్

ఎన్నికల విధుల్లో వున్న ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకొనేందుకు ప్రభుత్వం కల్పించిన సదుపాయమే పోస్టల్ బ్యాలెట్. దీని ద్వారా వుద్యోగులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవచ్చు. అన్ని పార్టీల అభ్యర్థుల కన్ను ఇప్పుడు పోస్టల్ బ్యాలెట్ల మీద పడింది. ఈ ఎన్నికల్లో మెజార్టీలు పోటాపోటిగా వస్తాయని కలత చెందుతున్న అభ్యర్థులు పోస్టల్ బ్యాలెట్ తమ చేతికి ఇచ్చేసే ఉద్యోగులకు రెండు వేల రూపాయల మొత్తం ఇవ్వను ముందుకొస్తున్నాయి. సామాన్య ఓటర్లలో కొందరు ఆలోచన లేక ఓట్లు అమ్ముకొన్నారు. నెలనెలా వేలకు వేలు జీతం తీసుకొనే వుద్యోగులు సైతం ఆ బాటన నడవడం బాధాకరం.

## బహిరంగంగా ఓటువేసిన వివేకా!

ఓటువేయడం లోనూ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి ప్రత్యేకతను చాటారు. 23వ తేది నెల్లూరు కలెక్టరేట్‌కు ఎదురుగా వుండే పోలింగ్ కేంద్రానికి వచ్చిన ఆయన ముగ్గురు అనుచరులు వెనుక నిలబడి చూస్తుండగానే ఓటు వేశారు. వీరిని అక్కడ వరకు అనుమతించిన అధికారులను వున్నతాధికారులు ప్రశ్నించక పోవడం విస్మయాన్ని కల్గిస్తున్నది.

## అన్నిస్థానాలు గెలుస్తాం!

జిల్లాలోని పది అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలుచుకొంటుందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. 28వ తేది నెల్లూరులోని ఆయన స్వగృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డిసిసి అధ్యక్షుడు ఎల్లసిరి గోపాలరెడ్డితో కలసి మాట్లాడారు.

పోలింగ్‌కు ఒకరోజు ముందు తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని పది అసెంబ్లీ స్థానాలు, రెండు పార్లమెంటు స్థానాలు తమవేనన్నారు.

ప్రజారాజ్యం పార్టీ జిల్లా కన్వీనర్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి నెల్లూరు, నెల్లూరు రూరల్ స్థానాల్లో తమ పార్టీకి గెలవకుంటే కన్వీనర్ పదవిని వదలుకొంటానన్నారు. చూడాలి ఎవరి నమ్మకం నిజమౌతుందో?

## పోస్టల్ స్టాంపుల కొరత

25పైసల పోస్టల్ స్టాంపులు గత మాసం రోజులుగా పెద్దపోస్టాఫీసులో అందుబాటులో లేకుండా పోయాయి. దీనితో పత్రికల పోస్టేజికి 50 పైసల స్టాంపులు అతికించాల్సి వస్తుంది. స్టాంపులు అందుబాటులో వుంచే విషయమై చర్యలు తీసుకొనే పోస్టల్ అధికారే లేకుండా పోవడం దురదృష్టకరం. పోస్టల్ శాఖలో పెచ్చుపెరిగిన వుదాసీనతకు ఈ స్టాంపుల కొరతే నిదర్శనం.

# కైపెక్కిన ఎన్నికలు

సింహపురి మహిళలు కష్టనష్టాల కోర్చి కదంతొక్కి సాగించిన మద్యనిషేధ ఉద్యమంలో జిల్లా కీర్తి పతాక ఎగసి దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యింది. అటువంటి చరిత్ర గతిని మార్చిన చోటనే మద్యం ఏరుల్లై పారి రికార్డు బద్దలు చేసింది. ఈ స్థితిని చూసి మహిళల గుండెలు రగిలి; పొగిలి పొగిలి ఏడ్వడం మినహా పిడికిలి బిగించలేని నిస్సహాయ స్థితికి ఈసారి జరిగిన అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు నెట్టివేశాయి. సహజంగా జిల్లాలో నెలకు 80 కోట్ల రూపాయల మద్యం వ్యాపారం జరిగేది; మార్చి, ఏప్రెల్ నెలలో ఎన్నికలను పురస్కరించుకొని 200 కోట్ల రూపాయల మద్యం వ్యాపారం జరిగింది.

నామినేషన్ల దాఖలుకు ముందు గ్రామీణ ప్రాంతాల్లోని బెల్టుషాపులను మూసివేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీచేసినా ఎక్సైజ్‌శాఖ వుదాసీనంగా వ్యవహరించింది. ఎన్నికలకు రెండు రోజుల ముందు మద్యం అందుబాటులో లేకుండా చూడాలన్నా షాపులు, బార్ల యజమానులు దొడ్డిదారిన మద్యం అమ్మకాలు చేశారు. చీప్ లిక్కర్ బాటిళ్లు, బీర్లు అధికంగా అమ్ముడు పోయినట్లు ఎక్సైజ్ శాఖ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. నెల్లూరు డివిజన్‌లోని సర్వేపల్లిలో, కావలి డివిజన్‌లోని కావలి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున మద్యం అమ్ముడయ్యింది. ఎండలు అదరగొడుతుండడంతో వచ్చే రెండు నెలల్లోనూ బీరుబాటిళ్లు బాగా అమ్ముడుపోతాయని ఎక్సైజ్ అధికారులు తలపోసి పెద్ద మొత్తంలో స్టాక్ చేసి వున్నారు. కైపెక్కిన ఎన్నికలు, ఎండల పుణ్యమా అని ఒక సంవత్సరంలో అమ్ముడయ్యే మద్యం ఒక నెలలోనే అమ్ముడయ్యి రికార్డులన్నీ తుడిపేసింది.

## ఖాకీల కుమ్ములాటలు

నిరంతరం వార్తల్లో వుండే నెల్లూరు ఐదవ పట్టణ ఎస్ఐ సీతారామయ్య కానిస్టేబుల్ హజరత్తయ్యతో కలబడి మరోసారి వార్తల్లో ఎక్కారు. జాతీయ రహదారిపై వాహనాలు ఆపి కానిస్టేబుల్ హజరత్తయ్య వసూళ్లు చేస్తున్నాడని ఎస్ఐ ఆయన్ను ప్రశ్నించాడు. దీంతో ఇద్దరి మధ్య మాట మాట పెరిగింది. బాహాబాహీకి సిద్ధపడ్డారు. అనంతరం ఇద్దరూ ఎస్పీకి ఫిర్యాదులు చేసుకొన్నారు. ఎస్పీ కానిస్టేబుల్ హజరత్తయ్యను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

## పెంచలకోనలో బ్రహ్మోత్సవాలు

పెంచలకోనలోని నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు మే 5వ తేది నుంచి 9వ తేది వరకు జరగనున్నాయి. అంగరంగ వైభవంగా ఈ ఉత్సవాలను నిర్వహించేందుకు అధికారులు, పాలక వర్గం అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు సౌకర్యాల కల్పనపై 28వ తేది నెల్లూరు ఆర్డీఓ కార్యాలయంలో ఆలయ ఛైర్మన్ శ్రీరాములుశెట్టి, ఆర్డీఓ వేణుగోపాలరెడ్డి సమీక్షాసమావేశాన్ని నిర్వహించారు.

## చెన్నైకు నెల్లూరు ఈవిఎంలు!

మూడవ విడత ఎన్నికలు జరిగే తమిళనాడుకు నెల్లూరు నుంచి ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లను భారీ భద్రత మధ్య 28వ తేది తరలించారు. కలెక్టరేట్‌లో అదనపు అవసరాల కోసం 250 ఈవిఎంలను సిద్ధంగా వుంచారు. వీటి అవసరం రాకపోవడంతో ఇక్కడే జాగ్రత్త చేసి వుంచారు. 30తేది తమిళనాడులో ఎన్నికలు జరుగుతున్న దృష్ట్యా అదనపు ఈవిఎంల అవసరమయ్యింది. చెన్నైకు నెల్లూరు దగ్గర కావడంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వీటిని అక్కడకు పంపారు.

బంగారం స్పెషల్ ఆఫర్
BIS 916 హాల్‌మార్క్
బంగారు ఆభరణములపై
సవరకు రూ.400/- తగ్గింపు.
గ్రాముకు రూ.50/- తగ్గింపు.
డైమండ్స్ పై 10% తగ్గింపు.
గోల్డ్ ప్యాలెస్
హోటల్ శివం ఎదురుగా,
జిల్లా పరిషత్ ఆఫీసు సెంటర్,
ఆచారివీధి, నెల్లూరు.
ఫోన్ : 2331133, 2327611

శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం
పెంచలకోనక్షేత్రం, రాపూరు మండలం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా. ఫోన్ : 08621 - 221604



బ్రహ్మోత్సవ కార్యక్రమములు

తేది 06-05-2009 రాత్రి 11-00 గంటలకు - హనుమంతసేవ
తేది 07-05-2009 రాత్రి 12-00 గంటలకు - గరుడ సేవ
తేది 08-05-2009 ఉదయం 10-00 గంటలకు - శ్రీవారి కళ్యాణము
సాయంత్రం 6-00 గంటలకు - రథోత్సవము
తేది 09-05-2009 రాత్రి 7-00 గంటలకు - తెప్పోత్సవము



భక్తులందరికి సమాదరాహ్వానం
భక్తులు శ్రీస్వామివారిని దర్శించి తరించ ప్రార్థన.

అమరా శ్రీరాములు శ్రేష్ఠి, ఛైర్మన్
మరియు ధర్మకర్తల మండలి

శనగవరం శ్రీరామమూర్తి
సహాయ కమీషనరు మరియు కార్యనిర్వాహణాధికారి (FAC)

**నెల్లూరు**



ప్రజారాజ్యం

**నెల్లూరురూరల్**



ప్రజారాజ్యం

**కోవూరు**







?

**కావలి**



తెలుగుదేశం

**ఉదయగిరి**



తెలుగుదేశం

# మెజార్టీలో నెల్లూరు రూరల్ అన్నింటికంటే ముందుంటుంది!

నెల్లూరు నగర శాసనసభ నియోజవర్గంలో ప్రజారాజ్యం తొలి బోణీ చేయబోతున్నదని చెప్పవచ్చు. ఆ పార్టీ అభ్యర్థి ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి గెలిచినట్లే భావించాలి. చాలా హోరాహోరీ పోరు జరిగిన నియోజకవర్గమిది. తెలుగుదేశం అభ్యర్థి తాళ్లపాక రమేష్ రెడ్డి ఎందువల్లనో చివరి మూడు రోజులలో చతికిలపడిపోయాడు. ఎన్నికల యంత్రాంగం నిర్మించుకోవడంలో విఫలం చెందాడు. చాలా చోట్ల తెలుగుదేశం కార్యకర్తలు ఎన్నికల కార్యాలయాలు మూసివేసి ప్రజారాజ్యం జెండా భుజానికెత్తుకున్నారు. పరిస్థితి ఆయన అదుపు తప్పిపోయింది. స్వంత పార్టీ కార్యకర్తలలో ఆయన పట్ల అభిమానం లేక మొక్కుబడిగా ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం, మిత్రపక్షమైన సిపిఎం కూడా ఉదాసీనంగా, నిర్లిప్తంగా వ్యవహరించడం ఇందుకు కారణం కావచ్చు. ఈ అవకాశాన్ని ప్రజారాజ్యం అభ్యర్థి ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి చాలా చక్కగా వాడుకొన్నాడు. అప్పటికే ఆయన ధారాళంగా ఖర్చు పెట్టేవాడన్న పేరు పడడంతో తెలుగుదేశం కార్యకర్తలు కూడా ఉత్సాహంగా సహకారం అందించారు. స్టోన్‌హౌస్‌పేట వైశ్యులు అధిక సంఖ్యలో రైల్ యింజన్ మీద ముద్రవేశారు. గత ఎన్నికలలో వారు కాంగ్రెస్‌ను ఎంతో అపురూపంగా భుజానకెత్తుకున్నారు. కానీ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి వారి మీద కర్రపెత్తనానికి సన్నపరెడ్డి పెంచలరెడ్డిని పెట్టాడు. ఆయనొక ఆషాఢభూతి. పేనుకు పెత్తనం ఇస్తే, తలంతా కొరికి పెట్టినట్లు వైశ్యుల పాలిట పెద్ద చీకాకుగా మారాడు. విజిలెన్స్ దాడులు, సేల్స్ ట్యాక్స్ పరిశీలనల పేరుతో వైశ్య వ్యాపారులను బెదరించి, పెద్ద మొత్తాల్లో గుంజడం ఆయనకొక వ్యాపారం. దానితో విసిగిపోయారు వారు. పెంచలరెడ్డి మళ్లీ పెత్తనం చేస్తే ఇక తాము వ్యాపారాలు చేసుకోలేమన్న భీతి వారిలో కన్పించింది. ఆ దౌర్జన్యకర పోకడలను రమేష్‌రెడ్డి కంటే శ్రీధరకృష్ణారెడ్డి సమర్థవంతంగా ఎదుర్కొంటాడన్న నమ్మకంతోనే అటు ఓటు వేసినట్లున్నారు వారు. మరొకప్రక్క వైశ్య యువకులలో సహజంగానే చిరంజీవి అభిమానం జాస్తిగా వుంది. అది జిల్లా అంతటా కన్పించింది. జెండావీధి మైనార్టీ ఓటర్లలలో కూడా మంచి శాతం ఓట్లు లభించాయి. నగరంలోని సంతపేట, ఎన్టీఆర్‌నగర్, ఉస్మాన్ సాహెబ్‌పేట, చాకలివీధి, మూలపేట వంటి ప్రాంతాలలో విశేష సంఖ్యలో ఉన్న బలిజ కులస్తులు ఏదో పండగ కొచ్చినంత సంతోషంతో ఓటు చేసి వెళ్లారు. వీటన్నిటి వల్ల ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి గెలుపు నల్లేరు మీద నడకగా నడిచి పోయింది.

కాంగ్రెస్ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ పరిస్థితి మొదట అనుకొన్నట్లే, చివరికొచ్చేసరికి ఎవరికి పుట్టిన బిడ్డవురా వెక్కి వెక్కి ఏడ్చేవు అన్నట్లు మారింది. ఆ పిల్లవాడిని అనాథ వలె వదిలిపెట్టేశారు ఆనం సోదరులు. తాము బాధ్యత తీసుకొన్నచోట ఎన్నికల ఏజంట్లను కూడా పెట్టలేదు. తమ మాట వింటారనుకొనే వారందరికీ సైకిల్ మీద ఓటు వేయమని చెప్పారు. కోటంరెడ్డి శ్రీధరరెడ్డి ఈ పరిస్థితి వూహించి, ఒకరిద్దరు స్వతంత్ర అభ్యర్థుల పేరుతో ఏజంట్లను పెట్టబట్టి, కొంతలో కొంత పరువు నిలిచింది. లేకుంటే, పోలింగ్‌రోజు నాటికి అసలు కాంగ్రెస్ పోటీలో వున్న సంగతే జనం మరిచి పోయి వుండేవారు.

అయితే పోలింగ్ తర్వాత కూడా అటు కాంగ్రెస్, ఇటు టిడిపిలలో తమదే విజయమన్న ఆశ మాత్రం చావడం లేదు. రమేష్‌రెడ్డి వాదన – తన పట్ల జనంలో వున్న అభిమానంతో తాను గెలిచిపోతానని. కానీ తాను రాజకీయాలలో చురుకుదనం వదలి పెట్టి 15ఏళ్లకు పైగా గడిచిపోయిందని, ఇప్పటి కుర్రకారు కార్యకర్తలకు తానెవ్వరో కూడా తెలియదని మర్చిపోతున్నాడు రమేష్‌రెడ్డి. ఎన్టీఆర్ వలె, తనకు కూడా నెల్లూరు నగరంలో స్వంత అభిమానదళం వుందన్నది ఆయన వెర్రి భావన. బ్యాలెట్ పెట్టెలు తెరిస్తే కానీ తానెంత నేల విడిచిన సాము చేసిందీ ఆయనకు అర్థం కాదు.

ఆనంవారి మోసంతో అనిల్ కుమార్ యాదవ్ మీద చెప్పలేనంత సానుభూతి కురిసింది, కాంగ్రెస్ సానుకూల ఓట్లకు ఈ సానుభూతి కలగలిస్తే విజయం ఖాయమని కాంగ్రెస్‌వాదుల అంచనా. అయితే అది వారి వూహల్లో నుంచి పుట్టిన ఆశ తప్ప, వాస్తవంలో ఆ పరిస్థితి ఎంత మాత్రం లేదు. మొదటగా – నగరంలో కాంగ్రెస్ సానుకూల




వాతావరణం కన్పించలేదు. రెండవది – అనిల్ అభ్యర్థిత్వం జనం దృష్టిలోనే పడలేదు.

ముక్కోణపు పోటీలో ముగ్గురు అభ్యర్థులూ బలమైనవారు కావడం వల్ల పెద్దగా మెజార్టీ రాకపోవచ్చు కానీ, ప్రజారాజ్యం శ్రీధరకృష్ణారెడ్డి గెలుపులో ఎటువంటి అనుమానాలు లేవు.

## దుర్మార్గుడిగా ప్రజల తిరస్కారం

నెల్లూరు రూరల్ శాసనసభా నియోజకవర్గంలో కూడా ప్రజారాజ్యం అభ్యర్థి ఆనం వెంకటరమణారెడ్డి ఎమ్మెల్యేగా గెలిచినట్లు ధైర్యంగా ప్రకటన చేయవచ్చు. ఒట్టి గెలుపు కాదు, కళ్లు చెదిరే మెజార్టీ దక్కించుకోబోతున్నాడు ఆనం రమణ. ఇటు నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో చేరే నగరం ఓట్లు, అటు రూరల్ మండలంలోని గ్రామాలలో ఓటర్లకు రైలు ఇంజన్ తప్ప ఓటింగ్ మెషిన్ మీద వేరొక గుర్తు కనిపించలేదు. కాంగ్రెస్ పార్టీ ఓట్లలో నూటికి 70 శాతం అటే పడ్డాయి. తెలుగుదేశం ఓట్ల నుంచి కూడా 50 నుంచి 60 శాతం వరకు ఇటే వలస వచ్చాయి.

ఆనం వెంకటరమణారెడ్డికి ఇంతగా ఓట్లు కుప్ప పడడానికి కారణం – కాంగ్రెస్ అభ్యర్థి ఆనం వివేకానందరెడ్డి మీద ఒక ఉప్పెన వలె వెల్లువెత్తిన వ్యతిరేకత. వారు వీరు అనే తేడా లేకుండా, కులం మతం భేదం చూపకుండా, అన్ని వయస్సుల వారు, అన్ని వర్గాలవారూ ఏకాభిప్రాయంతో వివేకాను తిరస్కరించిన ఎన్నిక ఇది. మహిళలైతే ఆయనకు ఓటు వేయడమనే ఆలోచనే అసహ్యించుకొన్నారు. 1989 ఎన్నికలను జ్ఞాపకానికి తెచ్చింది ఈ నియోజకవర్గం. అప్పట్లో నెల్లూరు సీటు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా కెవి.సుబ్బారెడ్డి, స్వతంత్రుడిగా జెకె.రెడ్డి పోటీ చేశారు. జనం కెవి.సుబ్బారెడ్డిని అసలు అభ్యర్థిగా గుర్తించలేదు. ఆయనకు డిపాజిట్ పోయింది. ఆయన మీద ప్రజలలో కల్గిన తిరస్కారభావానికి కారణం – ఆయన ఎవరికీ, ఎందుకూ పనికిరాని వాడన్న ప్రచారం. చెడు చేసే వాడు కాకపోయినా, మంచి చేయలేని వాడన్న నిరసనతో ఆయన రంగంలో లేనట్లే భావించి కాంగ్రెస్ వాదులంతా జెకె.రెడ్డిని ఎంపిక చేసుకొన్నారు.

ఇప్పుడు వివేకా విషయంలో కూడా అదే జరిగిందని చెప్పవచ్చు. కెవి.సుబ్బారెడ్డిని అసమర్థుడిగా తోసిపుచ్చిన ఓటర్లు, వివేకాను మాత్రం దుర్మార్గుడిగా భావించి తిరస్కరించారు. కార్పొరేషన్ మేయర్ విషయంలో ఆయన అనుసరించిన అనుచితవైఖరి, భానుశ్రీని మేయర్ చేయడం కోసం తొక్కిన అడ్డదారులు, నేదురుమల్లి రాజ్యలక్ష్మి, పనబాక లక్ష్మి వంటి మహిళా నేతలను అకారణంగా సూటిపోటి మాటలతో వేధించిన తీరు, వికృతమైన వేషభాషలు, అహంకార ప్రవర్తన, అదుపు తప్పిన అవినీతి, తన మాట విననివారు ఇళ్లు కూలగొట్టించడం, కేసులు పెట్టి వేధించడం వంటి తప్పుడు పనులన్నీ ఆయన పాలిట శాపాలుగా మారాయి. శిశుపాలుడు నూరు తప్పులను లెక్కించిన కృష్ణ పరమాత్మ వలె వివేకానందరెడ్డి పాపాలకు ఓటమి ద్వారా ప్రాయశ్చిత్తం చేశారు నెల్లూరు పుర జనం. విచిత్రంగా పల్లెలలో కూడా ఆయన పట్ల తీవ్ర అయిష్టత వ్యక్తమైంది. ఆయనకు ఓటు వేయడం అంటే ఒక రౌడీని తెచ్చి పెట్టుకోవడంగా భయపడ్డారు పల్లె ప్రజలు.

నెల్లూరు నగరంలో ఆనం వెంకటరమణారెడ్డికి చాలా పెద్ద మెజార్టీ రాబోతున్నది. ములుమూడి ఫిర్కాలోకి వచ్చే పడమటిపల్లెలు కూడా అదే ఉత్సాహంతో ఆయనకు ఓటు వేశాయి. తూర్పు పల్లెలలో కొంత భాగం కాంగ్రెస్ ఓటు హస్తం మీద పడినా, పడమటి పల్లెలలో మాత్రం కాంగ్రెస్, టిడిపి ఓట్లు రెండూ రైలు యింజన్ మీదనే పడ్డాయని చెప్పవచ్చు.

ఇక్కడ తెలుగుదేశం అభ్యర్థి రంగంలో వుండి వుంటే ఈ పరిస్థితి వారికి అనుకూలంగా మారి వుండేదేమో. కానీ పొత్తులలో భాగంగా ఈ సీటును సిపిఎంకు ఇచ్చారు. ఆ పార్టీ అభ్యర్థి భానురాజుకు మంచి వాడనే పేరు వున్నప్పటికీ, తన స్వంతపార్టీని కూడా చైతన్యపరిచే శక్తిలేనివాడు. 1977 నుంచి ఆయన్ను పోటీలో చూసి చూసి విసుగెత్తిపోయి వున్నారు జనం. కమ్యూనిస్టు ఓటర్లు కూడా ఆయనకు ఓటు వేయడానికి ఇష్టపడలేదు.

తొరువ 13వ పేజీలో

**వెంకటగిరి**



తెలుగుదేశం

**గూడూరు**



తెలుగుదేశం

**సర్వేపల్లి**





?

**సూళ్లూరుపేట**



తెలుగుదేశం

**ఆత్మకూరు**



తెలుగుదేశం

# ఉల్లాసంగా ఉత్సాహంగా ఓటేశారు!

**2004 సంవత్సరంలో జరిగిన పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో 12,68,783 మంది ఓటేయగా, ఈసారి ఎన్నికల్లో 14,70,381 మంది ఓటేశారు. వీరిలో మహిళల సంఖ్య 7,39,211గా నమోదయ్యింది.**

2004 సంవత్సరంలో జరిగిన పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల కంటే మొన్న ఏప్రెల్ 23వ తేది జరిగిన జమిలి ఎన్నికల్లో పెద్దసంఖ్యలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకొన్నారు. గత ఎన్నికల్లో 12,68,783 మంది ఓటింగ్‌లో పాల్గొనగా ఈసారి ఈ సంఖ్య 14,70,381కి చేరుకొంది. ప్రతి నియోజకవర్గంలో పురుషుల కంటే మహిళల ఓటింగ్ శాతం అధికంగా నమోదయ్యింది. 2004 సంవత్సరంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో పురుషులు ఎక్కువ శాతం ఓటు హక్కును వినియోగించుకొంటే ఈ దఫా మహిళలు ముందంజ వేశారు. గత ఎన్నికలలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో 17,37,837 మంది ఓటర్లు వుండగా వీరిలో 12,68,783 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. వీరిలో పురుషులు 6,45,701 కాగా, 6,23,082 మంది మహిళలు వున్నారు. ఈసారి జిల్లావ్యాప్తంగా 20,91,698 మంది ఓటర్లుండగా వీరిలో పురుషులు 10,25,695 మంది, స్త్రీలు 10,65,943 మంది వున్నారు.

2004 సంవత్సరంలో జరిగిన ఎన్నికలను పరిశీలిస్తే నెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గంలో 2,18,281 ఓటర్లుండగా వీరిలో 1,15,443 మంది ఓట్లు వేయడం జరిగింది. వీరిలో పురుషులు 60,657 కాగా, 54,780 స్త్రీలు వున్నారు. ప్రస్తుతం 1,99,788 ఓట్లకు గాను 1,05,935 ఓట్లు పోలైనాయి. వీరిలో పురుషులు 53,096, స్త్రీలు 52,839 మంది తమ ఓటు హక్కును వినియోగించుకొన్నారు. ఈ నియోజకవర్గంలో 53.04 శాతం నమోదయ్యింది.

కోవూరు నియోజకవర్గంలో 2004 సంవత్సరంలో 1,40,980 మంది ఓట్లకు గాను, 1,05,175 ఓట్లు పోలైనాయి. వీరిలో పురుషులు 53,774, స్త్రీలు 51,401 మంది ఓటు హక్కు వినియోగించుకొన్నారు. ప్రస్తుతం జరిగిన ఎన్నికలలో 2,27,130 ఓట్లకు గాను 1,68,171 ఓట్లు పోలైనాయి. వీటిలో పురుషులు 83,062 మంది, స్త్రీలు 85,109 మంది ఓటు వేయడం జరిగింది. ఇక్కడ 74.08 శాతం నమోదు కాబడింది.

సర్వేపల్లి నియోజకవర్గంలో గత ఎన్నికలలో 1,64,137 ఓట్లకు గాను, 1,33,151 ఓట్లు పోలైనాయి. వీటిలో పురుషులు 67,287, స్త్రీలు 65,846 మంది ఓటు హక్కును వినియోగించుకొన్నారు. ప్రస్తుతం జరిగిన ఎన్నికల 1,95,412 ఓట్లు నమోదై వున్నాయి. వీటిలో 1,55,588 ఓట్లు పోలుకాగా పురుషులు 77,632మంది, స్త్రీలు 77,956 మంది ఓటు హక్కును వినియోగించుకొన్నారు. ఈ నియోజకవర్గంలో అత్యధికంగా 79.63 శాతం పోలింగ్ నమోదయ్యింది.

కావలి నియోజకవర్గంలో 2004 సంవత్సరంలో 1,63,534 ఓట్లకు గాను 1,18,153 ఓట్లు పోలైనాయి. వీరిలో 59,263 మంది పురుషులు ఓటు హక్కు వినియోగించుకోగా, 58,890 మంది స్త్రీలు తమ ఓటును వేశారు. ప్రస్తుతం జరిగిన ఎన్నికలకు 2,18,390 ఓట్లు నమోదుకాబడ్డాయి. వీటిలో 1,54,030 ఓట్లు పోలైనాయి. వీటిలో పురుషుల ఓట్లు 76,189, స్త్రీల ఓట్లు 77,841 నమోదయ్యాయి. ఈ నియోజకవర్గంలో 70.56 శాతం పోలింగ్ నమోదయ్యింది.


గూడూరు నియోజకవర్గంలో గత ఎన్నికలలో 1,66,907 ఓట్లుకు గాను 1,19,745 ఓట్లు పోలైనాయి. వీటిలో పురుషులు 61,270, స్త్రీలు 58,475 మంది ఓటును వినియోగించారు. ప్రస్తుతం 2,10,676 ఓట్లకు గాను 1,51,997 ఓట్లు పోలైనాయి. వీటిలో పురుషులు 75,994 మంది, స్త్రీలు 76,003 మంది ఓటు వేయడం జరిగింది. ఇక్కడ 72.16 శాతం నమోదయ్యింది.

వెంకటగిరి నియోజకవర్గంలో గత ఎన్నికలలో 1,47,405 ఓట్లకు గాను 1,16,029 ఓట్లు పోలైనాయి. వీటిలో పురుషులు 58,755, స్త్రీలు 57,274 మంది ఓటు హక్కును వినియోగించుకొన్నారు. ప్రస్తుతం 2,08,348 ఓట్లు వుండగా వీటిలో 1,58,724 ఓట్లు పోలైనాయి. పోలైన ఓట్లలో పురుషులు 79,173మంది, స్త్రీలు 79,551 మంది ఓటువేశారు. ఈ నియోజకవర్గంలో 76.20శాతం పోలింగ్ జరిగింది.

సూళ్లూరుపేట నియోజకవర్గంలో గత ఎన్నికలలో 1,54,359 ఓట్లకు గాను 1,11,324 ఓట్లు పోలైనాయి. వీటిలో 59,047 పురుషులు కాగా, 52,277 మంది స్త్రీలు ఓటు వేశారు. ప్రస్తుతం 2,12,082 గాను 1,58,843 ఓట్లు పోలైనాయి. వీటిలో పురుషులు 79,834 మంది, స్త్రీలు 79,009 మంది ఓటును వినియోగించుకొన్నారు. ఈ నియోజకవర్గంలో 74.90 శాతం పోలింగ్ జరిగింది.

ఆత్మకూరు నియోజకవర్గంలో 2004 సంవత్సరంలో 1,47,736 ఓట్లకు గాను 1,19,333 ఓట్లు పోలైనాయి. వీటిలో పురుషులు 60,033 మంది కాగా, 59,300 మంది స్త్రీలు తమ ఓటును వినియోగించుకొన్నారు. ప్రస్తుతం ఆత్మకూరు నియోజకవర్గంలో 1,89,880 ఓట్లు నమోదై వున్నాయి. వీటిలో 1,46,684 ఓట్లు పోలైనాయి. పురుషులు 72,788 మంది, స్త్రీలు 73,896 మంది తమ ఓటు హక్కును వినియోగించుకొన్నారు. ఇక్కడ 77.31 శాతం పోలింగ్ నమోదయ్యింది.

ఉదయగిరి నియోజకవర్గంలో గత ఎన్నికలలో 1,20,113 ఓట్లకుగాను 88,043 ఓట్లు పోలైనాయి. వీటిలో పురుషులు 42,379, స్త్రీలు 45,664 మంది ఓటును వేశారు. ప్రస్తుతం ఈ నియోజకవర్గంలో 2,03,595 ఓట్లు నమోదయ్యాయి. వీటిలో 1,46,725 ఓట్లు పోలైనాయి. పురుషులు 71,858 మంది, స్త్రీలు 74,867 మంది తమ ఓటు హక్కును వినియోగించుకొన్నారు. ఇక్కడ 72.07శాతం పోలింగ్ జరిగింది.



ఆత్మకూరులో ఓటేయడానికి బారులు తీరిన పురుషులు.

కొత్తగా ఏర్పడ్డ నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,26,906 వున్నాయి. వీటిలో 1,23,684 ఓట్లు పోలైనాయి. వీటిలో పురుషులు 61,544, స్త్రీలు 62,140 మంది ఓటు హక్కును వినియోగించుకొన్నారు. ఇక్కడ 54.52 శాతం నమోదయ్యింది.

నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా అల్లూరు, రాపూరు అసెంబ్లీ నియోజకవర్గాలను రద్దు చేసి కొత్తగా నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. పునర్విభజన కారణంగా నియోజకవర్గాల పరిధిలో మండలాల సరిహద్దులు కూడా పూర్తిగా మారిపోయాయి.

దీంతో ఒక్కో నియోజకవర్గంలో 50 వేల నుంచి 90 వేల వరకు అదనంగా ఓట్లు చేర్చారు. అలాగే ప్రతి నియోజకవర్గంలో వేల సంఖ్యలో కొత్త ఓటర్లు తమ పేర్లను నమోదు చేసుకోవడం కూడా జరిగింది. మహిళలు పెద్దసంఖ్యలో ఓటు వేయడంతో ఫలితాలపై రాజకీయ పార్టీల్లో ఉత్కంఠత నెలకొంది.

# కాయ్ రాజా కాయ్!

**సర్వేపల్లి, ఆత్మకూరు, నెల్లూరు రూరల్ నియోజకవర్గాల్లో పోటీ చేసిన అభ్యర్థుల గెలుపుపై బెట్టింగ్.**



జిల్లాలో ఈ నెల 23వ తేది జరిగిన ఎన్నికలలో పోటీ చేసిన ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థుల గెలుపు ఓటములపై లక్షల రూపాయల పందాలు వూపందుకొన్నాయి. సాధారణ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం దగ్గర నుంచి అభ్యర్థుల గెలుపుపై పందాలు వేసుకోవడం కొన్ని నియోజకవర్గాల్లో జరగ్గా, పోలింగ్ ముగిసిన తర్వాత మరికొన్ని నియోజకవర్గాల్లో పందాల వర్షం వూపందుకొన్నది.

ఎన్నికలలో పోటీచేసిన అభ్యర్థులు ఓటర్లను ప్రలోభపెట్టి తమవైపుకు తిప్పుకొనేందుకు ఖరీస్థాయిలో నగదు, మద్యం, మహిళలకు చీరలు పంపిణీ చేయడం జరిగింది. అభ్యర్థులు పంపిణీ చేసిన నగదు, ఇతర వస్తువులు విలువను బట్టి కొన్ని నియోజకవర్గాలలో ప్రజలు ఓట్లు వేయడం జరిగింది. వీటిని ఆధారంగా చేసుకోవడంతో పాటు, పోటీలోవున్న అభ్యర్థుల తీరు, పార్టీల పట్ల ప్రజలకున్న ఆసక్తిని బేరీజు వేసుకొని 10వేల నుంచి లక్ష రూపాయల వరకు అభ్యర్థుల గెలుపు ఓటములపై బెట్టింగ్‌లు జరిగాయి. ముఖ్యంగా బెట్టింగ్‌లు సర్వేపల్లి, కావలి, ఆత్మకూరు, నెల్లూరు నగరం, నెల్లూరు రూరల్ నియోజకవర్గాలలో చోటు చేసుకొన్నాయి. రాష్ట్రమంత్రి ఆనం రామనారాయణరెడ్డి పోటీ చేసిన ఆత్మకూరు నియోజకవర్గంలో ఆయన గెలుపుపై ఎఎస్‌పేటకు చెందిన ఓ నాయకుడు లక్ష రూపాయలు పందెం కాశాడు. ఈ నాయకుడికి పోటీగా ఇదే నియోజకవర్గం నుంచి పోటీ చేసిన టిడిపి అభ్యర్థి కొమ్మి లక్ష్మయ్యనాయుడు గెలుస్తాడంటూ మరో టిడిపి నాయకుడు లక్ష రూపాయలు పందెం కాశాడు. అలాగే నెల్లూరు రూరల్, కావలి అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇంతే మొత్తంలో పందాలు జరిగాయి; జరుగుతున్నాయి.

పోలింగ్ ముగిసినా కూడా

తరువాయి 14వ పేజీలో

## ఉదయగిరిలో వడగళ్లవాన

ఉదయగిరి నియోజకవర్గంలో 25వ తేది కురిసిన వడగళ్లవానతో జనం భయపడిపోయారు. పెనుగాలులు వీచడంతో ఉదయగిరి మండలంలోని పలు ప్రాంతాలలో చెట్లు కూలిపోయాయి. నియోజకవర్గ పరిధిలోని కలిగిరి, వింజమూరు, దుత్తలూరు, వరికుంటపాడు, సీతారాంపురం, ఉదయగిరి మండలాల్లో ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చోటుచేసుకొని వడగళ్లతో కూడిన వర్షం రావడంతోపాటు ఉరుములు,

### నష్టపోయిన రైతులు

మెరుపులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేశాయి. ఈ ప్రాంతంలో సాగు చేస్తున్న మొక్కజొన్న, రాగి, సజ్జ పైర్లకు ఈ వర్షం వల్ల భారీ నష్టం వాటిల్లింది. మరికొన్ని ప్రాంతాలలో నూర్పిడి దశలో వున్న వరిపంటకు నష్టం రావడంతో రైతులు విలవిల్లాడిపోతున్నారు. వింజమూరు, వరికుంటపాడు, దుత్తలూరు తదితర మండలాల్లోని మిర్చి రైతులు సైతం అకాల వర్షం కారణంగా నష్టపో

కొరవ 14వ పేజీలో



పోలింగ్ సందర్భంగా జలదంకిలో పోలీసులు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తల మధ్య జరిగిన గొడవను సర్దుబాటు చేస్తున్న వంటేరు.

## పంట కాల్వల దురాక్రమణ

ఆత్మకూరు పట్టణంలో పంట కాల్వలను దురాక్రమించి కట్టడాలు నిర్మిస్తుండడంతో నీరున్నా ఆయకట్టు చివరి వరకు సాగునీరు అందక రైతులు అవస్థలు పడాల్సి వస్తుంది. దశాబ్దకాలంగా పంట కాల్వలు ఆక్రమణకు గురౌతున్నా అధికారులు పట్టించుకోక పోవడంతో సమస్య జటిలమవుతుంది. ముఖ్యంగా ఎనిమిది పంటకాల్వలు పట్టణం నుంచి తూర్పు ప్రాంత మాగాణి వైపు ప్రవహిస్తాయి. వీటిద్వారా 3600 ఎకరాలకు

### ఆత్మకూరులో సంగతిది

సాగునీరు అందుతుంది. ఇవి ఆక్రమణకు గురై పక్కా భవనాలు వెలుస్తుండడంతో ఎక్కడికక్కడ నీటి పారుదలకు అవకాశం లేక కాల్వలు పూడిపోతుండడంతో రైతులకు ఇబ్బందిగా పరిణమించింది. పోలీస్‌స్టేషన్, బిఎస్ఆర్ సెంటర్, కలుజు ప్రాంతం, జగన్నాథరావుపేట, సినిమా హాల్ సెంటర్ తదితర ప్రాంతాలలో పంటకాల్వలు ఆక్రమించి భవనాలు నిర్మించి వున్నారు. అధికారులు


కొరవ 14వ పేజీలో

# గెలుపుపై అందరిలోనూ సందేహాలు!

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల అనంతరం ప్రధాన పార్టీల అభ్యర్థుల విజయావకాశాలపై మల్లగుల్లాలు పడుతున్నారు. కోట్ల రూపాయలు వెచ్చించి ఎన్నికలలో పోటీచేసిన నేతల్లో ఇప్పుడు ఆందోళన మొదలయ్యింది. ఓటర్లను ఆకట్టుకొనేందుకు అన్ని ప్రయత్నాలు చేసినా ఎక్కడో ఏదో మూల ఆయా పార్టీల అభ్యర్థుల్లో విజయావకాశాలపై సందేహాలు పట్టి పీడిస్తున్నాయి. ఎన్నికలు అయిన తర్వాత ధీమాగా వుందామంటే ఫలితాలపై ఓటరు నాడి

### 16వ తేది వరకు అభ్యర్థులకు నరకయాతన

అంతుబట్టక నేతల పరిస్థితి అయోమయంగా వుంది. వర్గపోరు, వెన్నుపోట్లు, క్రాస్ ఓటింగ్ ఎక్కడ ఎవరిని దెబ్బతీస్తాయో, ఎవరి రాజకీయ జీవితాన్ని చిదిమేస్తాయోనన్న భయం అభ్యర్థులను వెంటాడుతోంది. అనుక్షణం ఆశనిరాశల నడుమ క్షణమొక యుగంలా గడుపుతున్నారు. అనుచరులు, సన్నిహితులు చెపుతున్న ధైర్య వచనాలు, కొంతమేర గెలువుపై ధీమాను కల్గిస్తుంటే, మరోవైపు ఓటర్లు ఏమి తీర్పు చెబుతారోనన్న అనుమానం వారిని వెంటాడుతోంది. మే 16వ తేది ఓట్ల లెక్కింపు జరిగేవరకు ఈ బాధ అభ్యర్థులకు క్షణక్షణం భయాన్ని కల్గిస్తుండడంతో ఊపిరి బిగపట్టుకొని ఎదురుచూడాల్సిన పరిస్థితి తలెత్తింది.



బ్రాహ్మణక్రాకలో ఓటువేస్తున్న తెలుగుదేశం పార్టీ తరపున నెల్లూరు పార్లమెంటు స్థానానికి పోటీచేసిన వంటేరు వేణుగోపాల్‌రెడ్డి.



బుచ్చిలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న కోవూరు ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థి మునెమ్మ

# గొలగమూడిలో సమస్యల తిష్ట!

ఆధ్యాత్మిక కేంద్రంగా భాసిల్లుతున్న గొలగమూడిలో సమస్యలు తిష్టవేసి వుండడం స్థానికులతోపాటు భక్తులను ఇబ్బందుల పాల్జేస్తున్నాయి. గ్రామానికి వెళ్లే రోడ్డు గుంటలమయంగా వుండడంతో ప్రయాణీకులు నిత్యం నరకయాతన పడాల్సి వస్తోందని వాపోతున్నారు. గొప్ప పేరు ప్రఖ్యాతులు సంపాదించుకొన్న భగవాన్ వెంకయ్యస్వామిని దర్శించుకొనేందుకు చుట్టుప్రక్కల ప్రాంతాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు వస్తుంటారు. అలాంటి గొలగమూడి గ్రామానికి వెళ్లే రహదారి అధ్వాన్నంగా వుంది. గుంటలు మిట్టలతో వున్న ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటేనే ప్రజలు తీవ్ర

### భక్తులపాట్లు వర్ణనాతీతం


అసౌకర్యానికి గురౌతున్నారు. దీనికి తోడు మంచినీటి సమస్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుంది. వేసవికాలంలో బావులు అడుగంటడం, గ్రామంలో వున్న బోరు నిరుపయోగంగా మారడంతో కిలోమీటర్ల దూరం వెళ్లి, నీటిని తెచ్చుకోవాల్సి వస్తున్నదని స్థానికులు వాపోతున్నారు. గ్రామంలోని దళితవాడ, ఎరుకుల పాళెంలోనూ ఇదే పరిస్థితి ఎదురౌతుండడంతో ప్రజలు నీటికోసం అష్టకష్టాలు పడుతున్నారు.

# అల్లూరులో త్రాగునీటికి కటకట

అల్లూరు పంచాయితీ పరిధిలోని అరుంధతీయవాడ, దళితవాడ ప్రజలు త్రాగునీటికోసం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు తలెత్తడంతో ఎండాకాలంలో గుక్కెడు నీటికోసం అల్లాడి పోతున్నారు. మొత్తం 600లకు పైగా కుటుంబాలు నివశిస్తున్న ఈ కాలనీ పరిధిలో గత కొన్నిరోజులుగా తాగునీరు పైపులైన్ల ద్వారా సరఫరా కాకపోవడంతో పలు అవస్థలు పడుతున్నారు. బిసి కాలనీ వద్ద మంచినీటి ట్యాంకును ఏర్పాటు చేసి వున్నారు. దానిపై ఆధారపడి జీవిస్తున్న కాలనీవాసులకు మరమ్మత్తుల పేరుతో అధికారులు మంచి నీటిని విడుదల చేయకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు స్థానికులు.

### అల్లాడుతున్న జనం

1200 రూపాయలు డిపాజిట్‌గాను, ఏడాదికి 300 రూపాయలను పన్నుల రూపంలో కట్టించుకొంటూ పైలట్ ప్రాజెక్టు అధికారులు నీటిని అందించకుండా ఇబ్బందులు పెట్టడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. కరెంటు మోటారు కాలిపోవడం, పైపులు దెబ్బతినడం వంటి కారణాలు తరచూ విన్పిస్తున్నా అధికారులు వాటిని రిపేరు చేయించడంలో శ్రద్ధ చూపకపోవడంతో ప్రజల పాలిట శాపంగా మారాయి.



ఆత్మకూరు జూనియర్ కాలేజిలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి.



నెల్లూరులో జరిగిన విలేకరుల సమావేశంలో జిల్లాలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమాగా చెబుతున్న మంత్రి రామనారాయణరెడ్డి. డిసిసి అధ్యక్షుడు ఎల్లసిరి గోపాలరెడ్డి.

# బాగున్న రోడ్డు త్రవ్వేశారు!

## కావలి మండలం రామవరప్పాడు దళితవాడ వద్ద దౌర్జన్యం!

అధికారుల అత్యుత్సాహం ప్రయాణీకుల పాలిట శాపంగా మారిన వైనం కావలిలో చోటుచేసుకొంది. కావలి నుంచి కొమ్మి మీదుగా కొండాపురం వెళ్లే రోడ్డును రామవరప్పాడు దళితవాడ వద్ద మలుపు తిప్పారు ఆ శాఖ అధికారులు. పాతరోడ్డును కాకుండా క్రొత్తగా రోడ్డును నిర్మిస్తున్నారు. దీనివల్ల ఎవరికి ఉపయోగం అన్నది ప్రజలకు అంతుచిక్కకుండా వుంది. పాతరోడ్డు కంటే కొత్తగా వేస్తున్న రోడ్డులో ప్రయాణించాలన్నా, నడిచి వెళ్లాలన్నా ఒకటిన్నర కిలోమీటరు దూరం పెరుగుతుందనేది స్థానికుల అభిప్రాయం. అయితే ఇక్కడి అధికారుల తీరు ప్రయాణీకులకు, పాదచారులకు ఇబ్బందిగా పరిణమించింది. కొత్త రోడ్డు పూర్తికాకుండానే అర్థరాత్రి సమయాన బుల్‌డోజర్ తీసుకొనివచ్చి బాగున్న పాత రోడ్డును త్రవ్వేశారు. నిక్షేపంగా వున్న పాతరోడ్డు త్రవ్వేసి కొత్త రోడ్డు నిర్మించడం వెనుక ఓ ఉన్నతాధికారి స్వార్థం వున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి.

### బుచ్చిలో పారిశుధ్యం పాతర

బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో పారిశుధ్యం లోపించడం కారణంగా ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారు. చెత్తాచెదారానికి తోడు కాలువలు పూడిపోయి దుర్గంధం వెదజల్లుతుండడంతో ఆ వాసన భరించలేక ప్రజలు అల్లాడిపోతున్నారు. పట్టణం నడిబొడ్డున వున్న ప్రాంతంలోనూ ఇదే పరిస్థితి. జనావాసాలకు మధ్య వున్న మురికి కాలువలు పూడిపోవడం, అధికారులు వీటి గురించి పట్టించుకోకపోవడంతో ప్రజలు ముక్కు మూసుకొని జీవనం సాగించాల్సి వస్తోంది. బుచ్చిరెడ్డిపాళెంలో వుండే సిపిఎం కార్యాలయం ప్రక్కనే వున్న మురికి కాలువతోపాటు, మర్రిచెట్టు సెంటర్ సమీపంలో వున్న డ్రైనేజి కాలువ గతంలో సాగునీటి కాలువలుగా వుండేవి. కాలగమనంలో ఈ రెండు కాల్వలు మురికి కాల్వలుగా రూపాంతరం చెందాయి. దీనికితోడు పలు ప్రాంతాలలో డ్రైనేజి వ్యవస్థ లేకపోవడంతో ఇళ్లలోని మురికినీటిని ప్రజలు ఈ రెండు కాల్వల్లోకి వదలడంతో అవికాస్త డ్రైనేజి కాల్వలుగా మారాయి, పోనీ వీటిని అయినా తరచూ పూడిక తీయిస్తున్నారా అంటే ఆ దిశగా అధికారులు శ్రద్ధ చూపక పోవడంతో కాల్వలు పూడిపోయి దుర్గంధం వెదజల్లుతుండడంతో స్థానికంగా నివాసం వుంటున్న కుటుంబాలు తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నాయి.

# ఉపాధికోసం రోడ్డెక్కిన మత్స్యకారులు

ఈపూరు పట్టపుపాళెంలో మత్స్యకారులు ఉపాధి కోసం రోడ్డెక్కారు. కృష్ణపట్నం పోర్టు అభివృద్ధి పనుల వల్ల చేపల వేట మానుకోవాల్సి వచ్చిందని, ఉపాధిలేక జీవనం కష్టమైందని ఆవేదన వ్యక్తం చేస్తున్న మత్స్యకారుల కుటుంబాలు తమ సమస్య పరిష్కరించాలని కోరుతూ ఆందోళనకు దిగారు. మత్స్యకారులు పోర్టు గేటు మూసివేసి ధర్నాకు పూనుకొన్నారు. పట్టపుపాళెంలో

## సర్దుబెట్టిన పోర్టు యాజమాన్యం

షుమారు 350 కుటుంబాలు సముద్రంలో వేటనే జీవనాధారంగా చేసుకొని జీవిస్తుండేవి. పోర్టు ఏర్పాటువల్ల తమ జీవనం అస్తవ్యస్తం అయిందని, ఉపాధిలేక కుటుంబాలు పస్తులతో వుండాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతోకాలంగా ఉపాధి కోసం పోర్టు యాజమాన్యం, అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని, అందుకే ఆందోళనకు దిగామని పాళెం కాపు పోలయ్య వివరించారు.

### ఇటుక బట్టీలతో కష్టాలు

నిబంధనలకు విరుద్ధంగా సాగిస్తున్న ఇటుక బట్టీల వల్ల పలు ప్రాంతాల ప్రజలు అనారోగ్యం పాలవడం, ప్రమాదాలు చోటుచేసుకోవడం సంభవిస్తున్నది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రజలకు ఇబ్బంది కలగని విధంగా ఇటుక బట్టీలను ఏర్పాటు చేయాల్సివుండగా ఒక్కరూ దానిని పాటించకపోవడమే కాకుండా రోడ్డును ఆక్రమించుకొని యథేచ్ఛగా ఈ వ్యాపారం సాగిస్తున్నారు. నెల్లూరు - బొంబాయి జాతీయ రహదారి మీద సాలుచింతల నుంచి అడ్డదిడ్డంగా బట్టీలను కాలుస్తుండడంతో వాటి నుంచి వచ్చే విపరీతమైన పొగ, దుమ్ము,ధూళి కారణంగా ప్రయాణీకులు, వాహన చోదకులు పలు అవస్థలు పడుతున్నారు. పొగ కారణంగా రోడ్డు కన్పిం

తరువాయి 14వ పేజీలో



మరణాలకు ఈ కడలి మౌనసాక్షి

# మైపాడు బీచ్‌లో మరణ మృదంగం

## ఈవారంలో ఐదుమంది దుర్మరణం

అందమైన సముద్ర తీరప్రాంతమైన మైపాడు బీచ్ ఇప్పుడు మృత్యుకుహరంగా మారింది. సముద్రంలో కేరింతలు కొట్టాలని, సెలవులలో స్నేహితులతో కలసి సరదాగా బీచ్ వద్ద గడపాలని భావిస్తున్న యువత పాలిట బీచ్ యమపాశంగా కన్పిస్తున్నది. గతంలో పలువురు సముద్రస్నానానికి వెళ్లి మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. గడచిన వారం రోజుల్లో ఐదుగురు దుర్మరణం చెందారు. ముత్తుకూరు మత్స్యకళాశాలలో చదివే విద్యార్థులైన శ్రీనివాస్, సతీష్‌లు సముద్రంలో స్నానం చేస్తూ అలల తాకిడికి కొట్టుకపోయి శవాలుగా మారారు. ఈ సంఘటన జరిగిన రెండు రోజులకే నెల్లూరుకు చెందిన రాంగోపాల్, తిరుపతికి చెందిన భాస్కర్‌లు మిత్రులతో కలిసి మైపాడు బీచ్‌కు వచ్చి ప్రాణాలు పోగొట్టుకోవడం పలువురిని కలచివేసింది. బీచ్‌కు వెళ్లాలని, స్నేహితులతో హుషారుగా గడపాలని వచ్చే పర్యాటకులు ఇప్పుడు మైపాడు బీచ్ పేరు చెబితేనే హడలిపోతున్నారు.

### గిట్టుబాటు ధరలేక రైతుల లబోదిబో!

పడించిన పంటకు గిట్టుబాటు ధర లేక అన్నదాతలు దిగులుపడి పోతున్నారు. పంట దిగుబడి బాగా వచ్చినప్పటికీ గిట్టుబాటు ధరలు లేకపోవడం రైతులను ఆందోళనకు గురి చేస్తుంది. దీనికి తోడు దళారుల బెడద అధికం కావడంతో పుట్టికి షుమారు వెయ్యి రూపాయల మేర నష్టపోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఆత్మకూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో ఈ సమస్య అధికంగా వుంది. నిన్నమొన్నటివరకు 11వేల రూపాయలు పలికిన పుట్టి ధర ఇప్పుడు 7,600లకు పడిపోవడంతో వేలాది రూపాయలు అప్పులుచేసి పెట్టుబడి పెట్టిన రైతులు చివరకు పంట చేతికి వచ్చే సమయానికి గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్టాలపాలవుతున్నారు. ప్రభుత్వం రైతుల స్థితిని గుర్తించి గిట్టుబాటు ధర కల్పించినట్లయితే ఈ ఏడాదైనా కొంతమేర లాభపడుతామని అన్నదాతలు ఆశపడుతున్నారు. ప్రభుత్వమే నేరుగా రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలుచేసి ఆదుకొంటే తప్ప నష్టాల ఊబి నుంచి బయటపడే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు రైతులు.



కోవూరు జూనియర్ కాలేజివద్ద ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రం ముందు ప్రజారాజ్యం పార్టీకి ఓటువేయమని కోరుతున్న పిల్లలు.

# తడ చెక్‌పోస్టులో పనిచేయని నిఘా కెమెరాలు

జిల్లా సరిహద్దులు దాటి ప్రక్కనే వున్న తమిళనాడు రాష్ట్రానికి తరలివెళ్తున్న అక్రమరవాణాను అరికట్టేందుకు తడ మండలం భీములవారిపాళెం ఉమ్మడి తనిఖీ కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన అత్యాధునిక నిఘా కెమెరాలు మరమ్మత్తులకు నోచుకోక మూలనపడ్డాయి. కెమెరాలు చెడిపోయి ఎనిమిది సంవత్సరాలు కావస్తున్నా ఒక్కరూ పట్టించుకొనే వారు లేకపోవడంతో కెమెరాలు ఏర్పాటుచేసిన లక్ష్యం దెబ్బతినిపోయింది. లక్షల రూపాయలు వెచ్చించి 2001లో అత్యాధునిక కెమెరాలను ఏర్పాటుచేసి వాటిని కం

## రిపేరుకు శ్రద్ధచూపని అధికారులు!

ప్యూటర్‌కు అనుసంధానించారు. వీటి ద్వారా అక్రమ రవాణాను, స్మగ్లర్ల ఆట కట్టించ వచ్చునన్నది ఉన్నతాధికారుల నమ్మకం. ఇది ఏర్పాటుచేసిన కొద్దికాలానికే కెమెరాలు చెడిపోవడంతో వాటి గురించి మరచిపోయారు. చిన్నపాటి ఖర్చుతో రిపేర్లు చేయించాలన్న ఆలోచనే సిబ్బందిలో లేకపోవడంతో లక్షలు ఖరీదుచేసే నిఘా కెమెరాలు కేవలం దిష్టిబొమ్మలుగా మిగిలాయి. దీంతో వీటి ఏర్పాటు వెనుకగల లక్ష్యం నీరుగారిపోయింది.

# ప్రశాంతంగా ఎన్నికలు!



నెల్లూరులో ఓటేస్తున్న కలెక్టర్, ఎస్పీ.

ప్రశాంతతకు మారుపేరైన నెల్లూరు జిల్లాలోనూ ఎన్నికల సమయంలో అవాంఛనీయ సంఘటనలు నమోదయ్యేవి. రిగ్గింగ్, ఓటింగ్ యంత్రాల అపహరణ వంటివి చోటు చేసుకొనేవి. ఉదయగిరి నియోజకవర్గంలో గొడవలు జాస్తిగా జరిగేవి. కాని డిజిపి మహంతి తీసుకొన్న ముందు జాగ్రత్త చర్యల మూలంగా జిల్లాలో ఈసారి చిన్నపాటి ఘర్షణలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మర్రిపాడు

## చెప్పుకోదగ్గ సంఘటనలు లేవు

మండలంలో రెండు మూడు పోలింగ్ కేంద్రాల్లో రిగ్గింగ్ జరిగిందన్న ఆరోపణలు వినవచ్చాయి. జడ్పీ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్వగ్రామం తోడేరులో తెలుగుదేశం పార్టీ ఏజంట్లను బయటకు త్రోసి వేయడం వివాదాస్పదమయ్యింది. దుత్తలూరు, అల్లూరు మండలంలోని పడమరగోగులపల్లి, పురిణి గ్రామాలలో ఎన్నికల అనంతరం గొడవలు జరిగాయి.

చిల్లకూరు మండల కేంద్రంలోని శంకరగిరి గిరిజనకాలనీకి చెందిన ఈగ రమణయ్య (60) ఓటు వేయను వచ్చి గుండెపోటుతో మరణించాడు. దొరవారిసత్రం ఎగువమేలిపాక గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి సరస్వతమ్మ, కేంద్ర సహకారబ్యాంక్ ఛైర్మన్ వాకాటి నారాయణరెడ్డిపై తెలుగుదేశం పార్టీ వారు దాడియత్నం చేశారు.

కోవూరు మండలం కొత్తహరిజనవాడ ఓటర్లు పోలింగ్‌ను బహిష్కరించారు. కావలి నియోజకవర్గం తోపాటు కోవూరులోనూ పలుచోట్ల ఈవిఎంలు మొరాయించాయి. నెల్లూరు రూరల్ మండలంలో 15చోట్ల ఈవిఎంలు ఇబ్బంది పెట్టడంతో పోలింగ్ అరగంట ఆలస్యంగా మొదలయ్యింది. ఉదయగిరి నియోజకవర్గంలోని మంచాల నాయుడుపల్లి, శనేశ్వరపురం, రామాపురం, వెంగమాంబపురం గ్రామాల్లో తెలుగుదేశం, కాంగ్రెస్ వర్గాలు కయ్యానికి కాలుదువ్వాయి. దరిదావులు అటు పార్లమెంటు, ఇటు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అన్ని ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ తమ స్వగ్రామాలలో ఓటు హక్కు వినియోగించుకొన్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు వేయడం విశేషం.




# ఓట్ల కొనుగోలుకు వెనకడుగు వేయని పార్టీలు!

కాలగతిన ఓటు రేటు కూడా పెరిగిపోయింది. 2004 ఎన్నికల్లో ఓటరుకు 500 రూపాయల చొప్పున ఆత్మకూరు నియోజకవర్గంలో అందించారు. అదే నియోజకవర్గం నుంచి ఈసారి ఎన్నికల్లో పోటీ చేసిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తన ప్రత్యర్థి కొమ్మి లక్ష్మయ్య నాయుడిని ఎదుర్కోను ఓటుకు వెయ్యి రూపాయలు చొప్పున పంచి రికార్డు సృష్టించారు. పోటీ క్లిష్టతరంగా మారిన ప్రాంతాల్లోనే వెయ్యి రూపాయలు పంచిన మంత్రి మిగతా ప్రాంతాల్లో 500 రూపాయల చొప్పున పంచారు. సర్వేపల్లి నియోజకవర్గంలో పోటీ ప్రతిష్టాకరంగా మారడంతో కాంగ్రెస్, తెలుగుదేశం అభ్యర్థులు ఓటుకు చివరి నిమిషంలో ఐదు వందల రూపాయల చొప్పున పంచారు. కోవూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి 300 రూపాయలు, తెలుగుదేశం అభ్యర్థి 200 రూపాయల లెక్కన విరివిగా పంచినట్లు ఓటర్లే చెప్పారు. పోటీ ఆసక్తికరంగా మారిన మరో నియోజకవర్గం వెంకటగిరిలో తెలుగుదేశం అభ్యర్థి ఓటుకు 300 రూపాయలు, మూడు క్వార్టర్ బాటిళ్ల మద్యం, కాంగ్రెస్ అభ్యర్థి 200 రూపాయలు, క్వార్టర్ బాటిల్ మద్యం అందించారు. ఇక్కడ ఓటర్లకు పంచమని ఇచ్చిన మొత్తాలు కొన్ని చోట్ల ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు దిగమింగడంతో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వెళ్లలేదు. మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో ఈ మొత్తాలు అందాక ఓటర్లు ఓటు వేయను బయలుదేరి వెళ్లారు. కావలిలో తెలుగుదేశం, పిఆర్పీ అభ్యర్థులు 300 రూపాయలు, కాంగ్రెస్ అభ్యర్థి 200 రూపాయల చొప్పున పంచారని, ఈ మొత్తాలేగాక కొన్నిచోట్ల చీరలు కూడా ఇచ్చినట్లు ఓటర్లు నిజాయితీగా ఒప్పుకొన్నారు. నెల్లూరు రూరల్ మండలంలో పోటీ నువ్వా - నేనా అన్నట్లు సాగడంతో 70వేల మంది ఓటర్లకు కాంగ్రెస్ అభ్యర్థి డబ్బులు, లక్ష

## ఆత్మకూరులో వెయ్యి రూపాయలు పలికిన ఓటు

మందికి మద్యం పంచినట్లు ఈ పంపిణీలో పాల్గొన్న ద్వితీయశ్రేణి నేతలు స్పష్టం చేశారు. సూళ్లూరుపేటలో కాంగ్రెస్ అభ్యర్థి 200, తెలుగుదేశం అభ్యర్థి వంద రూపాయల చొప్పున పంచినట్లు ఓటర్లు చెప్పారు. మరో రిజర్వుడు నియోజకవర్గం గూడూరులోనూ ఇరు పార్టీల అభ్యర్థులు ఓటుకు 200 రూపాయల చొప్పున పంచారు. ఉదయగిరిలో అధికారపక్షం 300 రూపాయలు ఓటుకు పంచగా ప్రతిపక్షం 200 రూపాయలు పంచింది. నెల్లూరు సిటీ నియోజకవర్గం ఓటర్లకు కూడా 300 రూపాయల చొప్పున ఓటుకు తాయిలాలు అందాయి. ఓటుకు నోటుతోపాటు మద్యం బాటిళ్లు, చీర, జాకెట్ కలిగిన గిఫ్ట్ ప్యాకెట్లు అందజేశారు. ఓటర్లకు డబ్బు పంపిణీ చేయడంలో కాంగ్రెస్, తెలుగుదేశం, ప్రజారాజ్యం పార్టీల్లో ఏ పార్టీ వెనుకడుగు వేయకపోవడం విశేషం.

### జేబుదొంగల హవా

ఎన్నికల పుణ్యమా అని కార్యకర్తలు, ప్రచారానికి వచ్చేవారితోపాటు జేబుదొంగలకు మంచి పని దొరికింది. హంగు ఆర్భాటాలతో ప్రచారం చేసిన అభ్యర్థులు, వారికి వెన్నుదన్నుగా నిలచిన బడాబాబులు, నటీనటుల రాకతో జేబు దొంగలకు కాసుల పంట పండింది. నిత్యం జనంతో, ప్రచారానికి, రోడ్‌షోలకు వెళ్లేవారి జేబుల్లో వుండిన నగదు, నగలతోపాటు ఖరీదైన సెల్ ఫోన్లు హాంఫట్ అయ్యాయి. ప్రచారంలో అభ్యర్థులు, వారి వెంట వచ్చిన అనుచరగణం వుంటే, జేబుదొంగలు తమ హస్తలాఘవం ప్రదర్శించడంలో నిమగ్నమై పలువురి జేబులకు చిల్లులు పెట్టారు. చంద్రబాబు నాయుడు, రాహుల్‌గాంధీ, చిరంజీవి, నాగబాబు,

తొరవ 14వ పేజీలో

# పోలింగ్‌లో సర్వేపల్లి ఫస్ట్!





23తేది జరిగిన జమిలి ఎన్నికల్లో జిల్లావ్యాప్తంగా 70.30 శాతం పోలింగ్ నమోదయ్యింది. అత్యధికంగా సర్వేపల్లిలో 79.63శాతం జరిగింది.

## విజేత ఎవరో?

అత్యల్పంగా నెల్లూరుసిటీలో 53.04 శాతం జరిగింది. ఆత్మకూరులో 77.31, సూళ్లూరుపేటలో 76.20, గూడూరులో 74.90, వెంకటగిరిలో 76.20, ఉదయగిరిలో 72.07 శాతం, కోవూరులో 74.08, కావలిలో 70.56 శాతం నమోదయ్యింది. కొత్తగా ఏర్పడ్డ నెల్లూరురూరల్ నియోజకవర్గంలో 54.52 శాతం ఓట్లు పోలయ్యాయి. 2004 ఎన్నికలతో పోల్చుకొంటే ఉదయగిరి, కావలి, కోవూరు, ఆత్మకూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం తగ్గగా, వెంకటగిరి, గూడూరు, నెల్లూరు నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం పెరిగింది.

# ఉదయగిరికే పరిమితమైన రాజమోహన్‌రెడ్డి!

నెల్లూరు పార్లమెంటు స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన మేకపాటి రాజమోహన్‌రెడ్డి



ఎన్నికల రోజు ఉదయగిరి నియోజకవర్గంలోనే తిష్టవేయడం చర్చనీయాంశమయ్యింది. సహజంగా పార్లమెంటు స్థానానికి పోటీలో వుండే అభ్యర్థులు పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లోనూ పోలింగ్‌సరళి పరిశీలిస్తూ తిరుగుతారు. కాని ఉదయగిరి నియోజకవర్గంలో ఏర్పడ్డ ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని మేకపాటి రాజమోహన్‌రెడ్డి పోలింగ్ మొదల

## నీడలా వెంటాడిన కంభం

య్యింది మొదలు ముగిసేవరకు ఉదయగిరి నియోజకవర్గంలోని గ్రామాల్లోనే తిరుగుతూ కనిపించారు.

రాజమోహన్‌రెడ్డి ఏదోచేస్తారన్న అనుమానంతో ఆయన్ను ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన తెలుగుదేశం అభ్యర్థి కంభం విజయరామిరెడ్డి వెంబడిస్తూ తిరిగారు. ఒకచోట ఇద్దరూ సహనం కోల్పో



యారు. ఏకవచన సంబోధనతో దూషించుకొని ఉదయగిరివాసుల్లో వుండే ఫ్యాక్షన్ గుణాన్ని లోకానికి చాటారు.

# అదరగొడుతున్న ఎండలు

## అల్లాడుతున్న జనం...



ఎండధాటిని తట్టుకోలేక ఒకేగొడుగు క్రింద ముగ్గురు యువతులు.

గతవారం రోజులుగా ఎండలు ముదరడంతో నెల్లూరు ప్రజానీకం అల్లాడిపోతోంది. ఉదయం ఏడుగంటల నుంచే భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. పది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండ అదరగొట్టేస్తున్నది. ఇప్పటివరకు 43 సెల్సియస్ డిగ్రీల వరకు నెల్లూరులో ఉష్ణోగ్రత నమోదయ్యింది. ఏప్రెల్ నెలలోనే ఎండలు ఈ విధంగా వుండడంతో మే నెలను తలచుకొని జనం దడచుకొంటున్నారు. అత్యవసర పనులకు మినహా జనం గడపదాటి బయటకు రాను ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారు. ఎండతోపాటు గాలి ఆడకపోవడంతో జనానికి ఏ పనీ చేయను పాలుపోవడం లేదు. రాత్రివేళల్లోనూ చల్ల గాలి లేకపోవడంతో జనం నిదురలేని రాత్రుళ్లు గడుపుతున్నారు. ఎండలు తీవ్రమవడంతో నగరంలోని బావుల్లోని నీరు ఇంకిపోతున్నాయి. కొళాయిల్లో కొన్ని ప్రాంతాల్లో మూడురోజులకొకసారి నీళ్లు వస్తున్నాయి. చిన్న పిల్లలు, ముసలీముతక ఈ ఎండలకు సతమతమై పోతున్నారు. ఎన్నికలను పురస్కరించుకొని 200 రూపాయల కూలీకి ఆశపడి తిరిగిన జనం వడదెబ్బ తగిలి ఇళ్లలో కూర్చొని వున్నారు. ఎన్నికల సందర్భంగా జరిగిన ప్రచారాల్లో తెలుగు దేశం పార్టీ అభ్యర్థులు బీద మస్తాన్ రావు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

తొరవ 14వ పేజీలో



బుచ్చి పంచాయితీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటెయ్యను బారులు తీరిన మహిళలు.

# మహిళల మొగ్గు ఎటు?

పలు ఉద్యమాలకు వురుడు పోసిన ఘనత జిల్లా మహిళలది. సారా వ్యతిరేక వుద్యమంలో సింహపురి మహిళల ఖ్యాతి ప్రపంచ వ్యాప్తమయ్యింది. పొదుపు ఉద్యమంలో జాతీయ ఖ్యాతి వారి సొంతమయ్యింది. 13వ అసెంబ్లీలో కొలువుదీరే ప్రజాప్రతినిధుల ఎంపిక కోసం మహిళలు అదరగొట్టే ఎండను లెక్కచేయక కిలోమీటర్ల పొడవు సాగిన 'క్యూ'లలోనూ ఓపిగ్గా నిలబడి ఓటు వేశారు. నెల్లూరు సిటీ, రూరల్ నియోజకవర్గాల పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ప్రతి ఎన్నికలలోనూ మహిళలు తక్కువ సంఖ్యలో కనపడతారు. ఈసారి పోలింగ్ మొదలు కాక మునుపే పోలింగ్ కేంద్రాల వద్ద మహిళలు ఓటెయ్యను బారులు తీరారు. పలు మహిళా వుద్యమాలకు కేంద్ర బిందువైన కోవూరులోనూ ఇదే పరిస్థితి కనిపించింది. పోతిరెడ్డిపాళెంలోని చంద్రశేఖరపురం గిరిజనకాలనీ, ఉన్నతవర్గాల మహిళలు పెద్ద సంఖ్యలో వుండే బుచ్చిరెడ్డిపాళెం గ్రామ పంచాయతీ ఆఫీసులో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రంలో

**ప్రతిచోట ఓటు వేయను బారులు తీరారు**

మహిళలు నిలబడిన వరుస కొండవీటి చాంతాడును గుర్తుకు తెచ్చింది. సంగం హైస్కూల్, ఆత్మకూరు జూనియర్ కాలేజి, వింజమూరు, అనుమసముద్రం పేట, చిరమన, హసనాపురం, అల్లూరు, బోగోలు, ఇస్కపల్లి, గూడూరు, నాయుడు పేట, సూళ్లూరుపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద మహిళలు బారులు తీరడం పలుసందేహాలను రేకెత్తిస్తున్నది. వీరు అధికారపార్టీ చేపట్టిన కార్యక్రమాల పట్ల ఆకర్షితులయ్యారా? తెలుగుదేశం ప్రకటించిన నగదు బదలీ పథకంతో తమ జీవితాలు మారుతాయని బారులు తీరారా? చిరంజీవిపై ప్రత్యేక అభిమానంతో వచ్చారా అనే ప్రశ్నలకు మే 16తేదీనే సమాధానం దొరికేట్లుంది. జిల్లాలో 21లక్షల మంది ఓటర్లుంటే వీరిలో 11లక్షల మంది మహిళలున్నారు. అన్ని నియోజకవర్గాల్లోనూ మహిళా ఓటర్లే జాస్తి కాబట్టి వీరు ఏదో ఒక పార్టీకి ఓటు చేసి వుంటే ఆ పార్టీనే తప్పకుండా అధికారంలోకి వస్తుందని ఢంకా బజాయించి చెప్పొచ్చు. ఆడవాళ్లా మజాకానా?



# డబ్బులిచ్చాకే పోలింగ్‌కు...

ఈసారి జరిగిన ఎన్నికల్లో సరికొత్త పరిణామం ఆవిష్కృతమయ్యింది. అదే ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు డబ్బులిచ్చే వరకు ఓటర్లు ఓటుకు వెళ్లకపోవడం. ఈసారి ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు పెద్ద మొత్తంలో

**జిల్లాలో సరికొత్త పరిణామం**

ఓటుకు డబ్బులిస్తారని విపరీతంగా ప్రచారం జరిగింది. పోలీసులు తీను కొన్న కఠిన చర్యల మూలంగా ఓటుకు డబ్బును అభ్యర్థులు విశృంఖలంగా పంచలేకపోయారు. తాము నమ్మిన ద్వితీయ, తృతీయశ్రేణి నాయకులకు, కొన్నిచోట్ల తమ బంధువుల చేతికి అందించారు. వీరు ఇచ్చిన మొత్తాలను కొద్దిమేర పంచడం, మరికొంత గుట్టు చప్పుడు కాకుండా దాచిపెట్టుకోవడం జరిగింది. దీంతో ఓటర్లు పోలింగ్‌కు వెళ్లను ఆసక్తి చూపలేదు. ఈ విషయమై పోటిడి అందిన అభ్యర్థులు అప్పటి కప్పుడు అడ్వాన్స్ పేమెంట్ యిచ్చి ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చేటట్లు చేయను నానాపాట్లు పడాల్సి వచ్చింది.

ప్రభుత్వ పథకాలైన ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, ఆరోగ్యశ్రీ, పావలావడ్డీకే రుణాలు ఇవన్నీ నోటు, క్వార్టర్ బాటిల్, ఓ చీర ముందు తలవంచాయి. జిల్లాలో సరికొత్త పరిణామానికి నాందిపలికాయి.

# కాంగ్రెస్ వెన్నంటి నిలిచిన ముస్లింలు!



ఓటెయ్యను బారులు తీరిన ముస్లిం మహిళలు.

ఈ దఫా జరిగిన పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లోనూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోని ముస్లింలు కాంగ్రెస్ పార్టీ వెన్నంటి నిలవడం విశేషంగా చెప్పుకోవచ్చు. ప్రజారాజ్యం పార్టీ ఎన్నికల బరిలో నిలవడంతో కాంగ్రెస్ ఓటు బ్యాంక్ జిల్లాలో వుండే బలిజ కులస్తుల ఓట్లు ఆ పార్టీ వైపుకు వెళ్లిపోయాయి. రెడ్డి కులస్తులు కాంగ్రెస్ పార్టీ వైపు నిలువగా, కమ్మ కులస్తులు తెలుగుదేశం పార్టీ వెన్నంటి నడిచారు. గిరిజనులు, మత్స్యకారుల ఓట్లు కూడా ప్రజారాజ్యం, తెలుగుదేశం పార్టీలు చీల్చుకొన్నాయి. మాలలు, క్రిస్టియన్లు కాంగ్రెస్ పార్టీవైపే వుండగా మాదిగ కులస్తులు తెలుగు దేశం పార్టీ వైపు నిలిచారు. వెంకటగిరి నియోజకవర్గంలో బిసిలు ముఖ్యంగా యాదవులు పూర్తిగా ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థి వైపే మొగ్గారని పోలింగ్ అనంతరం జరిపిన పరిశీలనలో వెల్లడయ్యింది. జిల్లాలో ఆర్యవైశ్యుల ఓట్లు

**ఆత్మకూరులోనూ అదే వరుస**

కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు పంచుకొన్నాయి. అన్ని కులాల్లో వర్గపరంగా ఓట్లు విడిపోగా ఎందువల్లో ముస్లిం ఓటు బ్యాంక్ మాత్రం కాంగ్రెస్ పార్టీని వీడలేదు. విపరీతంగా కులగజ్జి వని చేసిన ఈ ఎన్నికల్లో ఆత్మకూరు నుంచి ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థిగా పోటీచేసిన షేక్ ఖాజావలికి కూడా ఇక్కడి ముస్లిం సోదరులు ఓటు చేయ లేదు. కారణమేమిటని ఇక్కడి ముస్లిం యువకులు, మహిళలను 'జమీన్‌రైతు' ప్రతినిధి అడగ్గా స్థానిక ముస్లిం కాదని, దూదేకుల కులస్తుడని, అతనిపై నమ్మకం లేదని మరికొందరు చెప్పారు. అతి పెద్ద ముస్లిం ఓటు బ్యాంక్ వున్న నెల్లూరు సిటీ నియోజకవర్గంలోనూ ముస్లింలు కాంగ్రెస్‌కే ఓటు చేశారు. ఉదయగిరిలోనూ ఇదే జరిగింది. కావలి, కోవూరు, గూడూరు, సర్వేపల్లి ముస్లింలు కాం

తొరవ 14వ పేజీలో

# వారఫలాలు

తేది 2-5-2009 నుంచి 8-5-2009 వరకు మేషంలో రవి; మీనంలో కుజ, శుక్రులు; వృషభంలో బుధుడు; మకరంలో గురు, రాహువులు; సింహంలో శని; కర్కాటకంలో కేతువు; మకర, కుంభ, మీనాల్లో చంద్రుడు సంచరిస్తారు.



**మేషం** (అశ్వని, భరణి, కృత్తిక 1 పాదం)

గ్యాస్ట్రిక్ ఇబ్బందులు మాత్రం వుండవచ్చు. దైవపుణ్యకార్యాల్లో పాల్గొంటారు. భార్యాభర్తల సంబంధం చక్కగా వుంటుంది. సంతానం అనారోగ్యం ఆందోళనకరం. ధనాదాయ విషయంలో చక్కగా వుంటుంది. స్పెక్యులేషన్ లాభిస్తుంది. భాగస్వామ్యం చక్కగా కలసి వస్తుంది. వృత్తిపరులకు కళాకారులకు మేల్మైనకాలం. ఉద్యోగులకు విరోధులు అణిగి వుంటారు. విద్యార్థులకు చదువు సాగకపోవచ్చు. రాజకీయులకు బాగాలేదు.



**వృషభం** (కృత్తిక 2,3,4 పా., రోహిణి, మృగశిర 1,2 పా.)

కుటుంబంలో సుఖశాంతులుంటాయి. పరస్పర అవగాహన, సహకారం బాగా వుంటుంది. చాలా రోజులుగా ఎదురు చూసిన డబ్బు చేతికందుతుంది. సోదరులు చేయి అందిస్తారు. వ్యాపారులకు మిశ్రమ ఫలితాలుంటాయి. రావలసిన బాకీలు అందుతాయి. వృత్తిపరులకు పోటీలు, శ్రమ అధికం. ఉద్యోగులకు ఎదురుచూసిన వేతన సవరణలందుతాయి. రాజకీయులు మెలకువగా నడుచుకోవాలి. విద్యార్థులకు చదువుసాగదు.



**మిథునం** (మృగశిర 3,4 పా., ఆర్ద్ర, పునర్వసు 1,2,3 పా.)

చిన్నచిన్న ఆరోగ్య సమస్యలే. బి.పి వారు జాగ్రత్తగా మెలగాలి. కళత్ర సంబంధాలు చక్కగా వుంటాయి. భార్యాభర్తల మధ్య పరస్పర అవగాహన వుంటుంది. నూతన మిత్రులు పరిచయం. ధనాదాయ విషయాలు చక్కగా వుంటాయి. సమాజంలో హోదా పెరిగే అవకాశాలు. వ్యాపారులకు చాలా మంచికాలం. కొత్త పెట్టుబడులకు మంచికాలం. వ్యాపార విస్తరణ చేస్తారు. వృత్తిపరులకు ఉత్తమమైన కాలం. ఆదాయం బాగుంటుంది.



**కర్కాటకం** (పునర్వసు 4 పాదం, పుష్యమి, ఆశ్లేషలు)

ఆరోగ్య విషయాలు సాధారణంగా వుంటాయి. గుండె జబ్బుల వారు జాగ్రత్తగా వుండాలి. ధనాదాయం బాగా వుంటుంది. అప్పులు తీరుస్తారు. పొదుపు కలసి వస్తుంది. వ్యాపారంలో భాగస్వాముల వలన లాభార్జన చక్కగా వుంటుంది. వృత్తిపరులు చక్కగా లాభాలనార్జిస్తారు. రాజకీయులకు మంచి కాలం. ఉద్యోగులకు పైవారి తోడ్పాటు లభిస్తుంది. వృత్తిపరులకు సంపాదన బాగా వుంటుంది.



**సింహం** (మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం)

గొంతు నస, ఊపిరితిత్తులు, గర్భసంచికి సంబంధించిన అనారోగ్య బాధలుండవచ్చు. కళత్ర సంబంధాలు చక్కగా వుంటాయి. సంతానం అనారోగ్య బాధలు ఇబ్బందికరంగా వుంటాయి. నూతన ధనాదాయ అవకాశాలు సూచితం. ఖర్చులధికం, స్పెక్యులేషన్ జోలికి వెళ్లవద్దు. భాగస్వామ్యాలు చక్కగా లాభిస్తాయి. వృత్తిపరులకు మంచి లాభావకాశాలు. రాజకీయులకు ప్రోత్సాహకరమైన కాలం. గృహిణులకు పనిభారం.



**కన్య** (ఉత్తర 2,3,4 పా., హస్త, చిత్త 1,2 పా.)

దైవకార్యాల్లో పాల్గొంటారు. సంతాన విషయాల్లో తాపత్రయం. కుటుంబసభ్యుల మధ్య సత్సంబంధాలుంటాయి. ధనాదాయం చాలా తృప్తికరంగా వుంటుంది. ఎదురుచూసిన మార్గాల గుండా ధనప్రాప్తి, సోదరులు సాయమందిస్తారు. స్పెక్యులేషన్ లాభించవచ్చు. వ్యాపారులకంత మంచికాలం కాదు. వృత్తిపరులకు అడ్డంకులు ఎక్కువ. రాజకీయులకు ప్రోత్సాహకరమైన కాలం. ఉద్యోగులకు విరోధులు అణిగి వుంటారు.



**తుల** (చిత్త 3,4పా.,స్వాతి, విశాఖ1,2,3 పా.)

ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. ఋతు సంబంధిత బాధలుంటాయి. చెవి, గొంతు, ఊపిరితిత్తులు, కిడ్నీలకు సంబంధించిన బాధలుంటాయి. కుటుంబంలో ఆందోళనకరం, ఆర్థిక విషయాల్లో కొంత మేలు. అప్పులు పుడతాయి. స్నేహితులు, సోదరులు చేయి అందిస్తారు. వ్యాపారులు భాగస్వాములు, పనివాళ్ళ వల్ల మోసపోయే అవకాశాలున్నాయి.



**వృశ్చికం** (విశాఖ 4పాదం, అనూరాధ, జ్యేష్ఠ)

దీర్ఘకాలిక రోగులకు ఊరట. కుటుంబంలో సుఖసంతోషాలు అనుభూతిలోకి వస్తాయి. సంతానమూలకంగా సంతోషం. వయోవృద్ధులకు హాని. ఖర్చులు అదుపులో వుంటాయి. వివిధ మార్గాల్లో ధనప్రాప్తి. స్పెక్యులేషన్ పనికిరాదు. వ్యాపారులకు భాగస్వాముల మూలంగా ఉపయోగాలుంటాయి. కొనుగోలుదారుల నాడిని పసిగడతారు. వృత్తిపరులు, రాజకీయులు తమ మూర్ఖత్వం వల్ల నష్టపోవచ్చు.



**ధనుస్సు** (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1పాదం)

మిత్రుల మూలంగా ఇబ్బందులు ఏర్పడవచ్చు. ఆంత్రము, కంటిజబ్బులు బాధిస్తాయి. సంతానం అనారోగ్యం ఇబ్బంది పెడుతుంది. కుటుంబసభ్యుల నడుమ అవగాహన కొరవడవచ్చు. భూసంబంధిత పనుల్లో కష్టనష్టాలు. దైవచింతన అవసరం. ఆర్థిక విషయాల్లో మిశ్రమ ఫలితాలు. స్థిరాస్తులు అమ్మే అవకాశాలు. కొత్త వస్తువులు కొంటారు. వృత్తిపరులు, కళాకారులు, రాజకీయులు చుట్టుప్రక్కల వారితో జాగ్రత్తగా వుండాలి.




**మకరం** (ఉత్తరాషాఢ 2,3,4 పా., శ్రవణం, ధనిష్ఠ 1,2 పా.)

పైత్యప్రకోపం, కాకవల్ల అనారోగ్య బాధలుంటాయి. గ్యాస్ట్రిక్ బాధలు కూడా తోడవుతాయి. బంధువుల రాక అధిక ఖర్చును సూచిస్తుంది. ధనప్రాప్తికి నూతన ప్రణాళికలు వేస్తారు. వాహనంకొనే సూచనలు. చిరకాల బంధుమిత్రులను కలుసుకొంటారు. భాగస్వామ్య విషయాల్లో గొడవలుంటాయి. కష్టపడి పనిచేస్తే వ్యాపారులకు మంచి లాభాలు. వృత్తిపరులకు మంచికాలం. అయినా అధిక శ్రమ.



**కుంభం** (ధనిష్ఠ 3,4 పా., శతభిష, పూర్వాభాద్ర 1,2,3 పా.)

అనారోగ్య పరిస్థితులు అధికం. వాతప్రకోపం, బి.పి వంటివి బాధిస్తాయి. దీర్ఘకాలిక రోగులకు శస్త్రచికిత్స అవకాశాలు. కళత్ర సంబంధాలు కొద్దిగా దెబ్బతింటాయి. బంధుమిత్రులతో కొంతమేలు. ధనాదాయం తృప్తికరం. ఎదురుచూసిన మార్గాల నుండి అప్పులు ముడుతాయి. వ్యాపారులు భాగస్వాముల నుండి మోసపోయే అవకాశాలు. పోటీలు అధికం. రాజకీయులకు మిశ్రమ ఫలితాలు. ఉద్యోగులకు రావలసినవి అందుతాయి.



**మీనం** (పూర్వాభాద్ర 4 పాదం, ఉత్తరాభాద్ర, రేవతి)

ఆరోగ్య విషయంలో చాలా జాగ్రత్తగా వుండాలి. కంటికి, లివర్‌కు సంబంధించిన అనారోగ్య బాధలుండవచ్చు. నిద్రలేమి వుండవచ్చు. కుటుంబసభ్యులతో గొడవలుంటాయి. కళత్ర సంబంధాలు దెబ్బతినవచ్చు. అవగాహనాలోపం ఇబ్బందికరంగా వుంటుంది. డబ్బు విషయంలో ఆటంకాలు. వ్యాపారులకు ఆదాయం తగ్గుతుంది. వ్యాపారం తగ్గుముఖం పడుతుంది. భాగస్వాములతో జాగ్రత్త. వృత్తిపరులకు గట్టిపోటీ.

## పంచాంగం

3వ తేదీ మిధునలగ్నంలో ఉ.10.00.గం.ల నుండి 11.00.గం.ల. వరకు
6వ తేదీ ధనుర్లగ్నంలో రా. 10.00గం.ల నుండి 11.30గం.ల. వరకు
7వ తేది వృశ్చికలగ్నంలో రా.7.00గం.ల నుండి 8.00.గం.ల వరకు; ధనుర్లగ్నంలో రా.10.00గం.ల నుండి 11.30గం.ల.కు
8వ తేది మిధునలగ్నంలో ఉ.9.00గం.ల నుండి 10.30గం.ల.కు; వృశ్చికలగ్నంలో రా.7.00గం.ల నుండి 8.00 గం.ల.కు; ధనుర్లగ్నంలో రా.10.00 గం.ల నుండి 11.30గం.లవరకు

శుభముహూర్తాలున్నాయి.

### ఏప్రెల్ తిధులు చైత్ర బహుళ

| | | | |
|---|---|---|---|
| 2 | శని | అష్టమి | మ.1.12 గం.ల.వ |
| 3 | ఆది | నవమి | ఉ.11.39గం.ల.వ |
| 4 | సోమ | దశమి | ఉ.10.24గం.ల.వ |
| 5 | మంగళ | ఏకాదశి | ఉ.9.28 గం.ల.వ |
| 6 | బుధ | ద్వాదశి | ఉ.8.52 గం.ల.వ |
| 7 | గురు | త్రయోదశి | ఉ.8.38 గం.ల.వ |
| 8 | శుక్ర | చతుర్దశి | ఉ.8.48 గం.ల.వ |

**పి.ఎం.గోపాలాచారి,**
16/1020, పొగతోట, నెల్లూరు - 1.
E-mail:maripmgg@yahoo.com

# వాయవ్యానికి ప్రత్యామ్నాయం నైరుతి!

ఎ.నటరాజన్ తవణంపల్లె

*★ మాది పశ్చిమ గృహం, అక్కడ వాయవ్యం దారి గనుక కుదరదు అప్పుడు దాని స్థానమెక్కడ?*

పశుశాలకు స్థావరం వాయవ్యం. ఈశాన్యం మృత్యువు, ఆగ్నేయం అనారోగ్యం, ప్రత్యామ్నాయం నైరుతి మాత్రమే. అయితే ఇక్కడ 'శాల'లుగాక షెడ్డు, లేదా గది నిర్మాణం చేయాలి.

పి.ఉషారాణి నాయుడుపేట

*★ నైరుతి రాక్షస స్థానం కదా? అక్కడ యజమానికి హాని జరగదా?*

యమ, నిరుతి స్థానాలు పరదేవతా స్థానాలు. నిర్లక్ష్యం చేస్తేనే 'నిరుతి' తప్పుతాయి. నైరుతి స్థానంలో యజమానులు, పశు, పక్షులు ఆరోగ్యంగా వుంటాయి. అయితే పశు, పక్షులకు వాయువ్యం లేనిపక్షంలోనే నైరుతి ప్రత్యామ్నాయమనే సంగతిని మరువరాదు.

డి.వి.వెంకటరమణయ్య కోట

*★ వాయువ్యానికి అవతలి స్థలమూ మాదే పశుశాల నీళ్లన్నీ అవతలి గుంతలో నిలుస్తాయి.*

ఈ పద్ధతి మంచిది కాదు. నీటిని నైరుతి కాలువల్లోకి మళ్లించాలి. మీరు 'శక్తియంత్ర ప్రతిష్ఠ చేయడం వల్ల అడపాదడపా వచ్చే పశురోగాలు నిమ్మళిస్తాయి.

పి.అంజలీదేవి బెంగుళూరు

*★ వాస్తూ గీస్తూ లేదని ఇల్లు కట్టేశారు. ఇప్పుడు బాబు పరిస్థితి అయోమయంగా వుంది.*

జరిగిపోయిందేదో జరిగిపోయింది. తూర్పు ఆగ్నేయం సెప్టిక్ ట్యాంకు వెంటనే తీసివేసి 'లక్ష్మీకృత వాస్తు యంత్రం' ప్రతిష్ఠ, అబ్బాయికి కుడి చిటికెన వ్రేలికి 'నీలం' (ఉచ్ఛ) వెంటనే ధరింపజేయండి. బాబును వైద్యుడి పర్యవేక్షణలో వుంచండి.

**వాస్తు సందేహాలు-సమాధానాలు**
ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
ఫోన్ : 2322345
సెల్: 94901 25878
4వ వీధి, గాయత్రినగర్
ఎ.కె.నగర్ పోస్టు, నెల్లూరు - 4.

ఎస్.లక్ష్మీకాంతమ్మ న్యూఢిల్లీ

*★ దక్షిణం ఇల్లు, ఆగ్నేయం మెట్లున్నాయి. అమ్మాయి పరిస్థితికి, ఈ మెట్లకు ఏదైనా సంబంధం వుందా?*

దక్షిణ ఆగ్నేయం మెట్లు, సెప్టిక్ ట్యాంకు వెంటనే తీసివేయండి. నాలుగు మూలల్లో సెప్టిక్ ట్యాంకు నిషిద్ధం. ఇంట్లో వాస్తుయంత్రం ప్రతిష్ఠ. అమ్మాయి కుడి ఉంగరం వ్రేలికి వైడూర్యం(ద్వితీయార్థ) ధరింపజేయండి.

ఎ.పెంచలయ్య టి.పి.గూడూరు

*★ పది ఎకరాల్లో 'చేపలు' వేశాను. ఎనిమిదేళ్లలో తూతూమంత్రంగా లాభాలు వచ్చాయి.*

పై చేపల చెరువుకు, తూర్పు చేపల చెరువుకు ఎత్తులో అంతరం వుండాలి. మత్స్యయంత్ర ప్రతిష్ఠ చేసి చూడండి.

నిరిహెటి రామమ్మ సూళ్లూరుపేట

*★ ఇంటికెదురుగా 'తులసికోట' వుండవచ్చా?*

అనివార్యపరిస్థితులలో తప్ప 'తులసి' ఇంటి ముందుగాక వెనుక పెరట్లో ప్రదక్షణ మార్గం వుండేలా ఏర్పాటు చేసుకోవాలి.

దివ్వెన ఉమాపతి గుంటూరు

*★ తూర్పు తలుపు పెట్టాము. ఉత్తరం, దక్షిణం తలుపులున్నాయి.*

తూర్పు తలుపు 'నీచం'లో వచ్చింది. ఈశాన్యం కార్నర్‌కు 7-5 అడుగులలోపు తలుపునుంచండి. మీకు రాజకీయ భవిష్యత్తులేదు. వ్యాపారం మీద దృష్టి సారించండి.

డా॥అవినాష్ హైదరాబాద్

*★ వాస్తు జ్యోతిష్యాలు సరిచేసుకుంటే ఆకస్మిక అనారోగ్యాలు నిమ్మళిస్తాయా?*

శాస్త్రరీత్యా వచ్చే ఆటంకాలు ఇందువల్ల తగ్గుముఖం పడతాయి. అమావాస్య, పౌర్ణమి రోజుల్లో సముద్రాలెందుకు అల్లకల్లోలమౌతాయో ఎవరైనా శాస్త్రజ్ఞుల్ని అడిగి చూడండి.

పి.వనజ చెన్నై

*★ యంత్ర ప్రతిష్ఠ చేశాము. ముత్యం ధరింపజేశాము. ఆయన మాకు దక్కుతాడా?*

తప్పక ఆరోగ్యవంతులవుతారు. నమ్మకం, దృఢసంకల్పం కాన్సర్ వ్యాధినైనా నయం చేస్తుందని ప్రముఖ కాన్సర్‌వ్యాధి నిపుణులు డా॥మిత్రా సదంత్ శర్మ "అదర్‌నాథ్ మెడిసిన్ అండ్ ఇట్స్ రిసోర్సస్" అనే గ్రంథంలో చెప్పారు. కొన్ని నిరూపణలు చేశారు కూడా!

### కవిత

## "స్ఫూర్తిబాట"

తరులు తరగని ప్రాణవాయు గనులు
తరులను నరికిన తల్లడిల్లెదరు జనులు
సుకవి మాట స్ఫూర్తిబాట

పచ్చదనము తరిగిన
వెచ్చదనము పెరుగును
జగమంతయు
జల ప్రళయమున మునుగును
సుకవి మాట స్ఫూర్తిబాట

పచ్చదనము పర్యావరణానికి రక్షణ కవచము
పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు
సుకవి మాట స్ఫూర్తిబాట

మూఢ నమ్మకము నమ్మిన కీడు కలుగును
మాడు పగులును చూడు శాస్త్రవిజ్ఞానములు
సుకవి మాట స్ఫూర్తిబాట

అదృష్ట రాళ్లను కాదు ఆత్మవిశ్వాసాన్ని నమ్ముకో
గ్రహబలాన్ని కాదు గుండె బలాన్ని నమ్ముకో
సుకవి మాట స్ఫూర్తిబాట...


- మోపూరు పెంచలనరసింహం, నెల్లూరు.

# 28వ డివిజన్‌లో కానరాని అభివృద్ధి!

నగరంలోని 28వ డివిజన్ ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. మునిసిపల్ కార్పొరేషన్ పాలకవర్గంతోపాటు అధికార యంత్రాంగం కూడా ఈ డివిజన్ సమస్యల గురించి పట్టించుకోలేదు. నగరంలోని అన్ని మునిసిపల్ డివిజన్‌లలో కొంతమేర అభివృద్ధి పనులు చేపట్టడం జరిగింది. ఎందువల్లనో ఈ డివిజన్‌లో ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. మునిసిపల్ కార్పొరేషన్ పాలకవర్గంలో తలెత్తిన వివాదాల కారణంగా డివిజన్‌ల అభివృద్ధికి నిధులు



ఇళ్ల మధ్య నిలచిన మురుగునీరు.



రోడ్ల ప్రక్కనే పందుల స్వైరవిహారం.

కేటాయింపు జరగలేదు. అయినా అధికారపక్షానికి చెందిన కార్పొరేటర్లు కొందరు నిధులు తమ డివిజన్‌లకు కేటాయించుకోవడంలో ముందున్నారు. ఈ డివిజన్ కార్పొరేటర్ నిధులు మంజూరు చేసుకోవడంలో విఫలం చెందారని చెప్పవచ్చు.

కాంగ్రెస్ పార్టీకి చెందిన రావుల వెంకటజ్యోతి 28వ డివిజన్ కార్పొరేటర్‌గా 2005 సంవత్సరంలో జరిగిన మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో గెలుపొందారు. ఈ డివిజన్ పరిధిలో గాంధీనగర్ రోడ్డు ఉత్తరం వైపున వున్న చైతన్యపురి, జె.కె.కాలనీ, ఎ.కె.నగర్, నిప్పో, హౌసింగ్‌బోర్డు కాలనీ, పోస్టల్ కాలనీ తదితర ప్రాంతాలున్నాయి. ఈ ప్రాంతాలలో సిమెంటు రోడ్ల నిర్మాణం, డ్రైనేజి కాల్వల సమస్య, త్రాగునీటి ఎద్దడి తీవ్రంగా వుంది. గడచిన నాలుగు సంవత్సరాల కాలంలో కేవలం 30 లక్షల రూపాయలు మాత్రమే డివిజన్‌లో ఖర్చు చేయడం జరిగింది. ఎమ్మెల్యే, ఎమ్పీ గ్రాంటు నుండి మంజూరు చేయించుకొన్న నిధులతో కొన్ని పనులు చేశారే తప్ప మునిసిపల్ కార్పొరేషన్ నిధులు ఒక్క పైసా కూడా ఇవ్వలేదని కార్పొరేటర్ చెప్పారు.

అధికారపక్షానికి చెందిన కార్పొరేటర్‌గా వున్నప్పటికీ డివిజన్ అభివృద్ధి కోసం పనులు ప్రతిపాదించి, నిధులు మంజూరు చేయించుకోవడంలో విఫలం చెందారంటే ఈ కార్పొరేటర్‌కు డివిజన్ సమస్యలపై ఎంత చిత్తశుద్ధి వుందో అర్థం చేసుకోవచ్చు. పోస్టల్ కాలనీ ప్రాంతంలో వేసవికాలం కావడంతో త్రాగునీటి ఎద్దడి తీవ్రంగా వుంది. చైతన్యపురి కాలనీ ప్రాంతంలో డ్రైనేజి కాల్వల నిర్మాణం, సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టాల్సి వుంది. అలాగే ఈ డివిజన్‌లో కొంతమంది వృద్ధులు పెన్షన్ మంజూరుకాక ఇబ్బందులు పడక తప్పడం లేదు. డ్రైనేజి కాల్వలు నిర్మించకపోవడం వల్ల మురికినీరు వీధులలోకి చేరి నిల్వ వుంటుంది. ఈ మురికి నీటిలో పందులు, దోమలు చేరడంతో అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం వుందని స్థానికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో డివిజన్ సమస్యలపై స్థానికులు వెల్లడించిన అభిప్రాయాలను దిగువనిస్తున్నాం.

## రోడ్లు నిర్మించాలి!

డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో సిమెంటు రోడ్ల నిర్మాణం జరగలేదు. సిమెంటు రోడ్లతోపాటు డ్రైనేజి కాల్వలు కూడా నిర్మించేందుకు మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు,



స్థానిక కార్పొరేటర్ చర్యలు తీసుకోవాలి. అలాగే చైతన్యపురి ప్రాంతంలో చాలామంది బడుగు బలహీనవర్గాలకు చెందిన వృద్ధులున్నారు. వీరికి వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలి.

సిద్దయ్య

## మురికి కాల్వలను నిర్మించాలి!

మా డివిజన్‌లో మురికి కాల్వలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నాం. కాల్వలు లేకపోవడంతో మురికి నీరంతా వీధులలో చేరి పోతుంది. అనేకమార్లు అధికారుల దృష్టికి తీసు



కెళ్లినా ఎవరూ పట్టించుకోలేదు. అలాగే అర్హులైన వృద్ధులు వున్నప్పటికీ పెన్షన్ పథకానికి ఎంపిక చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు.

రమణమ్మ

# అంగన్‌వాడీ వర్కర్ల నుంచి మామూళ్ల వసూలు!

జిల్లాలోని స్త్రీ అభివృద్ధిసంస్థ పరిధిలో పనిచేస్తున్న అంగన్‌వాడి వర్కర్ల నుంచి భారీ మొత్తంలో డబ్బు వసూలు చేస్తున్నారు. అంగన్‌వాడి వర్కర్లకు కనీస వేతనాలు పెంచాలని అనేకసార్లు ఆందోళన చేసిన ఫలితంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గౌరవ వేతనం పెంచేందుకు అంగీకరించాయి. కేంద్రప్రభుత్వ అయిదు వందలు, రాష్ట్ర ప్రభుత్వం మూడువందలు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. ఏప్రెల్ 2008 నుంచి పెంచిన గౌరవ వేతనాలు ఇటీవల విడుదల చేశారు. కేంద్రప్రభుత్వం 6 నెలలు, రాష్ట్రప్రభుత్వం 5 నెలలకు సంబంధించి పెంచిన గౌరవ వేతనం నిధులు మంజూరు చేశాయి.

అంగన్‌వాడి వర్కర్లు, హెల్పర్లకు పెంచిన గౌరవవేతనాలను వారి ఖాతాలలో జమచేసిన ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారులు 10 శాతం కమీషను ఇవ్వాలన్న నిబంధన విధించారు. బ్యాంకు నుంచి గౌరవ వేతనాన్ని డ్రా చేసిన వారు వెంటనే ప్రాజెక్టు కార్యాలయానికి వెళ్లి కమీషన్లు అందజేయాలని ఆదేశించారు. దీంతో కొంతమంది అంగన్‌వాడి వర్కర్లు, హెల్పర్లు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓలకు దీన్ని అందజేయడం కూడా జరిగిపోయింది. ఒక్కో ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో దాదాపు రెండువందలకు పైగా అంగన్‌వాడి కేంద్రాలు పని చేస్తున్నాయి. అంగన్‌వాడి వర్కర్ల నుంచి 450 రూపాయలు, హెల్పర్ల నుంచి 200 రూపాయలు వసూలు చేస్తున్నారు. ఒక్కో ప్రాజెక్టు పరిధిలో దాదాపు లక్షా 30 వేల రూపాయలు వసూలయ్యే అవకాశం వుంది.



అవినీతికి నిలయమైన నెల్లూరులోని జిల్లా స్త్రీ మరియు శిశు అభివృద్ధి సంస్థ కార్యాలయం.

ఇటీవల జరిగిన ఐసిడిఎస్ ప్రాజెక్టు సెక్టార్ సమావేశాలలో సంబంధిత సూపర్‌వైజర్‌లు అంగన్‌వాడి వర్కర్ల నుంచి బలవంతంగా కమీషన్‌లు వసూలు చేసుకొన్నారు. కమీషన్లు ఇచ్చిన విషయం బయట ఎవరికైన చెబితే ఇబ్బందులు తప్పవంటూ హెచ్చరికలు కూడా జారీ చేసినట్లు తెలిసింది.

ఇంతకుముందు ప్రతి ఆరు నెలలకొసారి అంగన్‌వాడి వర్కర్లకు టి.ఎ బిల్లులు మంజూరు చేసేవారు. మంజూరు చేసిన బిల్లులలో ట్రెజరీ సిబ్బందికి ఇవ్వాలంటూ 10శాతం కమీషన్లు వసూలు చేసుకొనేవారు. ఐసిడిఎస్ అధికారిణులు తాజాగా పెంచిన గౌరవ వేతనానికి సంబంధించి కమీషన్లు ఇవ్వాలని డిమాండ్ చేయడం సిగ్గుచేటు.

చాలీ చాలని గౌరవవేతనంతో కాలం వెళ్లదీస్తున్న అంగన్‌వాడి వర్కర్లకు మరింత సహకారం అందించాల్సిన అధికారులు కమీషన్లు కోసం పీడించడం ఎంత వరకు సమంజసమో వారే ఆలోచించాలి. మొత్తం జిల్లాలో 17 ఐసిడిఎస్ ప్రాజెక్టులలో 2 వేల మంది నుంచి కమీషన్ల రూపంలో 14 లక్షలకు పై వసూలు చేస్తున్నారు.

ఐసిడిఎస్ అధికారుల వైఖరి పై విధంగా వుండగా అంగన్‌వాడి వర్కర్లు, హెల్పర్ల సమస్యలపై ఆందోళన చేసే యూనియన్ వైఖరి మరోవిధంగా తయారయ్యింది. యూనియన్ చేపట్టిన ఆందోళన ఫలితంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గౌరవ వేతనాలను పెంచడం జరిగిందని, పెంచిన వేతనాలలో ఒక నెల వేతనం యూనియన్‌కు విరాళంగా ఇవ్వాలని షరతు పెట్టారు.

వేతనాలు పెంచిన ప్రతిసారి యూనియన్ కార్యక్రమాల నిర్వహణకు అంగన్‌వాడి వర్కర్ల నుంచి నగదు వసూలు చేయడం ఆనవాయితీగా వస్తుందని యూనియన్ నాయకురాళ్లు చెప్పడం ఆశ్చర్యకరంగా వుంది. పెంచిన గౌరవ వేతనాలు బ్యాంకుల్లో జమ చేయక ముందు నుంచే యూనియన్ నాయకురాళ్లు, ఐసిడిఎస్ అధికారిణులు అంగన్‌వాడివర్కర్లను జలగల్లా పట్టిపీడిస్తున్నారు. యూనియన్‌కు అంగన్‌వాడి వర్కర్లు 500, హెల్పర్లు 300 రూపాయలు వంతున విరాళంగా అందజేయాలని ఆదేశించి మండలాల సెక్టార్ వారీగా రశీదు పుస్తకాలు సైతం పంపిణీ చేయడం జరిగింది.

జిల్లాలోని మొత్తం 17 ఐసిడిఎస్ ప్రాజెక్టులలో 27లక్షల రూపాయలు యూనియన్‌కు సమకూరనున్నాయి. ఐసిడిఎస్ అధికారులకు కమీషను, యూనియన్‌కు విరాళాలు ఒకేసారి

కొరవ 14వ పేజీలో


## సత్తా చూపే పాత్రలేవీ?



కేరళలో ప్రత్యేక మసాజ్‌లతో నయనతార నాజుగ్గా తయారయ్యింది. ఎన్టీఆర్ సరసన ఆమె నటిస్తున్న తెలుగు చిత్రంలో తన కాంబినేషన్‌లోని సన్నివేశాల్లో నటించను హైదరాబాద్ వచ్చినప్పుడు పిచ్చాపాటీగా మాట్లాడింది. నాయికల్ని దృష్టిలో పెట్టుకొని కథలు తయారు చేసుకొనే సంస్కృతి ఇప్పుడెక్కడుంది. ఎక్కడో ఒకటీ అరా చేస్తున్నారు అలాంటి కథల్ని. మహిళా ప్రాధాన్యమంతా బుల్లితెర మీద ధారావాహికలుగా కనిపిస్తుంది. వెండితెర మీద సీరియస్ విషయాల్లో హీరోయిన్‌లను చూపించడానికి మనవాళ్లు వెనక్కి తగ్గుతున్నారు. నాకే కాదు. శ్రియ, త్రిష కూడా నటనకు ప్రాధాన్యమున్న పాత్రలు ఇప్పటిదాకా రాలేదు. హీరోయిన్ల సత్తాను తెరకెక్కించడానికి దర్శకులు సిద్ధంకావాలి. హీరోలు దాన్ని ఆహ్వానించాలంటుంది.

## దీపికా చిర్రు బుర్రు!

ఓ సినిమా ఫ్లాపైందో లేదో దీపికా పదుకొనే పని క్లోజ్ అని వాడవాడలా విస్తృత ప్రచారం జరిగిపోతోంది.... అని చిర్రుబుర్రులాడుతోంది దీపికాబేబీ. విషయమేమిటంటే దీపిక నటించి భారీస్థాయి విజయం ఆశించిన 'చాందినీ చౌక్ టు చైనా' చిత్రం అపజయం పాలయ్యింది. ఈ చిత్రంలో హీరో అక్షయకుమార్. ఈ చిత్రం అపజయానికి దీపికే కారణమంటున్నారు. ఈ విషయమై మాట్లాడుతూ



విజయంలో ప్రతివారి భాగస్వామ్యం ఎంత సమంజసంగా నిర్ణయిస్తారో, అలాగే అపజయాన్నీ అందరూ పంచుకోవాలి. ఎందుకంటే ఎంతో మంది రాత్రింబవళ్లు అంకిత భావంతో పని చేస్తేనేగానీ ఓ చిత్రం తయారవదు. అలా చేసినా ఒక్కో సందర్భంలో సినిమా ఫలితం తలకిందులవచ్చు. అంతమాత్రంతో ఫలనావాళ్ల పనైపోయిందని బెంబేలెత్తేలా మాట్లాడకూడదు. అపజయాల నుంచే అనేక పాఠాలు నేర్చుకోవచ్చంటుంది.

## ఇప్పుడు కాకుంటే మరెప్పుడు?



కొత్త బంగారులోకం చిత్రం ద్వారా తెలుగు చలనచిత్ర పరిశ్రమ దృష్టిని ఆకర్షించిన హీరోయిన్ శ్వేతా బసు ప్రసాద్ ఆ చిత్రంలోని తన వెరైటీ నటన ద్వారా ప్రేక్షకుల మనసులను సైతం గెలుచుకొంది. ఆ ఒక్క చిత్రంతోనే ఆమెకు ఎన్నో అవకాశాలు వస్తున్నాయి. తాజాగా బెల్లంకొండ సురేష్ నిర్మిస్తున్న 'రైడ్' చిత్రంలో తనీష్‌కు జోడీగా నటిస్తున్న ఈ ముద్దుగుమ్మ ఇక గ్లామర్‌పాత్రలపైనే తన దృష్టి సారించాలనుకుంటుంది. ఈ విషయమై మాట్లాడుతూ నాకు అన్ని రకాల పాత్రలు చేయాలని వుంది. కొత్త బంగారులోకం చిత్రం నాకు మంచి పేరును తెచ్చి పెట్టింది. ఆ తర్వాత నటిస్తున్న చిత్రం రైడ్. ఈ చిత్రం నాకు ఓ ప్రత్యేకమైన ఇమేజ్‌ను తెచ్చి పెడుతుంది. ఇందులో నాది చక్కని పాత్ర. గ్లామర్‌గా కనిపిస్తాను. గ్లామర్ పాత్రలు ఇప్పుడు చేయకపోతే ఎప్పుడు చేస్తాం? ఏ వయస్సులో చేయాల్సిన పాత్రలు ఆ వయసులో చేస్తేనే మంచిది కదా. అందరిలా నేను కాదు. ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడమే తన లక్ష్యమంటుంది.

## మళ్లీ కామ్నా!



ప్రేమికులు చిత్రంలో తెలుగు తెరకు పరిచయమైన కథానాయిక కామ్న జెఠ్మలానీ. ఆ తర్వాత సామాన్యుడు, టాస్ చిత్రాల్లో నటించింది. ఇటీవల కాలంలో నాయికగా తెలుగు తెరకు దూరమైంది. అడపాదడపా తమిళంలో నటిస్తోంది. తెలుగు సినిమాలు లేకపోయినా హైదరాబాద్ సినీజనాలకు తరచూ టచ్‌లోనే వుంటుంది. ఈమెకు అనుకోనిరీతిలో యువ కథానాయకుడు అల్లరి నరేష్ సరసన నటించే అవకాశం దక్కింది. సురేష్ ప్రొడక్షన్స్ పతాకంపై ఈ చిత్రం నిర్మితమవుతుంది. డాక్టర్ డి.రామనాయుడు నిర్మాత, ఇవివి సత్యనారాయణ దర్శకుడు. ఆద్యంతం వినోదాత్మకంగా సాగే చిత్రమిది.

## అలాగెలా నటించాలి?



ఆర్థికవేత్త అమర్త్యసేన్ కుమార్తె నందనాసేన్. ఈమె హిందీ పరిశ్రమలో హీరోయిన్‌గా నటిస్తుంది. అందాల ఆరబోతకు అడ్డు చెప్పదని నందనకు పేరుంది. విడుదల కాకముందే 'రంగ్ రసియా'లో ఆమె శృంగార రసపోషణ అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. దీంతో ఆమెకు ఓ ఇటలీ చిత్రంలో అవకాశమొచ్చింది. ఈ సినిమాకు బెంగాలీ రచయిత్రి మహా శ్వేతాదేవి చోలీకే పీఛే నవల ఆధారం. గిరిజన యువతుల జీవన నేపథ్యంలో కథ సాగే ఈ చిత్రాన్ని తొలుత బెంగాలీ భాషలో తీశారు. ఈ చిత్రం పెనుదుమారాన్ని లేపింది. దీన్నే ఇటాలో తీయబోతున్నారు. ఈ సినిమాలో స్పందన అనే గిరిజన యువతి పాత్ర పోషించమన్నారు. అయితే కథ విన్న ఆమె చేసేందుకు ఒప్పుకోలేదు. ఎందుకంటే సినిమా ఆసాంతం నాయిక టాప్‌లెస్‌గా కనిపించాలి... ఇది ఇబ్బందని నందన అంటోంది. కథ చాలాబాగుంది. మంచి ప్రయత్నమే. అయితే మరీ టాప్‌లెస్‌గా చేయడం ఇబ్బందేనంది.



## గిరి గీసుకోలేదన్న అసిన్

బాలీవుడ్‌లో దక్షిణాది హీరోయిన్లు రాణించడం కష్టం. హేమమాలిని, శ్రీదేవి మాత్రం కాస్త వున్నత స్థాయి చేరారు. హిందీ గజినీ చిత్రంలో నటించిన మళయాళ మారుతం అసిన్‌కు అక్కడ మంచి అవకాశాలు వస్తున్నాయి. ఇటీవల హైదరాబాద్ వచ్చిన ఆమెను బాలీవుడ్, దక్షిణాది ఈ రెండింటిలో మీరు గమనించిన తేడా ఏమిటంటే దక్షిణాదిలో అనుకున్న సమయానికి చిత్రీకరణ మొదలవుతుంది. అక్కడ కాదంది. తాను పెద్ద మొత్తంలో పారితోషికాన్ని డిమాండ్ చేయడం లేదని, తనకు డబ్బు ముఖ్యం కాదంది. ఆర్థికపరమైన ఒత్తిళ్ల ఏమి లేవు. నేను చేసే పనిలోనే ఆనందం వెతుక్కుంటాను. బాలీవుడ్‌లో నటించాలని గిరి గీసుకొని కూర్చోలేదు. మంచి పాత్ర అయితే ఏ భాషా చిత్రమైనా చేస్తానంది.

## లావెక్కనంటున్న త్రిష!



తొలిచిత్రం నుంచి నేటివరకూ వన్నెతగ్గని సౌందర్యంతో శరీరాన్ని కాపాడుకొంటున్న హీరోయిన్‌గా త్రిషను చెప్పుకోవచ్చు. ప్రస్తుతం తెలుగు, తమిళం లోనూ బిజీగా వున్న ఆమెను షూటింగ్ గ్యాప్‌లో మీలా నాజుగ్గా, ఉత్సాహంగా వుండాలంటే ఏం చేయాలని అడిగాను. దీనికి సమాధానంగా నా ఒంటి తీరే అంత. నేను పెద్దగా బరువెక్కను. పోతే నీళ్ల ఎక్కువగా తాగుతాను. నా చేతిలో హ్యాండ్‌బ్యాగ్ నైనా మర్చిపోతాను గానీ... వాటర్ బాటిల్ లేకుండా కనిపించను. మధ్యాహ్నం పూట అన్నం తినను. శాండ్‌విచ్, ఫ్రూట్ సలాడ్ మాత్రమే. రాత్రి మాత్రం బాగా తింటాను. వీలైనప్పుడల్లా వర్కవుట్ చేస్తుంటాను. అంతకు మించి మరేమీ లేదంది.

# మస్తానయ్య ఒక మెట్టు ఎక్కేశాడు!

4వ పేజీ కొరవ

తెలుగుదేశం ఓటర్ల సంగతి చెప్పనే అవసరం లేదు. తాను దళితుడిని కాబట్టి, నియోజకవర్గంలోని దళితులందరూ పార్టీలకు అతీతంగా తనకు ఓటు వేస్తారనే భ్రమ ఒకటి వుంది ఖాను రాజుకు. కానీ నియోజకవర్గంలోని ఏ దళితవాడల్లో కూడా ఆ సంకేతాలు కన్పించలేదు.

ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మూడవస్థానంలోకి జారుకొన్నది. డిపాజిట్‌కు కొంచెం అటు ఇటుగా మాత్రమే వుండబోతున్నాయి హస్తం ఓట్లు. అయితే ఈ నిజాన్ని అంగీకరించడానికి వివేకానందరెడ్డి సిద్ధంగా లేడు. నగరంలో తనకు ఓట్లు తగ్గినా, పల్లెల్లో మాత్రం కాంగ్రెస్ ఓట్లు తనకే పడతాయని, అందువల్ల తక్కువ తేడాతో అయినా తాను నెగ్గుతానని భావిస్తున్నారాయన. కౌంటింగ్‌లో ఒకటి రెండు రౌండ్లు నడిచిన తర్వాత కానీ ఆయన కళ్లు తెరిపినపడవు.

విచిత్రంగా ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల యంత్రాంగం విఫలమైంది. ముప్పై ఏళ్ల అనుభవం వున్న వివేకానందరెడ్డి ఎన్నికల నిర్వహణలో అంతగా చతికిలపడడం నమ్మలేని నిజం. నమ్మదగిన మనిషి అన్నవాడు పక్కనలేక పోవడం వల్లనే ఆయన చేతకానివాడి వలె మిగిలాడని చెప్పవచ్చు.

## అందరినీ భయపెడుతున్న తుపాకుల మునెమ్మ

కోవూరు నియోజకవర్గంలో ప్రజారాజ్యం అభ్యర్థిని తుపాకుల మునెమ్మ తతిమా ఇద్దరు అభ్యర్థులకు నిద్రలేని రాత్రులు సృష్టించింది. మాట నిలబెట్టుకోవడానికి చిరంజీవి ఆమెను అభ్యర్థిగా నిలబెట్టాడే తప్ప, నియోజకవర్గంలో ఆమె ప్రభావం ఏమీ వుండక పోవచ్చునని, జనం పట్టించుకోరని ప్రచారం జరిగింది. కానీ తీరా పోలింగ్ నాటికి పరిస్థితిలో చాలా మార్పు. అడగకుండానే, చిల్లిగవ్వ ఖర్చు పెట్టకుండానే, కార్యకర్తలు పని చేయకుండానే, పోలింగ్ ఏజంట్లు లేకుండానే జనం ఆమెకు ఓట్లు వేశారు. కోవూరులో గిరిజనులు ఎక్కువ కాబట్టి, ఆమె ఆ ఓట్లకు పరిమితం కావచ్చునని, అవి సాంప్రదాయంగా తెలుగుదేశం ఓట్లు కాబట్టి, ఆ పార్టీ అభ్యర్థి నష్టపోవచ్చునని వేసిన అంచనా కూడా తప్పని తేలింది. తుపాకుల మునెమ్మకు గిరిజనులతో పాటు, మాల, మాదిగ కులాలకు చెందిన దళితులు కూడా పెద్ద ఎత్తున ఓటు వేశారు. బలిజ కులంతో పాటు, కొన్ని బిసి ఓట్లను కూడా ఆమె ఆకర్షించగల్గింది. కొన్ని దళితవాడలవాళ్లు పట్టుబట్టి, ఆమెను తమ వూరికి పిలిపించుకొని, ఎన్నికల ఖర్చుకోసం చందాలు పోగేసి ఇచ్చారు. ఇంటింటి దగ్గర ఆపి, ఐదు పది రూపాయలు చేతిలో పెట్టారు. తతిమా అభ్యర్థుల దగ్గర బలవంతం చేసి నోట్లు తీసుకొన్న ఓటర్లు, మునెమ్మకు మాత్రమే తామే చందా ఇవ్వడం తేలికగా తీసుకోదగిన పరిణామం కాదు.

కాంగ్రెస్ అభ్యర్థి పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి చాలా నమ్మకంతో వున్నారు. ఎన్నికల కోసం గాడిద చాకిరీ చేశాడాయన. ప్రతి గ్రామం తిరగడమే కాదు, ప్రతి గడప ఎక్కి ఓట్లు అడిగాడు. ఓటుకు మూడు వందల రూపాయల డబ్బు చేర్పించారు. అడిగిన వాడికి అడిగినంత చీప్ లిక్కర్ అందజేశాడు. చివరి మూడు రోజులూ నియోజకవర్గంలో మద్య ప్రవాహమే నడిచిందని చెప్పవచ్చు. అయితే కాంగ్రెస్‌వాదుల నుంచి ఆయనకు కొన్ని ఇబ్బందులు ఎదురైనాయి. టిక్కెట్ సమయంలోనే తిరుగుబాటు ప్రకటించిన పట్టాభి, యూత్ కాంగ్రెస్ ప్రవీణ్‌వంటి వారు పోలింగ్ రోజు తమ వూళ్లలో పోలింగ్ కేంద్రాల దగ్గర నిలబడి మరీ వ్యతిరేకం చేశారు. వారి ప్రభావం ఎంత అన్నది వివాధాస్పదమైనప్పటికీ, పోటీ తీవ్రంగా వుండేచోట ఒకటి రెండు ఓట్లు కూడా లెక్కలోకి వస్తాయి కదా? అయితే సిపిఎం ఓటర్లు, కార్యకర్తలలో సింహభాగం కాంగ్రెస్‌కు చేరువ కావడం శ్రీనివాసులురెడ్డికి కలిసి వచ్చిన పరిణామం. కాంగ్రెస్‌వాదులు చేసిన నష్టాన్ని కమ్యూనిస్టులు పూడ్చారని భావిస్తున్నాడాయన.

తెలుగుదేశం అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కూడా గెలుపు పట్ల అమితమైన విశ్వాసంతో వున్నాడు. గత ఎన్నికలలో ఓడిపోయానన్న సానుభూతి, సిపిఎం ఓట్ల కలయిక, కాంగ్రెస్ అభ్యర్థి మీద వున్న వ్యతిరేకత కలగలసి తనను గెలిపిస్తాయని ఆయన నమ్మకం. ఈసారి తాను గెలిస్తే, తెలుగుదేశం అధికారంలోకి వస్తే తాను మంత్రి కావడం ఖాయమన్న ఆశ ప్రసన్నలో వుంది. అందువల్ల తన సర్వం ఒడ్డి పోరాటం చేశాడు. డబ్బు కూడా లోపం లేకుండా చూశాడు.

తుపాకుల మునెమ్మ కేవలం యానాది ఓట్లను మాత్రమే చీల్చి వుంటే ప్రసన్న మొదటి రౌండులోనే వెనక్కు వెళ్లిపోతాడు. కానీ ఆమె బిసి, పట్టపు, బలిజ, దళిత ఓట్లను కూడా కొంత పంచుకొని వుంటే మాత్రం కాంగ్రెస్ అభ్యర్థి ఇరకాటంలో పడతాడు. అసలు రెడ్డి, కమ్మ తప్ప అన్ని కులాల వారు ఏకోన్ముఖంగా మునెమ్మకు ఓటు వేసి చూద్దామని సరదాపడి వుంటే, ఈ ఇద్దరూ గాలిలో కలిసిపోతారు. కోవూరు నియోజకవర్గం ఫలితం పూర్తిగా మునెమ్మ ఆకర్షణ మీద ఆధారపడి వుంది. ఆమె ఎవరి కొంప ముంచారో తెలియడం లేదు. ఒకవేళ ఇద్దరి కొంపలూ పెన్నలో ముంచి తాను గట్టెక్కిందా అనే అనుమానం కూడా వుంది. ఇది మరీ అతిశయోక్తిగా కనిపించవచ్చు. కానీ ఆధారం లేనిది మాత్రం కాదు. కోవూరు నియోజకవర్గంలో గెలుపు ఎవరిది అన్న వూహాగానం చేయడం వీలు కావడం లేదు. కొంత మేరకు కాంగ్రెస్ బయట పడవచ్చునన్న సంకేతాలున్నా, దీన్ని తీవ్రమైన పోటీ జరిగే నియోజకవర్గంగా మాత్రమే చెప్ప గల్గుతున్నాము.

## మస్తానయ్య గెలిచినట్లే

కావలి శాసనసభా నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బీద మస్తాన్‌రావు గెలిచిపోయాడని చెప్పడానికి ఎంతమాత్రం సందేహించవలసిన అవసరం లేదు. దాదాపు పదేళ్ల రాజకీయ పోరాటం తర్వాత ఒక మెట్టు పైకి ఎక్కగలిగాడు మస్తానయ్య. 1999లో ఆదాల ప్రభాకరరెడ్డి తెలుగుదేశం తరపున అల్లూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి బీద సోదరులు రాజకీయ చురుకుదనం పెంచారు. అంతకు క్రితమే ఇస్కపల్లి పంచాయితీ రాజకీయాలలో వారి కుటుంబం పెత్తనం చేస్తున్న, నియోజకవర్గ స్థాయికి ఎదగడం అదే ప్రథమం. అప్పటి నుంచి వారు రాజకీయాల పేరిట ఎన్ని కోట్ల రూపాయలు తగలేశారో లెక్కలేదు. జరిగిన ప్రతి


నియోజక వర్గాల సమీక్ష 2009

ఎన్నిక భారమూ వారిదే. కానీ పదవుల వేటలో మాత్రం ఇంతకాలం విఫలమౌతూ వచ్చారు. అల్లూరు ఎమ్మెల్యేగా గత పర్యాయం పోటీ చేస్తే, కొద్ది తేడాతో ఓటమి ఎదురైంది. జిప ఛైర్మన్ పదవి కోసం ఆశపడితే, చేతికి అందినట్లే అంది జారిపోయింది. చంద్రబాబుకు మస్తానయ్య, రవి అంటే ఎందువల్లనో ప్రత్యేక అభిమానం. అందుకోసం రాష్ట్ర తెలుగు యువత అధ్యక్ష పీఠంతో సత్కరించాడు.

కావలి నియోజకవర్గం ప్రజలు కూడా బీద మస్తాన్‌రావు పట్ల అటువంటి అభిమానమే చూపారు. పార్టీలకు అతీతంగా ఆయన్ను ఆదరించారని చెప్పవచ్చు. అల్లూరు, దగదర్తి, బోగోలు మండలాలలో మస్తానయ్యకు కాంగ్రెస్, తెలుగుదేశం ఓట్లు రెండూ పడ్డాయని తెలుస్తున్నది.

ప్రజారాజ్యం అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చివరిదశ వరకు భీషణ ప్రతిఘటన ఇచ్చాడు. ఆయన కావలి స్థానికుడు. బాగా సంపన్నుడు. ప్రచారంలో, ఓటుకు నోట్లు పంచడంలో, మద్యం ప్రవహింపచేయడంలో, కార్యకర్తలను సంతృప్తిపరచడంలో, నాయకులను టోకున కొనుగోలు చేయడంలో బీద మస్తాన్‌రావుకు ఎంత మాత్రం తగ్గలేదు. నువ్వా నేనా అనే రీతిలో చివరి వరకు పోటీకి వచ్చాడు. కావలిటౌన్‌లోని బలిజ కులస్తులు, తీర ప్రాంతంలోని పట్టపుపాళాలు, వైశ్యులు అన్ని చోట్ల వలె ఇక్కడ కూడా చిరంజీవి అభిమానంతో ఓటు వేసి వుంటే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి సులభంగా గెలిచిపోయి వుండేవాడు. కానీ మస్తానయ్య మీద వున్న ప్రత్యేక అభిమానంతో పట్టపుపాళాలన్నీ చిరంజీవి మోజు ప్రక్కనపెట్టి సైకిల్‌ను వరించాయి. వైశ్యులలో మహిళలు మత్రమే రైలు యింజన్ మీద గుద్దారు. మగవాళ్లు తెలుగుదేశాన్ని వరించారని వినికిడి. బిసి ఓట్ల విషయంలో కూడా తతిమా చోట్ల వలె ఇక్కడ లాభపడలేకపోయింది ప్రజారాజ్యం. యాదవ కులస్తులు మొత్తం పార్టీలు చూడకుండా తెలుగు గుర్రమెక్కారు. మస్తానయ్య బిసి కావడమే అందుకు కారణం.

కాంగ్రెస్ అభ్యర్థి కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ఎన్నికల రంగంలో నిలబడలేకపోయాడు. వైఎస్ మీద అభిమానంతో జనం తనకు ఓట్లు వేసి గెలిపిస్తారన్న ఆశ ఆయనలో ఇంకా దాచనప్పటికీ, ఆయన్ను కాంగ్రెస్‌వాదులు కూడా పరిగణనలోకి తీసుకోలేదన్నది నిజం. స్వంత గ్రామమైన అల్లూరులో కూడా మైనస్‌లో పడిపోయారాయన. ఆయన మేనమామ కుమారుడు అల్లంపాటి విజయవర్ధన్‌రెడ్డి ఈసారి తెలుగుదేశం విజయం కోసం హైదరాబాద్ వ్యాపారాలు వదలి పెట్టి అల్లూరులోనే మకాం పెట్టి పని చేశాడు. ఆయన మంత్రాంగం ముందు విష్ణు చాలలేదు. విజయవర్ధన్‌రెడ్డి ఈ ఒక్క గ్రామంలోనే సైకిల్‌కు రెండువేల ఓట్ల మెజార్టీ తెచ్చాడని చెప్పున్నారు. మస్తానయ్య స్వగ్రామం ఇస్కపల్లిలో మూడువేల ఓట్ల మెజార్టీ ఖాయమంటున్నారు. కాంగ్రెస్‌పార్టీకి నియోజకవర్గం మొత్తం మీద మూడవ స్థానం మాత్రమే దక్కబోతున్నది.

## మసకబారిన మేకపాటి ప్రతిష్ట

ఉదయగిరిలో కాంగ్రెస్ అభ్యర్థి మేకపాటి చంద్రశేఖరరెడ్డి ఈసారి కష్టాలలో పడ్డాడనే అన్పిస్తున్నది. తన అన్న మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఇదే నియోజకవర్గ పరిధిలోకి వచ్చే నెల్లూరు లోక్‌సభ స్థానం నుంచి పోటీ పడుతున్నాడు కాబట్టి, ఉదయగిరిలో ఆయనకు అత్యధిక మెజార్టీ తెచ్చి ప్రతిష్ట పెంచుకోవాలని చాలా ప్రయత్నం చేశాడు శేఖరరెడ్డి. కానీ ఆ ప్రయత్నం విఫలమైనదనే చెప్పాలి. ఒక్క ఉదయగిరి, కలిగిరి మండలాలలో మాత్రమే కాంగ్రెస్ అనుకూలత కన్పించింది. దుత్త

కొరవ 15వ పేజీలో


జయహో - కృష్ణచైతన్య... ఇంటర్ ఫలితాలలోనూ No:1

అతి సాధారణ విద్యార్థులచే... నాలుగు జిల్లా ప్రథమ స్థానాలు సాధించాం.

కేవలం 3సం॥లలోనే ఇంతటి ఘన విజయం సాధించడం - నెల్లూరు జిల్లా రికార్డ్.

Jr. M.P.C



1st 463/470

విష్ణువర్ధన్‌రెడ్డి 463/470
నెల్లూరుజిల్లా టాపర్ (రాయలసీమ, కోస్తా జిల్లాల ప్రథమ స్థానం)


Jr. M.E.C



1st

ఆకాంక్ష
470 మార్కులతో - MECలో జిల్లా ప్రథమ స్థానంలో సంచలనం సృష్టించింది.

Sr. Bi.P.C



1st

తేజస్విని 979/1000
నెల్లూరుజిల్లా ప్రథమ స్థానం - Bi.P.C

Sr. M.P.C



983/1000

లావణ్య - M.P.C
రాష్ట్ర స్థాయి మార్కులు

Sr. M.E.C



1st

V.V.నిరీహ Sr.M.E.Cలో 958/1000
జిల్లా ప్రథమ స్థానం సాధించింది.

ఇలా కేవలం... 3సం॥లలో అద్భుత రికార్డులు.

కృష్ణ చైతన్య విద్యా సంస్థలు
నెల్లూరు
Ph: 92487 48101 TO 44

## కల్లగా మారిన కల

మొదటి పేజీ కొరవ

వాటిలో సగం నిర్మాణం పూర్తి అయ్యింది. గుడిసె కాపురం మాని, పక్కా ఇంట్లో సంసారం చేసుకొంటున్నారు పేద ప్రజలు. తమకింత గూడు చూపించిన ముఖ్యమంత్రిని వారు మరవరన్నది మూడవ కారణం.

జలయజ్ఞం ప్రాజెక్ట్‌ల వల్ల చాలా ప్రాంతాలలో సాగునీటి సమస్య తీరిపోయింది. మెట్ట పొలాలు మాగాణులుగా మారాయి. భూముల ధరలు ఆకాశానికి ఎగబ్రాకాయి. ఎకరా 50వేల నుంచి లక్ష రూపాయల లోపల ఖరీదు చేసే భూములు కాస్తా ఐదు నుంచి పది లక్షల రూపాయలు పలుకుతున్నాయి. పదెకరాల పొలం వున్న రైతు కూడా కోటీశ్వరుడుగా మారాడు. వారి కుటుంబాలలో నిశ్చింత ఏర్పడింది. జీవితం మీద ఆశ, ధైర్యం పెరిగాయి. తమ బ్రతుకులలో ఇంత గొప్ప ఆశాదీపాలు వెలిగించిన దేముడుగా వైఎస్‌ను వారు పూజిస్తున్నారన్న అభిప్రాయం కాంగ్రెస్ వాదులలో వుంది.

ఈ అన్ని కారణాల వల్ల ఈసారి ఎన్నికలలో వైఎస్ బొమ్మ చూసి జనం ఓట్లు వేశారన్నది ఆ పార్టీ నేతల అభిప్రాయం. తమ గెలుపు ఖాయం కావడమే కాదు, మెజార్టీలు కూడా మహత్తరంగా వుండబోతున్నాయని అంచనా వేస్తున్నారు.

అయితే వాస్తవంలో పరిస్థితి అందుకు భిన్నంగా వుందని మా అభిప్రాయం. ఎన్నికల సరళిని నిశితంగా పరిశీలించిన తర్వాత, పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల మనోభావాలను దగ్గర నుంచి చూసి అర్థం చేసుకొన్న తర్వాత మేము ప్రకటిస్తున్న అభిప్రాయం ఇది. ఈసారి ఎన్నికలలో కాంగ్రెస్‌వాదుల అంచనాలు తలక్రిందులు కావడం ఖాయం. వైఎస్ రాజశేఖరరెడ్డి కంటున్న కలలు కల్లలుగా మారడం నిజం. అందులో మా వరకు ఏ మాత్రం సందేహం లేదు.

పోలింగ్ కేంద్రాల వద్దకు వచ్చిన ఏ ఓటరు కూడా వైఎస్ పట్ల విమర్శ చేయలేదు. ఆయన సరిగా పని చేయలేదని ఆరోపించలేదు. చేసిన మంచి చాలదని అసంతృప్తి ప్రకటించలేదు. కానీ వైఎస్‌కు లేదా కాంగ్రెస్ పార్టీకి మాత్రం బాక్సులు నిండిపోయే రీతిలో ఓటు మాత్రం వేయలేదు. ఓటు దగ్గరకు వచ్చేసరికి ఓటర్ల ప్రాధాన్యతలు మారిపోయాయి. కులం, చంద్రబాబు రెండు వేల రూపాయల పథకం, వైఎస్ ప్రభుత్వ అవినీతి, స్థానిక సమస్యలు, కాంగ్రెస్ అభ్యర్థుల మీద వ్యతిరేకత, సిట్టింగ్ ఎమ్మెల్యేల మీద అయిష్టత, కాంగ్రెస్ కార్యకర్తలలోని అసహనం, అసంతృప్తి వంటి అంశాలు ఎన్నో ఎనెన్నో పరిశీలనకు వచ్చాయి. వైఎస్ చేసిన మంచి కంటే ఈ అంశాలు ముఖ్యంగా కనిపించాయి. మరొకప్రక్క రేపు అధికారంలోకి అటు ఎవరు వచ్చినా, చంద్రబాబు అయినా, చిరంజీవి అయినా ఇప్పటివరకు అమలు చేస్తున్న పథకాలు వేటినీ కదిలించబోరన్న అభిప్రాయం ఓటర్లలో ఏర్పడింది. ఇప్పటికే చేసిన మేలు గురించి తప్ప కొత్తగా చేయబోయే ప్రయోజనాల గురించి వైఎస్ ఏమీ చెప్పలేదు. కానీ చంద్రబాబు, చిరంజీవి కొత్త ఆశలు రేకెత్తించారు. అందువల్ల వైఎస్‌లో వారికి ఈ ఎన్నికలలో ప్రత్యేక గుర్తింపు కనిపించలేదు.

సిట్టింగ్ ఎమ్మెల్యేలలో ప్రజా వ్యతిరేకత వున్న వారికి టిక్కెట్ ఇచ్చేది లేదని మొదట మొదట ఘనంగా ప్రకటించాడు వైఎస్. సిఎల్పీ సమావేశంలో కానీ, చివరిసారిగా జరిగిన మంత్రివర్గ సమావేశంలో కానీ ఆ మాట కుండ బ్రద్దలు కొట్టినట్లు చెప్పాడు. అయితే అభ్యర్థుల ఎంపిక దగ్గరకు వచ్చేసరికి ఆ పాతముఖాలకే టిక్కెట్లు ఇచ్చాడు. పండగ పూట కూడా పాత మొగుడేనా అన్న సామెతగా వైఎస్ ఎంపిక చేసిన అభ్యర్థులను తిరస్కరించారు జనం. ఆయన మీద అభిమానం వున్నా వీరి పాతకాలు సహించలేక ఇతర పార్టీలకు ఓట్లు వేశారు.

కులాభిమానం కూడా కాంగ్రెస్‌ను పెద్దఎత్తున దెబ్బ తీసిందన్నది మా అంచనా. ఒక్కరెడ్లు తప్ప మరే కులమూ కాంగ్రెస్ పట్ల సానుకూలత చూపలేదు. కమ్మవాళ్లు టిడిపికి, బలిజవాళ్లు ప్రజారాజ్యానికి పూర్తిస్థాయిలో వలస వెళ్లారు. ఈ నూతన కుల సమీకరణలో బిసి కులాలు చాలా గందరగోళానికి గురైనాయి. వారిలో అధిక సంఖ్యాకులు చిరంజీవిలో ఒక నూతన నాయకత్వాన్ని, కొత్త ఆశను ధరించారు. బిసిలకు రాజ్యాధికార అవకాశం దొరికినప్పుడు వదలుకోవడం ఎట్లా అన్న ఆలోచనలో పడ్డారు. నీళ్ల కంటే రక్తం చిక్కన అన్న సామెతను రుజువు చేస్తూ కులాభిమానంతో ప్రజారాజ్యానికి లేదా తెలుగుదేశానికి ఓటు చేశారు. ఈ పరిణామం వల్ల కాంగ్రెస్‌కు జరిగిన నష్టం అంతా ఇంతా కాదు.

ఎమ్మార్పీఎస్ ప్రభావంతో మాదిగ కులం మొత్తం కాంగ్రెస్ వ్యతిరేకంగా మారింది. మాల కులంలో కూడా యువకులు వలస వెళ్లిపోయారు. వారిలో ఏ మాత్రం విశ్వాసాన్ని, కృతజ్ఞతా భావాన్ని కలిగించలేకపోయాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి. ఇన్నికులాలలో వచ్చిన మార్పులు కాంగ్రెస్‌పార్టీని నిరాశపరిచాయి. వైఎస్ కలలను కల్లలు చేశాయి. ఇది నూటికి నూరు పాళ్లు నిజం. కౌంటింగ్ వరకు ఈ నిజాన్ని అర్థం చేసుకోవడం రాజశేఖర్‌రెడ్డికి సాధ్యం కాకపోవచ్చు. అప్పుడు అర్థమైనా చేయగలిగింది ఏదీ మిగలదు.

మారిన కుల సమీకరణాల వల్ల తెలుగుదేశానికి దెబ్బ తగల్లేదా అంటే, ఖచ్చితంగా తగిలింది. కానీ అది యానాది వంటి ఒకటి రెండు కులాలకు మాత్రమే పరిమితం.

పట్టణ ప్రాంత ఓటర్లలలో వైఎస్ ప్రభుత్వ అవినీతి, అహంకార ప్రవర్తనల మీద వ్యతిరేకత స్పష్టంగా కన్పించింది. దీనికితోడు అధిక ధరల బాధ. వైఎస్ ప్రభుత్వ పథకాలు పల్లె జనానికి చేరినంతగా పట్టణ ప్రాంతాల వారికి చేరలేదనడం నిజం. అందువల్ల వారిలో ఆయన పట్ల కృతజ్ఞత వుండే అవకాశం లేదు. టివి ఛానళ్లలో, పత్రికలలో అవినీతి కథలు చదివి, రాజకీయ వాదులంటేనే విసుగు, విరక్తి పెంచుకొన్నారు పట్టణ ప్రాంత ఓటర్లు. వారంతా ప్రజారాజ్యం వైపు వలస వెళ్లారు. కొత్తొక వింత పాతొక రోత అన్నట్లు ఓటు చేశారు.

కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, తమకు 230 సీట్లు దక్కుతాయని కాంగ్రెస్‌వాదులు ఘంటాపథంగా చెప్తున్నప్పుడు, పోటీ చేసిన ప్రతి అభ్యర్థి తాను గెలుస్తానన్న ధీమాతో వున్నప్పుడు, ఢిల్లీలో సోనియా గాంధీకి కూడా వైఎస్ ఆ మేరకు నివేదికలు సమర్పించినప్పుడు వైఎస్ కలలు కల్లలుగా మారుతున్నాయని చెప్పడం పూర్తి సాహసంతో కూడుకున్న మాట అవుతుంది. కానీ మా దృష్టిలో అది సాహసంగా కన్పించడం లేదు.

## ప్రాణప్రతిష్ఠ

మొదటి పేజీ కొరవ

బ్యాంక్‌లో తమ పేరిట అకౌంట్, డబ్బు తెచ్చుకోవడానికి గొప్ప గొప్పవారి వలె తమకూ ఒక ఎటిఎం కార్డు అన్న ఆలోచన వారిని ఉక్కిరిబిక్కిరి చేసింది. దాని ముందు తతిమావన్నీ వెనక్కు పోయాయి. కొన్ని వర్గాల మహిళలలో చిరంజీవి మీద మోజు కనిపించినా అధిక శాతం మహిళలు తెలుగుదేశం పార్టీని బేషరతుగా వరించారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే తమ జీవితాలు మారిపోతాయన్న ఆశకు లోనైనారు.

మరొకప్రక్క చిరంజీవి వైఫల్యం తెలుగుదేశం పార్టీకి రెండవ వరంగా మారిందని చెప్పవచ్చు. చిరంజీవి తన ప్రజారాజ్యం పార్టీని ఒక రాజకీయ వ్యవస్థగా రూపొందించి వుంటే, తెలుగుదేశం కోలుకోలేని దెబ్బ తిని వుండేది. కానీ ఆయన అనుభవరాహిత్యం, చేతకానితనం, కుటుంబసభ్యుల మితిమీరిన జోక్యం వంటి కారణాల వల్ల ఆయన పూర్తిగా వైఫల్యం చెందాడు. సరైన అభ్యర్థులను ఎంపిక చేయడం ఆయన వల్ల కాలేదు. నిలబెట్టిన అభ్యర్థులకు పార్టీపరంగా వ్యవస్థాపరమైన సహకారం అందించడం అసలే వీలు కాలేదు. బి-ఫారం ఇచ్చి గాలికి వదిలేశారు అభ్యర్థులను. వారిలో రాజకీయ సమర్థత, అనుభవం, ఎన్నికల నిర్వహణలో నైపుణ్యం వున్న వారు నెగ్గుక వచ్చారు. తతిమావారు చతికిలబడ్డారు. చాలా నియోజకవర్గాలలో ప్రజారాజ్యానికి ఓటు వేస్తే, ఓటు మురిగి పోతుందన్న అభిప్రాయం కన్పడింది. అటువంటి చోట్లంతా చంద్రబాబు లాభపడ్డాడు.

ప్రజారాజ్యం వల్ల తెలుగుదేశానికి అధిక నష్టం అని రాజకీయ పరిశీలకులు సూత్రీకరిస్తున్నారు. ఎన్‌డిటివి ప్రణయ్‌రాయ్ కూడా ఎన్నికల సమీక్షలో ఈ అభిప్రాయమే ప్రముఖంగా ప్రసారం చేశాడు. కానీ వాస్తవంలో ఆ పరిస్థితి కనిపించలేదు. ప్రజారాజ్యం ఓట్ల చీలిక వల్ల తెలుగుదేశం కంటే కాంగ్రెస్ పార్టీ అధికంగా నష్టపోయిందని మా అభిప్రాయం. అందువల్లనే తెలుగు వీరుడికి మళ్లీ ప్రాణ ప్రతిష్ఠ జరిగిందని సూటిగా చెప్తున్నాము.

ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేనాటికి తన గెలుపు మీద చంద్రబాబుకు నమ్మకం లేదు. అది అందరికీ తెలిసిన నిజం. అందువల్లనే మహాకూటమి రూపకల్పనకు చాలా కష్టపడ్డాడాయన. ఢిల్లీ వెళ్లి సిపిఐ, సిపిఎం కేంద్ర నాయకులను బ్రతిమలాడి ఒప్పించాడు. టిఆర్ఎస్ చంద్రశేఖరరావుతో చెప్పలేనన్ని బాధలు పడ్డాడు. ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నాడు. ఒక దశలో, అధికారం లేకపోతే పోయింది, ఈ అవమానాలు సహించడం నా వల్ల కాదని విసుక్కొన్న మాట వాస్తవం. మరొకప్రక్క ఎన్టీఆర్ కుటుంబ సభ్యులను ఒప్పించి, ప్రచారానికి తిప్పడానికి తన ఛోరణికి విరుద్ధంగా రాజీ పడవలసి వచ్చింది. ఇన్ని చేసినా గెలుస్తామా లేదా అన్న అనుమానం ఆయన్ను వేధించింది. కానీ రెండవదశ పోలింగ్‌నాటికి ఆ అపనమ్మకాలన్నీ గాలికి ఎగిరిపోయాయి. ముఖ్యమంత్రి కుర్చీ తన కోసం సిద్ధంగా వుందన్న భరోసా ఏర్పడింది.

రెండువేల రూపాయల పథకం, మారిన కుల సమీకరణాలు, కమ్మ కులస్తులందరూ ఈ అవకాశం పోతే మళ్లీ రాదన్న పంతంతో సర్వంఒడ్డి పని చేయడం, కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికలో వైఎస్ చేసిన తప్పిదాలు, సిట్టింగ్ ఎమ్మెల్యేల మీద వ్యక్తమైన వ్యతిరేకత వంటి అంశాలన్నీ కలిసి చంద్రబాబును మళ్లీ అధికార పీఠానికి దగ్గర చేశాయి.

## బోణీ అనుమానం

మొదటి పేజీ కొరవ

మాత్రమే ఈసాంప్రదాయానికి భిన్నంగా నాలుగు చోట్ల కాంగ్రెస్‌వా దులు, తతిమాచోట్ల తెలుగుదేశం విజయం సాధించింది. ఈసారి ముక్కో ణపు పోటీ జరిగింది. 1978 తర్వాత ముక్కోణపు పోటీ ఇదే ప్రథమం. ఆనాటి ఎన్నికలలో రెడ్డి కాంగ్రెస్, ఇందిరా కాంగ్రెస్, జనతా పార్టీలు పోటీ చేసినా ఒక్క ఇందిరా కాంగ్రెస్‌ను మాత్రమే వరించారు నెల్లూరు జిల్లా ఓటర్లు. తతిమా రెండింటినీ పూర్తిగా తిరస్కరిం చారు. ఈసారి ఆ తిరస్కార ప్రభావం ఒక్క కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ప్రాప్తిం చేట్లు కన్పడుతున్నది. తెలుగుదేశం, ప్రజారాజ్యం పార్టీలు తమ ఉనికిని కాపాడుకొనబోతున్నాయి.

## రామనారాయణరెడ్డి

15వ పేజీ కొరవ

కూడా తెలుగుదేశాన్ని వరించారు. ఒక్క గూడూరు టౌన్‌లో మాత్రం ప్రజారాజ్యానికి పెద్ద సంఖ్యలో ఓట్లు పడ్డాయి. పల్లె లలో దాని వునికి కన్పించలేదు.

జనార్ధనరెడ్డి గారు బహిరంగంగా పనబాక వ్యతిరేకత వ్యక్తం చేయలేదు. గానీ ఆయన మనసు కనిపెట్టిన అనుచరులంతా, తెలుగుదేశానికి సహకారం అందజేశారు. గూడూరు రూరల్, చిల్లకూరు, వాకాడు మండలాలలో తెలుగుదేశానికి ఆధిక్యత లభించబోతున్నది. గూడూరు టౌన్‌లో చెరి సగం. చిట్టమూరు, కోట మండలాలు మాత్రం కాంగ్రెస్ అనుకూ లత ప్రదర్శించాయి. మొత్తం మీద ఇక్కడ గెలుపు బల్లి దుర్గాప్రసాద్‌కే దక్కవచ్చు.

### ఆంబోతుల పోరు అర్థంకావడం లేదు

సర్వేపల్లి నియోజకవర్గంలో పరిస్థితి చాలా క్లిష్టంగా వుంది. కాంగ్రెస్, టిడిపి అభ్యర్థులిద్దరూ రాజకీయంగా ఆంబోతుల వంటి వారు. ఆర్థికంగా ఇద్దరి మధ్య హస్తిమసికాంతరం తేడా వున్నా, ఎన్నికల ఖర్చులో మాత్రం సమవుజ్జీలు. హోరాహోరీ పోరాటం చేశారు. ప్రతి ఓటు విలువైనదే అన్నట్లు ప్రచారం చేశారు. టక్కుటమార విద్యలు వేటినీ వదలిపెట్టలేదు. దాంతో పోటీ రసవత్తరంగా వుంది. ఆదాల ప్రభాకర్ రెడ్డి ఇంత కష్టం ఎప్పుడూ పడి వుండడనడం నిజం. ఒళ్లు సహకరించక పోయినా వంటి నిగువున కాలికి బలపం కట్టుకొని తిరి గాడు. ఆరోగ్యం ఏమాత్రం లెక్కచేయ లేదు. తెలుగుదేశం అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కొంటె మాటలతో మున్సిపలి పాడి చేతత్వం వున్నవాడు కాబట్టి మాటపడకుండా చూసుకోవడం కోసమే అంత పోరాడాడని చెప్పవచ్చు. పదవి కంటే పరువు ముఖ్యం అన్న రీతిలో పనిచేశాడాయన. చంద్రమోహన్‌రెడ్డికి ఇది రాజకీయ జీవన్మరణ సమస్య. తెలుగుదేశం అధికారంలోకి రాబోతున్నదన్న వార్తల నేపథ్యంలో తాను ఏ కారణం వల్లనైనా ఓటమి చవిచూస్తే రాజకీయంగా భూస్థాపితమైపో తానన్న భయం ఆయన్ను కలవరపర చింది. దాంతో సర్వం ఒడ్డి పోరాడాడు. దాదాపుగా అన్ని మండలాల్లో నువ్వా నేనా అనే రీతిలోనే ఓట్లు పడ్డాయి ఇద్దరికీ. ఎక్కడా కూడా పెద్ద తేడాలు వుండకపోవచ్చు. ఎవరి ఆధిక్యమైనా వందలలోనే తప్ప వేల సంఖ్య దక్కే పరి స్థితి లేదు.

## కాయ్ రాజా కాయ్

5వ పేజీ కొరవ

జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోనే వుంది. అయినా పందెంరాయుళ్లు గ్రామపెద్దల వద్ద డబ్బును జమచేసి గెలిచాక ఇవ్వమంటున్నారు.

## వడగళ్ల వాన

6వ పేజీ కొరవ

వాల్సి వచ్చింది. అసలే అంతంత మాత్రంగా పనిచేసే ఫోన్లు వర్షం వల్ల మూగబోయాయి.

## దురాక్రమణ

6వ పేజీ కొరవ

పట్టించుకోక పోవడం, ఆక్రమణదారులతో లాలూచీ పడడం వల్ల యదేచ్ఛగా ఆక్రమణలు చోటుచేసుకొంటున్నాయి.

## మత్స్యకారులు

7వ పేజీ కొరవ

చక ప్రమాదాలకు గురౌతున్నా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

## ఓట్ల కొనుగోలు

8వ పేజీ కొరవ

పర్యటనల్లోనూ జేబుదొంగలు తమ హస్తలాఘవం చూపించి వేలాది రూపాయలు దోచుకొన్నారు.

## ఎండలు

9వ పేజీ కొరవ

మినహా మరొకరికి వడదెబ్బ తగలక పోయినా తోటకూర కాడల్లా వడలి పోయారనడం నిజం.

## ముస్లింలు

9వ పేజీ కొరవ

గ్రెస్‌పై నమ్మకాన్ని వీడలేదు. నెల్లూరు రూరల్, రాపూరు టౌన్‌లో ఈ పరిస్థితి లేదు.

## అంగన్‌వాడీ

11వ పేజీ కొరవ

అందజేయాల్సిరావడంతో అంగన్‌వాడి వర్కర్లు ఆర్థిక ఇబ్బందులలో పడుతున్నారు.

# ఆనం రామనారాయణరెడ్డి గెలుపు నిజం కాదు!

13వ పేజీ కొరవ

లూరు, కొండాపురం, వింజమూరు, వరికుంటపాడు మండలాలు పూర్తిగా తెలుగుదేశం ఆధిక్యతను ప్రదర్శించాయి. సీతారామపురంలో ప్రజారాజ్యం జోరు కన్పిస్తున్నది. ఒకటికి నాలుగు మండలాలలో కులపరంగా శేఖరరెడ్డి వెనుకపడడం వల్ల కాంగ్రెస్ ఆశలు నీరు గారి పోతున్నాయి. నిజానికి ఈ నాలుగు మండలాలలోని కమ్మ కులస్తులకు తెలుగుదేశం అభ్యర్థి కంభం విజయ రామిరెడ్డి అంటే చెప్పలేని ఒళ్లు మంట. కానీ చంద్రబాబును చూసి ఓటు వేయాలన్న నినాదంతో తమకు ఇష్టం లేక పోయినా సైకిల్ ఎక్కారు.

మరోకప్రక్క ప్రజారాజ్యం అభ్యర్థి సుంకర అంజనాద్రి పెద్ద మొత్తంలో ఓట్లు చీల్చాడు. బలిజ కులస్తులతో పాటు, సాంప్రదాయకంగా కాంగ్రెస్‌తో వుండే యాదవ, ముస్లిం మైనార్టీ ఓట్లు కూడా ఆయనకు పడ్డాయని చెప్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడక ముందు నుంచే ప్రచారంలో ముందు మిగిలిన అంజనాద్రి, చివరి రోజులలో నిలబడి పోవడం గమనించదగిన పరిణామం. ఎన్నికల ఖర్చు కోసం ఆయన తెప్పిస్తున్న డబ్బు కట్టలను పోలీసులు స్వాధీనం చేసుకోవడం వల్ల ఈ ఇబ్బంది వచ్చినట్లుంది. కొంత కమిషన్ తీసుకొని డబ్బు తిరిగి ఇచ్చేసినా, దాన్ని ఎన్నికల వరకు బయటకు తీయరాదని ఆంక్ష విధించాడట ఒక పోలీసు ఉన్నతాధికారి. దానితో పోలింగ్‌రోజు ఏజంట్ ఖర్చులకు కూడా తడుముకోవాల్సి వచ్చింది. ఎన్నికల నిర్వహణలో విఫలమైపోయాడు. అప్పటివరకు అంజనాద్రి పెద్ద ఎత్తున డబ్బు పంచుతాడని ఎదురు చూసిన ఓటర్లు, అది చేతికి అందక పోవడంతో తెలుగుదేశానికి ఓట్లు వేశారు.

ఉదయగిరిలో మేకపాటి ప్రతిష్ట మసకబారినట్లే లెక్క విజయరామిరెడ్డి అదృష్టవంతుడు.

## రామనారాయణరెడ్డి గెలుపు నిజం కాదు

ఆత్మకూరులో కాంగ్రెస్ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి ఖచ్చితంగా గెలుస్తాడని ఒక ప్రచారం వుంది. ఆయన జిల్లాలోకే పెద్ద నాయకుడు కావడం, నియోజకవర్గంలో కాంగ్రెస్‌తో పాటుగా బొల్లినేని కృష్ణయ్య వర్గం మొత్తం తనతో కలిసి పోవడం, సంగం వంటి మండలాలలో ఇరు పార్టీల నేతలూ ఒకే తీపు ఎక్కడం వంటి పరిణామాల వల్ల తాను సునాయాసంగా గెలిచి పోతానని అంచనా వేస్తున్నాడాయన. కానీ అది వాస్తవిక అంచనా కాదు. గ్రామాల స్థాయిలో రెండు వర్గాలను కలిపే ప్రయత్నం వికటించింది. నాయకులు ఆయన దగ్గర డబ్బు తీసుకొని ఒకటైనా జనం మాత్రం ఎవరి దారిలో వారు నడిచారు. ఏకపక్షం అనుకొన్న సంగం మండలంలోనే కాంగ్రెస్ వెనుకపడబోతున్నది. ఆత్మకూరు టౌన్, ఎఎస్‌పేటలలో ముస్లిం మైనార్టీ ఓటర్లు ప్రజారాజ్యం అభ్యర్థి ఖాజావలి వైపు మొగ్గారు. లేకుంటే ఇవి కాంగ్రెస్ ఓట్లు. బలిజ, యాదవ కులం ఓట్లు కూడా ప్రజారాజ్యానికి వెళ్లినట్లు అంచనా.

తెలుగుదేశం అభ్యర్థి కొమ్మి లక్ష్మయ్యనాయుడు ఈ పరిస్థితులను చక్కగా వినియోగించుకొన్నాడు. గత ఎన్నికలలో జనం నుంచి చందాలు దండిన ఆయన ఈసారి ధారాళంగా డబ్బు ఖర్చు చేశాడు. ఎమ్పీ అభ్యర్థి వంటేరు వేణుగోపాలరెడ్డి అందుకు అన్నివిధాల సహకరించాడు. తెలుగుదేశం ఓటు ఒక్కటి లీరు పోకుండా రాబట్టుకోగలగడంలోనే కొమ్మి విజయం సాధ్యమౌతున్నది. రామనారాయణరెడ్డి తన కాంగ్రెస్ ఓట్లలో కొన్నింటిని ప్రజారాజ్యానికి చేజార్చుకొని వెనుకపడి పోయాడు.

ఆత్మకూరులో రామనారాయణరెడ్డి ఓటమి కాంగ్రెస్‌వాదులు ఎవరూ నమ్మలేని వాదన. కానీ అదే నిజం కాబోతున్నది.

## రాజ్యలక్ష్మమ్మకు ఆశాభంగం

వెంకటగిరిలో వరసగా మూడవ సారి గెలిచి హ్యాటిక్ కొట్టాలని ఉరఉరలాడిన కాంగ్రెస్ అభ్యర్థిని నేదురుమల్లి రాజ్యలక్ష్మమ్మకు ఓటర్లు నిరసన మిగిల్చారని చెప్పక తప్పదు. ఎన్నికలకు ముందే నియోజకవర్గంలో ఆమెకు అనుకూలత లేదన్న సంకేతాలు స్పష్టంగా వెలువడ్డాయి. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు అలుకపాన్పులు ఎక్కారు. వారిని బుజ్జగించడం పెద్ద పని కాదని నేదురుమల్లి జనార్ధనరెడ్డి గారు భావించారు. అందుకోసం వెంకటగిరిలో మకాం పెట్టారు. బాలాయపల్లి, డక్కిలి మండలాలకు స్వయంగా వెళ్లి గ్రామస్థాయి నేతలను కూడా మచ్చిక చేసుకొన్నారు. కానీ ఆయన ముందు మొగమాటానికి సరే అన్న వారంతా గ్రామాలకు వెళ్లి తమ పని తాము చేశారు. చివరి నిముషంలో పెద్ద రాజావారు తన అనుచరులకు కాంగ్రెస్‌కు సహాయపడమని ఇచ్చిన ఆదేశం తమకు ఉపకరిస్తుందని జనార్ధనరెడ్డి వేసుకొన్న అంచనా కూడా తప్పిపోయింది. రాజా చెప్పినా తెలుగు దేశంవాదులు విన్పించుకోలేదు. మరొక ప్రక్క కొత్తగా నియోజకవర్గంలోకి వచ్చి చేరిన రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలలో కాంగ్రెస్ బాగా వెనుకపడింది. ఈ మూడు మండలాలలోని కమ్మ, బలిజ, యాదవ ఓటర్లు అటు తెలుగుదేశానికి, ఇటు ప్రజారాజ్యానికి వలస వెళ్లారు. ఆనం రామనారాయణరెడ్డి అనుచరులు కూడా పైకి నటించారే తప్ప పని చేయలేదు. కొంతమంది అంతరంగిక గ్రామ పెద్దలకు ఆయన కనుగీటి చెప్పాడట, కాంగ్రెస్‌ను ఓడించమని. దీనివల్ల గుండవోలు, పెనుబర్తి, గోనుపల్లి, సెల్లటూరు పంచాయితీలలో కాంగ్రెస్‌కు పూడ్చలేని లోటు ఏర్పడింది. రాపూరు టౌన్‌లో ఎల్లసిరి శ్రీనివాసులు రెడ్డి ప్రభావం అసలు పని చేయలేదు. ఆయన కాంగ్రెస్‌లో చేరాడు కానీ, తన అనుచరులను వెంట తీసుకొని రాలేక పోయాడు. పావకన్ను రాజశేఖరరెడ్డి తెలుగుదేశం యంత్రాంగం మొత్తాన్ని పట్టి వుంచగలగడంతో ఎల్లసిరి ప్రయోగం వృధా అయిపోయింది. దానిమీద పెట్టిన ఖర్చు కూడా దండగే.

ప్రజారాజ్యం అభ్యర్థి మేరగ మురళి కాంగ్రెస్ అవకాశాలను తీవ్రంగా దెబ్బ తీశాడు. కులపరమైన ఓట్లు, చిరంజీవి అభిమానం ఓట్లు బాగా రాబట్టుకొన్నాడు. కొండ క్రింద పల్లెలలో ప్రజారాజ్యం గాలి వీసినట్లు కన్పిస్తున్నది. కాంగ్రెస్ కంచుకోటల వంటి పారవోలు, సిద్దవరం, ఆముదూరు, ఆల్తూరుపాడు వంటి గ్రామాలలో మైనస్ అయ్యింది.

నియోజక వర్గాల సమీక్ష 2009

తెలుగుదేశం ఓట్లను పదిలంగా తన పెట్టెలో వేసుకోవడంలో ఆ పార్టీ అభ్యర్థి రామకృష్ణ సఫలీకృతుడైనాడు. రాజకీయంగా ఆయనకు పార్టీ మీద పట్టు లేకపోయినా, డబ్బుతో ఆ లోపాన్ని పూడ్చుకొన్నాడు. తెలుగు నేతలందరి మీద కనకవర్షం కురిపించాడు. వెంకటగిరి, డక్కిలి, రాపూరు మండలాలలో ఆయనకు తిరుగులేని ఆధిక్యత వస్తుందని అంచనా. కలువాయి, సైదాపురం మండలాలు, వెంకటగిరి టౌన్‌లలో ప్రజారాజ్యం పైచెయ్యి సాధించవచ్చు. ఈ పరిణామాల వల్ల కాంగ్రెస్ అభ్యర్థిని రాజ్యలక్ష్మమ్మకు ఆశాభంగం తప్పదం లేదు. ఇక్కడ గెలుపు తెలుగుదేశం రామకృష్ణదని చెప్పడానికి సందేహమేమీ లేదు.

## వాకాటి శ్రమ వృధా

సూళ్లూరుపేటలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించి ముఖ్యమంత్రి వద్ద తన ప్రతిష్ట కాపాడుకోవాలని కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మన్ వాకాటి నారాయణరెడ్డి చాలా కష్టపడ్డాడు. వ్యాపార సాపారాలు గాలికి వదలి నెలన్నరపాటు ఇదే పనిలో నిమగ్నమైనాడు. టిక్కెట్ విషయంలోనే పెద్ద ప్రయత్నం చేశాడు. సిట్టింగ్ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యాన్ని తప్పించి, తాను సిఫార్సు చేసిన విన్నమాల సరస్వతికి ఇప్పించుకొన్నాడు. అంత గట్టిగా టిక్కెట్ అడిగాను కాబట్టి, గెలిపిస్తేనే మర్యాద అన్నది ఆయన తాపత్రయం. కానీ జనం మాత్రం ఆయన శ్రమవృధా చేశారని అర్థమౌతున్నది.

తెలుగుదేశం అభ్యర్థి పరసా రత్నం సునాయాసంగా గెలవబోతున్నాడిక్కడ. గ్రామాలలో కొంతమేర కాంగ్రెస్ సానుకూలత వున్నా, సూళ్లూరుపేట, నాయుడుపేట టౌన్‌లు రెండూ తెలుగుదేశం వైపు మొగ్గడంతో ఆయన పని సులభమై పోయింది. పైగా పరసా, నియోజక వర్గానికి పాత కాపు. ఆయన సంబంధాలు తెలుగుదేశానికి పరిమితం కాదు. అన్నిపార్టీల వారినీ అక్కా అన్నా అంటూ మచ్చిక చేసుకోవడం అలవాటు. అతి వినయం నటించడం ఆయన తత్వం.

కాంగ్రెస్ అభ్యర్థిని విన్నమాల సరస్వతి జనానికి ఆనలేదు. పరసా ముందు ఆమె అభ్యర్థిత్వం తేలిపోయింది. కాంగ్రెస్ మండలస్థాయి నేతలు కొందరు వాకాటి నుంచి డబ్బు గుంజడానికి చూపిన చొరవ, పోలింగ్ రోజు కాంగ్రెస్‌కు ఓటు వేయించడానికి చూపలేదు. కానీ తెలుగు నాయకుడు వేనాటి చంద్రారెడ్డి చాలా గట్టిగా పని చేశాడు. ఆయనకు పరసాతో అంత సత్సంబంధాలు లేవు కాబట్టి, అనాసక్తంగా వుండి పోతాడని అనుకొన్నారు. కానీ చంద్రబాబు స్వయంగా భుజం తట్టడంతో శక్తికి మించి పనిచేశాడు చంద్రయ్య.

ప్రజారాజ్యం అభ్యర్థి ఈశ్వరమ్మ మరీ నీరసపడి పోవడం కూడా కాంగ్రెస్‌ను నష్టపరచింది. ఆమె అభ్యర్థిత్వం పట్ల నమ్మకం వుండి వుంటే, పట్టపుపాళాల ఓట్లు ప్రజారాజ్యం వెళ్లి వుండేవి. కానీ ఆమె గెలవదన్న అభిప్రాయం ఏర్పడడంతో అవన్నీ తెలుగు దేశానికి వెళ్లాయి. తమిళనాడు జాలర్ల సంఘం అందుకు తన పలుకుబడి వాడింది. బొమ్మన్ సుందరయ్య కుమారుడు కూడా మా తండ్రి పేరు నిలబెట్టండని ప్రాధేయపడ్డాడు.

మొత్తం మీద సూళ్లూరుపేటలో తెలుగుదేశం విజయం ఖాయమని చెప్పవచ్చు.


## నీరుగారిన పనబాక ఆశలు

గూడూరులో నేదురుమల్లి, నల్లపరెడ్డి ఆధిపత్యానికి గండికొట్టి, తన సామ్రాజ్యం స్థాపించుకోవాలని కలలుగన్న పనబాక లక్ష్మికి తీవ్ర నిరాశ తప్పలేదు. రెడ్డి రాజ్యాన్ని తన కాళ్ల క్రింద నలిపి పారేస్తాననే శపథంతో గూడూరు టిక్కెట్‌ను తన భర్త పనబాక కృష్ణయ్యకు ఇప్పించారామె. ముప్పయ్యేళ్లుగా నేదురుమల్లి జనార్ధనరెడ్డి ఈ నియోజకవర్గంపై పెంచుకొంటూ వచ్చిన పట్టును, పలుకుబడిని ఒక దెబ్బతో దుంపనాశనం చేయగలననే నమ్మకం పనబాకలో కన్పించింది. అందువల్లనే ముఖ్యమంత్రి వంటి పెద్దలు వారించినా వినకుండా సోనియా గాంధీ వద్దకు వెళ్లి, కళ్లలో నీరు కారించి, టిక్కెట్ తెచ్చుకొన్నారు. నియోజకవర్గంలోని కాంగ్రెస్, తెలుగుదేశం నేతలందరినీ టోకున కొనుగోలు చేశారు. నల్లపరెడ్డి హరనాథరెడ్డి, నేదురుమల్లి పద్మనాభరెడ్డి, రంజన్‌రెడ్డి, హిమకుమార్‌రెడ్డి వంటి వారిని కూడా లోబరచుకొన్నారు. కోట మండలంలో తమకు ఆగర్భ శత్రువుగా వుండిన కొడవలూరు ధనుంజయరెడ్డిని ఒప్పించారు. ఇన్ని చేశాము కాబట్టి, తమ గెలుపు నల్లేరు మీద నడక అని భ్రమపడ్డారు.

కానీ అక్కడ పరిస్థితి అందుకు విరుద్ధంగా మారింది. పనబాక కృష్ణయ్య గెలిస్తే, పల్లెల్లో రైతాంగం బ్రతకలేదనే భయం ఒకటి విస్తృతంగా వ్యాపించింది. దానితో ఆయన వద్ద డబ్బు దస్కం తీసుకొన్నవారు కూడా చివరి నిముషంలో మనసు మార్చుకొని, తెలుగుదేశం జెండా పైకి ఎత్తుకొన్నారు. ఆ పార్టీ అభ్యర్థి బల్లి దుర్గాప్రసాద్ అందరికీ అనుకూలుడు కావడం బాగా కలిసి వచ్చింది. ప్రజారాజ్యం అభ్యర్థి మరీ నీరసపడి పోవడంతో ఆ పార్టీ పట్ల మోజు వున్నవారు

కొరవ 14వ పేజీలో


## చతుర్ధ వర్ధంతి



శ్రీ ప్రత్తి నరసింహులుశెట్టి గారు
వ్యవస్థాపకులు : సాయినాథన్ & కంపెనీ, నెల్లూరు.

మా తండ్రి శ్రీ ప్రత్తి నరసింహులు శెట్టి గారు
మమ్ములను వీడి దైవసాన్నిధ్యం చేరి తేది 5.5.2009 మంగళవారం
నాటికి నాలుగు సంవత్సరాలు గడుస్తున్న సందర్భంగా వారి
ఆత్మకు చిరశాంతి కలిగించాలని సాయినాథుణ్ణి ప్రార్థిస్తూ...

ప్రత్తి రవీంద్రబాబు (కుమారుడు)
మరియు కుటుంబ సభ్యులు

| సాయినాథన్ & కంపెనీ | బాబు ఎలక్ట్రానిక్స్ | సాయి ఏజన్సీస్ |
|---|---|---|
| ట్రంకురోడ్డు, నెల్లూరు | ట్రంకురోడ్డు, నెల్లూరు | ట్రంకురోడ్డు, నెల్లూరు |
| ఫోన్: 2325078 | ఫోన్: 2324212 | ఫోన్: 2335678 |

# ఎప్పుడు జోస్యం చెప్పినా చీవాట్లే!

## ఫలితాలు చూసిన తర్వాత మాత్రం అందరి నోళ్లూ మూతపడడం సాంప్రదాయం!

శాసనసభ ఎన్నికలు జరిగిన ప్రతిసారీ ఎదురయ్యే సంకటం ఈసారి కూడా 'జమీన్‌రైతు' పత్రికకు. ఒక రకంగా ఇప్పటివరకు చూసిన ఎన్నికలన్నింటికంటే ఈసారి ఎన్నికలు చాలా సంక్లిష్టంగా, సంకటంగా వుంది. ఎన్నికలలో అభ్యర్థుల గెలుపు ఓటముల వూహాగానం లేదా జోస్యం వారి జన్మ నక్షత్రాల ఆధారంగా జరగదు. రాశి బలాల తూకంతో వేయలేము. ఆయా పార్టీల అనుకూలత, ప్రతికూలతలు; అభ్యర్థుల బలాబలాలను నిశితంగా పరిశీలించి, ప్రజాభిప్రాయమనే త్రాసులో ఎవరి తూకమెంతో అంచనావేసి, ప్రజల మనోగతం ఎట్లా వుందో పసిగట్టి, ఎన్నికల ఫలితాలను వూహించాలి. కత్తి మీద సాము వంటి మేధో కసరత్తు అది. కౌంటింగ్ ముందుగా ఫలితం వూహిస్తే, ఓడిపోతామని చెప్పినవారి మనసులు గాయపడతాయి. వారు చీవాట్లు పెడతారు, శాపనార్థాలు పరిస్తారు. ఏదో దురాలోచనతోనే, ఒకరి మీద అభిమానంతోనో, మరొకరి మీద దురుద్దేశంతోనో ఇట్లా వ్రాస్తున్నామని తిడతారు. ఎన్నికల ఫలితాల మీద కోపంతో 'జమీన్‌రైతు' పత్రిక ఆఫీసు మీద దాడులు జరిపిన సంఘటనలూ వున్నాయి. 1985 ఎన్నికలలో టిడిపితో పొత్తు పెట్టుకొని ఆత్మకూరు నుంచి పోటీ చేసిన బిజెపి అగ్రనేత వెంకయ్యనాయుడు ఓడిపోతున్నాడని పోలింగ్‌రోజు సాయంత్రమే ప్రకటించాము. పత్రిక వెలువడిన గంట లోపల బిజెపి కార్యకర్తలు వందల సంఖ్యలో ఆఫీసు మీద పడి విధ్వంసం సృష్టించారు. కానీ ఆ తర్వాత జరిగిన కౌంటింగ్‌లో మా అంచనాయే నిజమని రుజువైంది.

1978 ఎన్నికలలో ఇందిరా కాంగ్రెస్ విజయాన్ని ముందుగానే వూహించి ప్రకటించడం అప్పటికి జిల్లాలో రాజకీయ నిరంకుశులుగా చలామణీ అవుతున్న ఆనం కుటుంబానికి తీవ్ర ఆగ్రహం తెప్పించింది. 'జమీన్‌రైతు' పత్రిక ఆఫీసును తగలబెట్టమని ఆదేశించాడు ఆనం వెంకటరెడ్డి గారు. కానీ ఎందువల్లనో ఆ దుస్సాహసానికి పూనుకోలేకపోయారు.




ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ ఇట్లా వూహాగానాలు చేయడం, పాఠకుల చేత తిట్లు తినడం, రాజకీయ నాయకుల శాపాలు భరించడం 'జమీన్‌రైతు' పత్రికకు ఒక అలవాటుగా మారిపోయింది. అయితే గత ముప్పై నలభై ఏళ్లలో మేము చేసిన వూహాగానాలు ఎప్పుడూ తప్పిపోలేదు. జిప, మునిసిపాలిటీ వంటి స్థానిక సంస్థల ఎన్నికలలో ఒకటి రెండుసార్లు పొరపాట్లు జరిగి వుండవచ్చు కానీ, శాసనసభ ఎన్నికలలో ఏనాడూ తప్పు జరగలేదు. 'జమీన్‌రైతు' అంచనాకు అతికినట్లుగా సరిపోయే రీతిలోనే కౌంటింగ్ ఫలితాలు వెలువడ్డాయి.

1989, 1994, 1999, 2004 ఎన్నికలలో పోలింగ్ జరిగిన వెంటనే, కౌంటింగ్‌కు ముందుగా 'జమీన్‌రైతు' ప్రచురించిన అంచనాలు ఇదే పేజీలో ప్రచురిస్తున్నాము. వాటిని ఒక్కసారి చూస్తే మా అంచనాలు ఎంత ఖచ్చితంగా నిజమైనాయో అర్థమై పోతుంది. ఐదేళ్ల క్రితం జరిగిన 2004 ఎన్నికలను ఒక ఉదాహరణగా తీసుకొంటే, 'జమీన్‌రైతు' అంచనాల విశ్వసనీయత బోధపడుతుంది. ఆ ఎన్నికలలో కాంగ్రెస్ గెలుపు పట్ల కాంగ్రెస్‌వాదులలోనే పూర్తి స్థాయి నమ్మకం లేదు. పోలింగ్ తర్వాత వెలువడిన ఎగ్జిట్ పోల్స్‌లో కూడా ప్రసిద్ధ సంస్థలు తెలుగుదేశం పునః విజయాన్నే వూహించాయి. ఈనాడు దినపత్రిక తెలుగుదేశం కూటమికి 208 స్థానాలు వస్తాయని ప్రకటించింది. కాంగ్రెస్‌కు వారిచ్చిన స్థానాల సంఖ్య కేవలం 83. టివి9 ఛానల్ జరిపిన సర్వేలో తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీలకు మధ్య కేవలం నాలుగైదు స్థానాల వ్యత్యాసం మాత్రమే వుందని తేల్చి చెప్పింది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక తెలుగుదేశానికి మళ్లీ అధికారం ఖాయమని ప్రకటించింది. ఎన్డీటివి కూడా తెలుగుదేశం ఆధిక్యాన్ని వూహించింది.







కానీ 'జమీన్‌రైతు' పత్రిక మాత్రం చాలా సాహసంగా, తెలుగుదేశం 50 లోపు స్థానాలకు పరిమితం కాబోతున్నదని, చంద్రబాబు నాయుడును తెలుగు ప్రజలు సంపూర్ణంగా తిరస్కరించారని, దాన్ని పూర్తిస్థాయి చంద్రగ్రహణంగా వర్ణించవచ్చునని పోలింగ్ ముందు వెలువడిన సంచికలోనే ప్రచురించింది. ఆ వూహాగానం చదివి మమ్మల్ని శాపనార్థాలు పెట్టనివారు, ఎగతాళి చేయనివారు, తెలివి వుండే వ్రాశారా అని అడగనివారు లేరనడం నిజం. కాంగ్రెస్‌వాదులు కూడా తమకు అధికారం రావచ్చునని భావించారే తప్ప తెలుగుదేశం అంత ఘోరంగా 50 స్థానాల లోపు స్థాయికి దిగజారి పోతుందని వూహించలేదు. కల కూడా కనలేదు. అందువల్లనే 'జమీన్‌రైతు' అంచనాలు ఎవరూ నమ్మలేదు. కానీ తీరా ఫలితాలు వెలువడిన తర్వాత చూస్తే తెలుగుదేశం పార్టీకి కేవలం 47 స్థానాలు మాత్రమే వచ్చాయి.

నెల్లూరు జిల్లాకు సంబంధించి కూడా 2004లో మొత్తం 11 స్థానాలలోనూ తెలుగుదేశం హూష్‌కాకి అయిపోతున్నదని, అన్ని సీట్లనూ కాంగ్రెస్ గెల్చుకోబోతున్నదని ప్రకటించాము. దానిపై తెలుగుదేశం నేతలు మామీద విరుచుకపడ్డారు. మాది కాంగ్రెస్ పత్రిక కాబట్టి, అసత్య ప్రచారం చేస్తున్నదని నిందించారు. బహిరంగసభలలో కూడా మాకు రాజకీయ దురుద్దేశాలు అంటగట్టి మాట్లాడారు. కానీ తీరా కౌంటింగ్ జరిగిన తర్వాత చూస్తే మేమేమి వూహించామో అదే జరిగింది. 10 స్థానాలు కాంగ్రెస్‌కు, ఆత్మకూరు మాత్రం స్వతంత్రుడైన కొమ్మి లక్ష్మయ్యనాయుడుకు దక్కుతుందని మేము చెప్పినట్లే ఫలితాలు వెలువడ్డాయి. అప్పుడు కానీ తెలుగు నాయకుల నోళ్లు మూతపడలేదు.




ఎన్నికలు జరిగిన ప్రతిసారీ ఇట్లా జోస్యం చెప్పడం, చీవాట్లు తినడం మాకో అలవాటై పోయింది. తాత్కాలికంగా తిట్టుకొన్నా, చివరికొచ్చేసరికి ఎన్నికల ఫలితాల జోస్యంలో మా నైపుణ్యాన్ని పాఠకులు అర్థం చేసుకొంటారనే నమ్మకంతో ఎన్ని ఒత్తిడులు వచ్చినా అవమానాలు ఎదురైనా వాటిని కొనసాగిస్తూ వస్తున్నాము.

Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.